
ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



# యుగశక్తి  గాయత్రి



ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ | మాతృ దేవోభవ ! పితృ దేవోభవ ! ఆచార్య దేవోభవ ! అతిథి దేవోభవ ! | సజల శ్రద్ధ

సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
డా॥ ప్రణవ్‌పండ్యా
సంపాదకులు
బి.సి.హెచ్.వి. సుబ్బారావు
(అశ్విని)
ఉప సంపాదకులు
ముక్కామల రత్నాకర్
సంపాదక మండలి
సాధన నరసింహాచార్య
శ్రీమతి లక్ష్మీరాజగోపాల్
డి.వి.ఆర్. మూర్తి

సంపుటి 21 - సంచిక 02
జులై 2016

పత్రిక అందనివారు మరియు
పత్రికకు సూచనలు, సలహాలు
ఇవ్వదలచినవారు ఈ క్రింది
ఫోన్ నంబర్లలో సంప్రదించగలరు
040-23700722
99491 11175
94407 69798


## సత్సంగము

సత్సంగము అంటే సద్గురువు సన్నిధిలో ఉండడం. ఎవరికి అన్నీ తెలుసో ఆ వ్యక్తి సమీపంలో ఉండాలి ఎందుకంటే అలా తెలిసినవారు మాత్రమే మన అంతఃకరణలోకి ప్రవేశించగలరు. వారి ద్వారా సత్, సత్యములు చాలా స్వాభావికరీతిలో ప్రవహిస్తుంటాయి. అందుచేతనే సూఫీ ఫకీరు గురువుకి సమీపంగా, చాలా దగ్గరగా ఉంటేనే చాలు అంటారు. ఆయన సన్నిధిలో, ఆయనకు దగ్గరగా కూర్చున్నా, ఆయన చుట్టుప్రక్కలగా తిరిగినా, ఆయన నివసించే గది వెలుపలే ఉన్నా, రాత్రిపూట ఆయన గది ద్వారం వద్ద మెలకువతో కూర్చున్నా, ఆయనను స్మరించినా చాలు.

ఈ విధంగా గడపాలంటే తీవ్రమైన శ్రద్ధ ఉండడం చాలా అసవరం. ఆ శ్రద్ధయే మనల్ని సంవేదనాశీలురుగా తయారుచేస్తుంది. అలా మారిన మరుక్షణం సద్గురువు మన లోపల ప్రవహించడం మొదలుపెడతారు. శ్రద్ధ నిండిన ఆ క్షణాలు మనల్ని అత్యంత సంవేదనాపరులుగా తయారుచేస్తాయి. మరునిమిషం సద్గురుని యొక్క సత్యము మన అంతఃకరణలో ఉప్పొంగడం మొదలవుతుంది. ఇలా జరిగేందుకు ఎటువంటి శారీరిక ప్రయత్నాలు కానీ, బుద్ధిపరమైన ప్రయత్నాలు కానీ చేయాల్సిన పనిలేదు. అవసరమైనదల్లా సజల, సఘన శ్రద్ధ మాత్రమే. దేశము, స్థానము, సమయముల ఒక విశేషబిందువుపై ఈ సంఘటన ఎప్పుడు జరుగుతుందో అప్పుడు మాత్రమే సత్సంగమనేది సంభవమవుతుంది.

ఒక్కోసారి ఇందుకొరకు కొన్ని సంవత్సరాల సమయం పట్టవచ్చు. పడతాయి కూడా. ఈ సంవత్సరం మనమంతా మనలోని శ్రద్ధను ప్రగాఢం చేసుకుంటూ ఈ సంఘటన కొరకు ఎదురు చూడవలసిన సంవత్సరం. అందువల్ల ఈ సంవత్సరమంతా మనకు గురువుపెట్టే పరీక్షలే ఎదురవుతాయి. ఆయన మనకు ఎన్నో రకాల ఆటంకాలను కల్పిస్తారు. ఆయనను గురించిన ఎన్నోరకాల అపవాదులు మనదాకా చేరేలాగా చేస్తారు. అవి విని మనం ఆయనను వదిలివేసేందుకు, ఆయన చెప్పినవి తప్పు అనిపించేందుకు తగిన ఎన్నో అవకాశాలను కల్పించి ఆయనను వదిలి మనం పారిపోయేందుకు కూడా తగిన సహాయం చేస్తారు. ఇటువంటి ఈ పరీక్షా సమయంలో ఈ ఆటంకాలనన్నింటిని దాటుకుని మనం ముందుకు సాగాలి.

ఇంతటి అనివార్యమైన పరీక్షను తట్టుకుని నిలబడేందుకు బలహీనమైన, సాధారణమైన శ్రద్ధ ఎందుకూ పనికిరాదు. పరిపక్వమైన శ్రద్ధ మాత్రమే పరీక్షకు తట్టుకుని నిలబడి ఎదురుచూడగలదు. కేవలం అది మాత్రమే సత్సంగమును పొందగలుగుతుంది. అటువంటి శ్రద్ధను మన అస్తిత్వము యొక్క కణకణములో, లోలోపలి పొరల్లోకి ఇంకింపచేసుకోవాలి. అటువంటి శ్రద్ధ ఉన్నప్పుడు సమయము, స్థానము, దూరము అనేవాటికి విలువ ఉండదు, అవి అన్నీ వృథా అయిపోతాయి. సద్గురుని శరీరము లేకపోయినా ఈ సత్సంగము, సంపర్కములనేవి సంభవిస్తూనే ఉంటాయి. ఇటువంటి సత్సంగమందే గురువు శిష్యునికి దగ్గరగా వస్తారు, శిష్యునికి పూర్తిస్థాయిలో గురువు లభిస్తారు. సత్సంగము యొక్క ఈ క్షణాలు గురుపూర్ణిమ యొక్క సంపూర్ణమైన అర్థాన్ని మనకు తెలియపరుస్తాయి.

– అనువాదం: *శ్రీమతి వల్లీశ్రీనివాస్*

# విషయసూచిక


1. **సంపాదకీయం:** సత్సంగము 3
2. **విషయసూచిక-సద్గురువాణి:** వికాసక్రమం 4
3. **యుగనిర్మాణ చిత్రావళి - 15:** వశిష్ఠ మరియు చాణక్యులు-రాజ్యశక్తిపై అంకుశము 5
4. **పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర - 49:** హరిజనోద్ధరణకై కులవ్యవస్థ నిర్మూలనకై శ్రీరామ్ కృషి - 3 6
5. **సూక్ష్మీకరణ సాధన-8:** బాగు చేయడమే కాదు నిర్మాణము కూడా అవసరమే 9
6. **పరమపూజ్య గురుదేవుల అమృత వచనాలు - 11:** జ్ఞానసంపద 13
7. **తంత్ర విద్య-4:** లుప్తమైపోయినప్పటికినీ తంత్రవిద్య ప్రచండమైన సామర్థ్యము కలది 15
8. **మనం - మన ఆరోగ్యం:** మందులు వేసుకోవటము అత్యవసరము కాదు 19
9. **భారతీయ సమాజం ప్రవర్తనపై స్వామి వివేకానందుని విశ్లేషణ-2** 22
10. **గురుపౌర్ణిమ ప్రత్యేకం:** గురుకృప వలన క్రొత్త జన్మ లభించినది 26
11. **జ్యోతిర్విద్య:** సమగ్రజ్ఞానం అందరికీ అందాలి 29
12. **సురదుర్లభ మానవజన్మను సద్వినియోగం చేసికొందాం** 32
13. **అవసరానికి మించి ఏదీ కోరవద్దు** 34
14. **నీటి అలభ్యత నివారణకై సామూహిక సాధనా ప్రయోగం ఆరంభించండి** 36
15. **పూజ్య గురుదేవుల అమృతవాణి:** ఆధ్యాత్మికతకు సంబంధించిన మూడు అంశములు 37
16. **నా వారితో నా మాట:** మహాకాలుని అంచనాలకు నిలిచిన యువత 41
17. **ఆయుర్వేదవైద్యం-15 :** కరక్కాయలు-హరీతకి & వాము-యవాని 45
18. **స్ఫూర్తిదాయక గాయత్రీపరివార్ సభ్యులు-26** 46
19. **తొమ్మిది రోజుల సంజీవిని సాధనా శిబిరంపై నివేదిక-2** 47
20. **వార్తలు :** ఉభయ తెలుగు రాష్ట్రాలలో జరిగిన వివిధ కార్యక్రమాలు 48




## సద్గురు వాణి

## వికాసక్రమం

వస్తుతః అందరు మనుష్యులు కుసంస్కారులే. జీవి క్రమిక వికాసం అనే సుదూరమైన మార్గంలో పయనించి మనిషి స్థితికి చేరాడు. ఇదేమి అనాయాసంగా జరగలేదు. ఉత్తమ పరిస్థితిని ప్రాప్తించుకునేందుకుగల ఆకాంక్షల వలన తదనుసారంగా మానసికస్థితి ఏర్పడుతుంది. జీవధారి ఉచ్చస్థరీయ స్థితికి వరకు వెళ్ళాలనే అభిలాష అతనిని సృష్టి యొక్క మకుటమణి అని చెప్పగలిగే స్థితికి చేరుస్తుంది.

– అనువాదం: ముక్కామల రత్నాకర్


## యుగశక్తి గాయత్రి

**విడి ప్రతి రూ॥ 15/-** **సం॥ చందా రూ॥ 150/-**

**3 సం॥ చందా రూ॥ 420/-** **10 సం॥ చందా రూ॥ 1300/-**

చందా రుసుమును ఎట్ పార్ చెక్ ద్వారా (at par cheque) లేక డి.డి.ద్వారా కాని పంపగలరు. యం.ఒ. ద్వారా కూడా పైకం పంపించవచ్చు. కానీ యం.ఒ. ద్వారా వచ్చినప్పుడు పూర్తి అడ్రస్సు ఉండుట లేదు. అందువలన యం.ఒ. ద్వారా పైకం పంపినప్పుడు క్రింద ఇచ్చిన ఫోన్ నంబర్లను సంప్రదించి మీ వివరాలు అన్నీ ఇవ్వ ప్రార్థన. రూ.5,000 లేక అంతకన్నా ఎక్కువ పంపదలచుకున్నప్పుడు ఆన్‌లైన్ ద్వారా పంపవచ్చును. దీనికన్నా తక్కువ పంపేవారు, రూ. 50/- అదనంగా చేర్చి పంపాలి.

ఖాతాపేరు: **శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు**
బ్యాంకు పేరు: **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**
**ఎర్రగడ్డ శాఖ, హైదరాబాద్**
ఖాతా నెం.: **32506416087**
IFSC Code: **SBIN-0013272**


ఆన్‌లైన్‌లో పంపినప్పుడు బ్యాంక్ చలానా జిరాక్సు కాపీని మీ చిరునామా తెలుపుతూ తప్పక మాకు పంపించాలి.

**"శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు"**
**గాయత్రీ చేతనా కేంద్రము,** హెచ్.పి. రోడ్, మూసాపేట
అశ్విని హౌస్ దగ్గర, హైదరాబాదు - 500 018.
ఫోన్: 040-23700722, సెల్: 9949111175


**పదాలు తెలియని అమృత వాక్యం అమ్మ - ఆమె చల్లని ఒడిలో మొదలైంది ఈ జన్మ**

యుగనిర్మాణ చిత్రావళి-15

# వశిష్ఠ మరియు చాణక్యులు-రాజ్యశక్తి పై అంకుశము




చిత్రంలోని పై భాగంలో మహారాజు దశరథుడు వినమ్రశీలియై, వశిష్ట మహర్షి ఎదుట నిలచి ఉండగా, మహర్షి, వశిష్టుడు, అవసరమైన రాజకీయ కర్తవ్యబోధ చేయుచున్నాడు. ప్రాచీనకాలములో ధర్మ పాలన మరియు రాజ్యపాలనపై, తపో ధనుల నియంత్రణ కొనసాగేది అనెడిది తేట తెల్లమగుచున్నది. దీనికి భిన్నంగా శాసన వ్యవస్థ ఎప్పుడైన, ఎక్కడైనా నిరంకుశత్వంతో వ్యవహరించిన చోట అత్యాచారం మరియు రాజకీయ అధినాయకత్వం తల ఎత్తేది!

ఇట్టి సమయమందు ఋషులు, ప్రజలను శాసనవ్యవస్థ కబంధ హస్తాల నుండి రక్షించు టకై దానిపై ధర్మ వ్యవస్థతో అజమాయిషీ చేసేలా సమాజ, దేశాల నిర్మాణం గావించారు. దీని ఆవశ్యకత అన్ని యుగాలలో ఉంది, ఇక ముందు కూడా ఉంటుంది.

గురు వశిష్టుడు రఘువంశానికి రాజగురువు. ఆయన కనుసన్నలలో యావత్ రాజ్యపాలన జరిగేది. మహర్షికి తనకంటూ ఏమికోరికలు ఉండవు. ధర్మాధర్మ విచక్షణవేళ నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ, దూరదృష్టితో రాజ్యనిర్ణయాలను చేయుటలో తగినంత శక్తి సామర్థ్యాలు, తగిన యోగ్యతను కలిగి ఉండేవారు. తత్ఫలితంగా ఆయన నిర్ణయాలు తప్పుగా ఉండేవి కాదు. ఇందువలన శాసనవ్యవస్థకు చెందిన చిన్న చిన్న పనులు కూడా ధర్మాచార్యుల ఆజ్ఞకు లోబడి జరిగేవి. దశరథ మహారాజు మృతుడవ్వగా, యువరాజు భరతుడు, వశిష్టుని అనుమతితోనే తండ్రికి అంత్యక్రియలు చేశాడు. ఇది ఆనాటి ధర్మనిష్ఠ.

రెండవ చిత్రములో చాణక్యుడు, తన శిష్యుడైన చంద్ర గుప్తునికి అవసరమైన నిర్దేశాన్ని చేస్తున్నాడు. ఆనాడు శక్తివంతుడైన మహారాజు, చంద్రగుప్తుడు భారతదేశాన్ని ఏలాడు. ఇతనికి సాటిగా మరొకరు లేరు. ఈనాడు భారతదేశ వైశాల్యము ఎంత ఉన్నదో, ఆనాడు అంతకు మించిన విశాల సామ్రాజ్యాన్ని చంద్రగుప్తుడు పాలించాడు. ఇంతటి గొప్ప శక్తి శాలియైన చంద్రగుప్తుడు ఏనాడు, తన గురువైన చాణక్యుని ధిక్కరించుటకు సాహసించలేదు.

చాణక్యుడు కూడా వశిష్టునివోలే లోభత్వం లేనివాడు. చాణక్యుడు స్వయంగా పూనుకొని, చంద్రగుప్తుని రాజ్య సింహాసనంపై అధిష్టింప జేశాడు. గురువు ఆదేశానుసారం చంద్ర గుప్తుడు, నలంద, తక్షశిల విశ్వవిద్యాలయా లను స్థాపించాడు. ఈ విశ్వవిద్యాలయాలను చాణక్యుడు స్వయంగా నిర్వహించేవాడు. దీనికి తోడు చంద్రగుప్తునికి ప్రధానమంత్రిగా పనిచేశాడు. అయినప్పటికి రాజు నుండి, రాజ్యం నుండి తానుగా స్వార్థానికి ఏమి పొందలేదు చాణక్యుడు. కోరినచో ఆయనకు మహలు, రథము, సేవకులు, ఏనుగులు, గుఱ్ఱాలు మరియు బహు విలువైన వస్త్రాభరణాలు అధికారికంగా లభించగలవు. కాని దీనివలన ధర్మతంత్ర వ్యవస్థకు గౌరవం తగ్గిపోతుంది. రాజ్యధర్మాచార్యునిగా త్యాగి-తపస్వి ఉండాలి. అట్టివాడే ధర్మతంత్ర వ్యసవ్థను సజీవంగా నిలుపగలడు. అడవిలో కుటీరాన్ని నిర్మించుకొని నివసిస్తాడు. లంగోటీ మరియు కౌపీనాన్ని ధరించి ఉండ గలడు. ప్రాతఃకాలమందే పనిచేసే స్థలానికి నడచి వస్తాడు. రోజంతా పనిచేసి సాయంత్రము కాలినడకన తిరిగి వెళతాడు. ఆయన చేసెడి ఈ త్యాగాలకు ప్రతిఫలంగా ప్రజలు, రాజు చంద్రగుప్తుని నిర్ణయాలకన్నా చాణక్యుని నిర్దేశాలకు అధిక విలువనిచ్చారు.

చంద్రగుప్తుడు కూడా స్వయంగా ఈ ఆదర్శాలను ఆచరించాడు. గురు చాణక్యుని ధిక్కరించి ఏనాడు ప్రవర్తించి ఎరుగడు చంద్రగుప్తుడు. దీని ఫలితంగా ఆనాడు మరెచ్చట లేని శాంతి మరియు సువ్యవస్థ భారతదేశంలోని మౌర్య సామ్రాజ్యంలో విలసిల్లింది.


ఇటువంటి వాని అవసరము నేడు దేశంలో మరింతగా కావలసి ఉంది. ఇందులకై రాజనీతిని, రాజ్యవ్యవస్థను, నిరంకుశత్వం నుండి రక్షించి ధర్మతంత్ర నియంత్రణలోనికి తేవాలి. లోభాన్ని వీడి పవిత్రమైన, విశుద్ధమైన లోకకళ్యాణాన్ని కాంక్షిస్తూ నిర్ణయాలు చేయాలి. ఇట్టి శాసన వ్యవస్థ ప్రజలను సుఖవంతులుగా, సమృద్ధిపరులుగా చేస్తుంది.

*- అనువాదం: పార్థసారథి*

**ఒక్క క్షణం సహనం కొండంత ప్రమాదాన్ని దూరం చేస్తుంది - ఒక్క క్షణం అసహనం మొత్తం జీవితాన్నే నాశనం చేస్తుంది**

పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర-49

# హరిజనోద్ధరణకై కులవ్యవస్థ నిర్మూలనకై శ్రీరామ్ కృషి - 3



**కులమతాలపై చర్చావేళ ఎదురైన సవాళ్ళు**

శ్రీరామ్ తన భాగవత కథా ప్రవచనం ద్వారా లభించిన ధనాన్ని హరిజనోద్ధరణ నిధికి విరాళంగా ఇచ్చుటను బ్రాహ్మణవర్గము వ్యతిరేకిస్తూ తమ అసమ్మతిని వెల్లడించింది. పండిట్ దులిచంద్ శాస్త్రి తన అభిప్రాయాన్ని వ్యక్తీకరిస్తూ ఈ రూపంలో వచ్చిన ధనాన్ని బ్రాహ్మణుల భోజనాలకు వాడాలని పిలుపునిచ్చారు. ఈ పిలుపుకు స్పందించిన బ్రాహ్మణవర్గం తన అసంతృప్తిని తెలుపుచూ, ఈ రూపంగా వచ్చిన ధనాన్ని శూద్రుల ప్రగతికై వినియోగించరాదని తీర్మానించి, తీర్మాన పత్రులను సైనిక పత్రిక కార్యాలయానికి అధిక సంఖ్యలో పంపసాగారు. పాల్జీవాలాగారు ఇట్టి లేఖలను శ్రీరామ్ ముందు పెట్టి నవ్వేవారు. మొదట కొన్నింటికి శ్రీరామ్ తగిన విధంగా సమాధానాలు పంపారు. కాని ఈ లేఖల ప్రవాహం ఆగిపోలేదు. వేరే మార్గాంతరము కానక శ్రీరామ్ దీనిపై స్పందిస్తూ తగిన జవాబు రూపంలో ఒక వ్యాసాన్ని పత్రికలో ప్రచురించాడు. అదే సంచికలో పాఠకుల నుండి ఈ అంశముపై వచ్చిన ఎంపిక చేసిన కొన్ని లేఖలను కూడా ప్రచురించుట జరిగింది. శ్రీరామ్ ప్రచురించిన వ్యాసానికి "హరికో భజాయ్-సోహరికా హోయ్" అనగా "తనను నిరంతరం ధ్యానించేవారిని భగవంతుడు ప్రేమిస్తాడు" అని పేరు పెట్టాడు. ఈ వ్యాసంలోని సారాంశం "కులము, రంగు, జాతి, ఆరోగ్యస్థితి, విద్య మున్నగు వానితో నిమిత్తం లేకుండా సర్వులు భగవంతుని ప్రేమను పొందవచ్చు" – పూర్తిగా దారితప్పి చరించెడివారు కూడా భగవంతుని శరణు జొచ్చి ముక్తిని పొందారు. ఎటువంటి అభ్యంతరం లేకుండా భగవంతుని ప్రేమను అందరూ పొందుచున్నప్పుడు ఆయన పేరు ద్వారా లభించిన స్వల్పధనాన్ని నిమ్నకులస్థుల సంక్షేమానికై వినియోగించుటలో తప్పులేదు. ఇది నిజంగా ఒక ఉత్తమ కార్యమే.

పవిత్ర శాస్త్ర గ్రంథాలలోని ఉదాహరణలను ఉటంకిస్తూ వ్రాసిన ఈ వ్యాసము పండిట్ దులిచంద్, గౌరంగ్‌శర్మ మరియు నళిని గౌర్‌లకు కోపం తెప్పించింది. వెంటనే వీరంతా పత్రిక కార్యాలయంలో ఉన్న శ్రీరామ్‌ను సమీపించి "నీవు నిజంగా శాస్త్రాలను అభ్యసించావా లేక నీకు తోచిన రీతిలో వ్రాశావా?" అని తీవ్ర స్వరంతో ప్రశ్నించారు.

శ్రీరామ్ వీరికి బదులిస్తూ "అయ్యలారా! ఆయా శాస్త్ర గ్రంథాలను నా అవగాహన మేరకు చదివాను, అర్థము చేసికొన్నా, ఒకవేళ నేనేమైన తప్పు చేసినచో నాకు తెలియజెయ్య ప్రార్థన!" అన్నారు. దీనికి ఆ ముగ్గురు మరింత కోపగించుకొని, "నీవు మాతో శాస్త్రాల తర్కానికి సిద్ధంగా ఉండు. నీ తర్కంతో మమ్ముల గెలువు?" అని ప్రశ్నించారు శ్రీరామ్‌ను.

శ్రీరామ్ తన ఆసనము నుండి పైకి లేచి, బదులిస్తూ "మీకు గల శాస్త్ర పరిజ్ఞానాన్ని, మీ వయస్సును గౌరవిస్తున్నాను. నేను సత్యమని నమ్మిన దానిని వ్రాయుట జరిగింది. నేను వ్రాసిన దానిని మీలో ఎవ్వరైనా తప్పుగా భావిస్తే మన్నించ ప్రార్థన. నాకు అహం లేదు" అన్నారు.

పై దానిని చూచిన పండితులు, దానిని తమ విజయమని భావిస్తూ, శ్రీరామ్ ఓటమి అని తలుస్తూ, విజయగర్వంగా నవ్వుతూ వెనుదిరిగారు. ఈ సంఘటన గురించి తెలిసికొన్న పాలీవాల్జీ, శ్రీరామ్‌ను సమీపించి, "శ్రీరామ్! నీవు వారిని చూచి భయపడ్డావా? లేక వ్యాసానికి తగిన సాక్ష్యాధారాలు శాస్త్రాల నుండి నీవు వారికి చూపజాలకపోయావా?" అని అడిగారు.

శ్రీరామ్ బదులిస్తూ "నాకు భయం కలుగలేదు. నా వద్ద తగిన సాక్ష్యాధారాలు లేకపోలేదు. కాని వారి ప్రవర్తన తర్కానికి అనువుగా లేదు. కావున వారితో తర్కించుట అనగా విభేదాలను పెంచుకొనుటే అవుతుంది. వారంతా నాపై తగాదాకు వచ్చారు. దీనిని నివారించుటకై వారిని క్షమాపణ కోరాను! అంతే" అన్నారు.

**ప్రేమించే హృదయం బాధను తట్టుకుంటుంది - కాని మోసంతో, అది ప్రేమించుటే మానుకుంటుంది**

### గాంధీజీ ఉదాహరణ

శ్రీరామ్ సమాధానాన్ని విన్న పాలీవాల్జీ శ్రీరామ్ వివేకాన్ని మెచ్చుకొంటూ సందర్భోచితంగా మహాత్మా గాంధీగారికి చెందిన ఒక సంఘటనను చెప్పారు. "అలహాబాద్‌లో ఒక శాస్త్రిగారు గాంధీజీకి ఇలా ఒక సవాల్ విసిరారు. మీరు నిమ్నకులస్థునిచే యజ్ఞోపవీతం ధరింపజేయగలరా వారికి గాయత్రి జపము, సంధ్యా వందనాన్ని బోధింపగలరా? అని ప్రశ్నించారు.

గాంధీజీ బదులిస్తూ "వేదాలపై శాస్త్రాలపై నమ్మకమున్న ప్రతి ఒక్కరు యజ్ఞోపవీతాన్ని ధరించి గాయత్రి జపాన్ని, సంధ్యావందనాన్ని చేయుటకు హక్కున్నది. హరిజనునికి దీనిపై హక్కు లేనిచో, ఇతర వర్ణాల వారికి కూడా లేదు" అన్నారు. దీనికి బదులుగా శాస్త్రిగారు గాంధీతో వాదనకు సిద్ధమై "శాస్త్రార్థ మేమిటి?" అని ప్రశ్నించారు. వాదనకు దూరంగా ఉండాలని నిశ్చయించుకున్న గాంధీజీ వెంటనే తన ఓటమిని అంగీకరించి మిన్నకున్నారు" అని చెప్పుచూ పాలీవాల్జీ, గాంధీజీలా తెలివైన వాడవని శ్రీరామ్ విజ్ఞతను మెచ్చుకొన్నారు.

ఆ సమయంలో శాస్త్రార్థాలపై చర్చజోరుగా సాగుతూ ఉండేది. ఆర్యసమాజ సభ్యులు మరియు సనాతన ధర్మ పండితుల మధ్య వాదోపవాదాలు సాగుతూ ఉండేవి. స్వామి దయానంద సరస్వతిగారి వివరణ, తర్కము, సనాతన వాదులను మరింతగా ఇరుకున పెట్టేది. సనాతన ధర్మాన్ని గురించి వేదాలు, శాస్త్రాలు, పండితోత్తములు, వెల్లడించిన అభిప్రాయాలకు మన్నన ఎక్కువ లభించేది.

స్వార్థచింతనతో స్వలాభాన్ని ఆశించేవారు, ఆర్యసమాజ సభ్యులు, సనాతన ధర్మాన్ని గురించి వెల్లడించెడి అభిప్రాయాలను తలదాల్చేవారు కాదు. పై పెచ్చు తర్కము, వాదోపవాదాలు చెలరేగి రెండు పక్షాల మధ్య అశాంతి, స్పర్థలు నెలకొనేవి.

అనేక సందర్భాలలో వాదోపవాదాలకు, చర్చలకు, తెలివిమాలిన షరతులను విధించుట జరిగేది. ఉదాహరణకు ఒకసారి మహాత్మా వేదభిక్షు మరియు పండిత జగన్నాథుల మధ్య వారణాసిలో చర్చ జరిగింది. శాస్త్రార్థాలపై చర్చలో ఓడినవారు శిరోముండనం గావించుకొని, శాస్త్రాలను తలపై నిడుకొని, పాదరక్షలు ధరించకుండా గంగానది ఒడ్డుకు వెళ్ళాలి అనెడి షరతు విధించబడింది. మరో చర్చలో అలహాబాదులో ఈ షరతు విధించబడింది. చర్చలో ఓడినవారి కుమార్తెను గెలిచినవారు వివాహమాడాలి. పోటీదారులిరువురూ వివాహితులే మరియు సమవయస్కులు. దీనిని విన్న తదితర మత పెద్దలు ఈ సవాలును నిలిపివేశారు.

కొంతకాలము పిదప ఈ వాదోపవాదాలలో వివేకానికి స్థానం కల్పించబడి చక్కని విజ్ఞానవంతమైన చర్చకు దారి తీసింది. స్వామిదయానందగారి ప్రవేశముతో ఈ చర్చలు మరింత అర్థవంతంగా లాభదాయకంగా మారాయి. ఇది కొన్ని దశాబ్దాలపాటు కొనసాగింది. కాని కొంతకాలము తదుపరి ఇది వెర్రితలలు వేసి, వ్యక్తిగత స్పర్థలకు దారితీసింది. ఇదే రీతిలో దళితుల ఉద్ధరణకై శ్రీరామ్, తన సైనిక్ పత్రికలో ప్రచురించుచున్నవానిపై, కొందరు సనాతన వాదులు వాదోప వాదాలకు దిగి శ్రీరామ్‌కు సవాలు విసిరారు. దాని వెనుకనున్న అసలు ఉద్దేశ్యాన్ని గ్రహించి శ్రీరామ్ సవాలును స్వీకరించక మిన్నకుండిపోయారు. దీనిని అదునుగా తీసికొని తన ఓటమిని అంగీకరిస్తూ సైనిక్ పత్రికలో ప్రకటన ఇవ్వవలసిందిగా శ్రీరామ్‌ను కోరారు. దానిపై శ్రీరామ్ ప్రతిస్పందిస్తూ సవాలును తాను స్వీకరించనందున ఓటమిని అంగీకరించే ప్రసక్తే ఉత్పన్నం కాదని స్పష్టం చేయుట జరిగింది.

### థియోసాఫికల్ సొసైటీ చీలిపోవుట

డా॥ అనిబిసెంట్ మరణించిన సంవత్సరములోపే థియో సాఫికల్ సొసైటీ చీలిక దిశను పట్టింది. ఆమె త్రికరణ శుద్ధిగా హిందూ సనాతన ధర్మాన్ని చైతన్యపరచింది. తత్ఫలితంగా ఆమెను ఆమె జీవిత కాలంలో ఎవ్వరూ సవాలు విసురుటకు సాహసింపజాలకపోయారు. ఆ రోజులలో రెండు సంస్థలు అనగా ఒకటి థియోసాఫికల్ సొసైటీ రెండవది ఆర్యసమాజ్ త్రికరణశుద్ధిగా హిందూ సనాతన ధర్మాన్ని ప్రక్షాళన గావించి తిరిగి దాని పూర్వపు వైభవాన్ని సంతరింప జేయుటకు నడుం బిగించి పనిచేశాయి. కాని ఈ రెండు సంస్థలు, హిందూ సంస్కృతిపై వెలిబుచ్చి ప్రచారానికి తెచ్చిన నిర్వచనాలు. భారతీయ సంస్కృతీ విలువలను, అందించిన వారసత్వ విలువలను పరిపూర్ణంగా తెలియజెప్పలేకపోయాయి. ఈ రెండు ఉద్యమ సంస్థలు వేదాలను, వేదాంగాలను హిందూ మతానికి మూలాలుగా భావించాయి. కాని ఇవి రెండూ

**అవసరానికి ఆదుకొనే స్నేహితుడుంటే అదృష్టం - అసలు స్నేహితుల అవసరం రాకుండుట ఇంకా అదృష్టం**

హిందూ మతంలోని ప్రధాన అంగాలైన, అవతార ప్రక్రియకు, విగ్రహారాధనకు, భక్తికి, వివిధ విశ్వాసాలకు, ఉపవాసము మున్నగు వానికి తగిన ప్రాధాన్యతను గాని గుర్తింపును కాని ఇవ్వలేదు. అట్లే కులవ్యవస్థకు మతపరమైన నమ్మకాలకు గ్రుడ్డి నమ్మకాలకు విలువ నివ్వలేదు. కాలం చెల్లినవానిగా ప్రకటించాయి. స్త్రీల విద్యను బలపరుస్తూ బాల్యవివాహాలను మత వ్యతిరేకమని ప్రకటించాయి. ఆరోగ్యకరమైన పై సంస్కరణలను చేపట్టాయి. కాని ఒకదానిలో అవి రెండు తప్పటడుగు వేశాయి. అదే భారతీయ సనాతన ధర్మానికున్న విశాలతను కుదించివేశాయి. థియోసాఫికల్ సొసైటీకి సామాన్యజనుల గురించి వారి మనోభావాల గురించి పూర్తి అవగాహన లోపించింది. ఆర్య సమాజం, సంపూర్ణ భారతజాతి మనోభావాల సృశించింది.

ఆర్య సమాజ్ మరియు థియోసాఫికల్ సొసైటీల తత్వాన్ని వివరిస్తూ పండిత శ్రీపాద జోషి ఇలా వ్రాశారు. "సంస్కరింపబడిన థియోసాఫికల్ సొసైటీ భావనలో, సనాతన ధర్మము భారతీయుల క్రైస్తవ మతంగా రూపుదాల్చింది. అట్లే ఆర్య సమాజం కూడా బహుళ వ్యాప్తిలోనున్న హిందూ మతానికి భిన్నంగా రూపుదాల్చింది. అది ధైర్యసాహసాలతో కూడినదిగా రూపొందింది. కాని దానంతటది సంపూర్ణము కాదు. అనిబిసెంట్ ధార్మిక ప్రసంగాలలో హిందూ ధర్మాన్ని గురించి ఆమె నోటి నుండి వెలువబడిన మాటలైన యోగా, భక్తి, అనుష్ఠానము, అవతారము, పూజ, పునర్జన్మ మున్నగునవి భారతీయ పండితులనేకాక, యూరోపియన్ విద్యాధికులను కూడా సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తాయి. దీనివలన అనేక మంది హిందువులలో వారి మతం పట్ల విశ్వాసాన్ని పునర్జీవింపజేయుట జరిగింది."

డా॥ అనిబిసెంట్ ఒక పేరెన్నికగన్న విద్యాధికురాలు మరియు ప్రతిభావంతమైన ఉపన్యాసకురాలు. ఆమె ఒక ఉన్నత కుటుంబంలో జన్మించింది. భారతదేశానికి వచ్చే ముందు ఒక ఆంగ్లేయ కంపెనీ అయిన ఫాబియన్ సొసైటీలో పని చేసింది. గ్రంథకర్త అయిన జార్జి బెర్నార్డ్‌షాకు సమకాలికురాలు. ఆంగ్లభాషపై అసమాన పట్టు ఉన్నది. ఆంగ్లభాషలో ఆమెతో ధీటుగా, అనర్గళంగా మాట్లాడగలిగెడి వ్యక్తి ఇంగ్లాండులో లేదని బెర్నార్డ్‌షా ఆమెను కీర్తించాడు. నిజంగా మాట్లాడితే యూరప్‌లోనే ఆమెతో ధీటుగా ఆంగ్లంలో ఉపన్యాసమివ్వగల్గెడి నేర్పరి లేడు. ఆధ్యాత్మిక సంపదను అనంతంగా కలిగి ఉన్న దేశము భారతదేశము మాత్రమే. భారతీయ సనాతన ధర్మాన్ని ప్రపంచానికంతటికీ అందించగల సామర్థ్యాన్ని కల్గి ఉన్న భారతీయ చింతనను అతివాద మేఘాలు కమ్మివేశాయి. దీనిని భారతీయులు మాత్రమే అనుష్ఠాన ప్రక్రియ శక్తితో తొలగించగలరు" అన్నది అనిబి సెంట్. ఆమె పరిధిలో ఒక ప్రయోగాన్ని ఆమె చేసింది కాని అది విఫలమైంది. దీని వలన థియోసాఫికల్ ఉద్యమం బీటలు వారింది. దీనితో ఆమె విభ్రాంతికి గురియై వయోభారంతో 1933లో తన భౌతిక శరీరాన్ని వీడింది.

*– అనువాదం: ఎ. వేణుగోపాలరెడ్డి*

## సామాన్యుని శరీరం కోరికలకు బందీ - మహాపురుషుడు అతీతుడు

*షేక్ ఫరీద్‌ను ప్రజలు అడిగారు – "మహాపురుషులు కష్టాలలో సైతం నవ్వుతూ ఉంటారు. అదెలా సాధ్యం? మన్సూర్ యొక్క కాళ్ళు చేతులు నరికివైచి ఆయన నేత్రాలను పెరికి వైచినా ఆయన మోము చిరునవ్వు చిందిస్తూ ఉంది, ఇదెలా సాధ్యం? షేక్ ఫరీద్ బదులిస్తూ ఇలా ప్రశ్నించాడు. మీరు ఎండిన కొబ్బరికాయను పచ్చి కొబ్బరికాయ (బొండాం) ను చూచారా?" విన్నవారంతా తమ తలలు పంకిస్తూ చూచాం అన్న సంకేతాన్ని ఇచ్చారు. షేక్ ఫరీద్ తన జవాబును కొనసాగిస్తూ ముదురు బొండాంలోని గుజ్జు, కొబ్బరి బొండాం పెంకును అంటి పెట్టుకొని ఉన్న రీతిలో సామాన్య మనుష్యుడు శరీరం సంసారాన్ని అంటి పెట్టుకొని ఉంటాడు. తత్ఫలితంగా కొద్దిపాటి కష్టానికి కూడా దుఃఖితుడవుతాడు. దీనికి భిన్నంగా ఎండు కొబ్బరి కాయలోని కొబ్బరికాయ పెంకును అంటి పెట్టుకొని కాయను పగుల గొట్టగనే కొబ్బరి–పెంకు విడిపోయినట్లు, మహాపురుషులు శరీరము, కోరికలతో బంధింపబడి ఉండదు. కష్టదుఃఖాల సమయమందు కూడా మహాపురుషుడు ఆత్మను వీడడు. తత్ఫలితంగా అతడు చిరునవ్వును ఎన్నడూ వీడడు" అన్నాడు.*

*– హిందీమూలం: అఖండజ్యోతి, జూన్ 2016*

*అనువాదం : ఎ. శారద*

**అకారణంగా ఎదురయ్యే విమర్శ విజయానికి నాంది**

సూక్ష్మీకరణ సాధన - 8

# బాగు చేయడమే కాదు నిర్మాణము కూడ అవసరమే

రామచరితమానసములో, రాముని జననమునుండి ఆయన చేసిన లంకాదహనము, రాజ్యారోహణం వరకు చెప్పబడింది. కానీ అదే సంపూర్ణ రామాయణము కాదు. భగవంతుడు రెండు ఉద్దేశ్యాలతో అవతరిస్తాడు. ఒకటి అధర్మ నాశనము, రెండవది ధర్మపరిత్రాణము. తులసీకృత రామచరిత మానసములో, ఆసురీశక్తుల నుండి పరిత్రాణా వివరణే వ్రాయబడినది. కాని ధర్మస్థాపన ఎలా జరిగింది? ఇది ఒక స్వతంత్ర విషయము. దానికి చాలా ఎక్కువ పరిశ్రమ చేయవలసి ఉంటుంది. చాలా పెద్ద ప్రణాళిక అమలుచేసి ఉండి ఉండాలి. కొద్దిమంది నల-నీలులతో పని జరుగదు. సాధనములు కూడ చాల ఎక్కువ ఉపయోగించబడియుండాలి. కానీ వీటన్నింటి వర్ణన ఆ గ్రంథములో లేదు. రామరాజ్య స్థాపన, ధర్మరాజ్య స్థాపనగా, సత్యయుగ పునరావృత్తముగా చెప్పబడుతుంది. ఈ పని ఒక మంత్రదండము తిప్పివేస్తే జరిగి ఉండదు. ఆసురీశక్తుల ఉన్మూలనములో ఎంత పురుషార్థము అవసరమౌతుందో, అంతకంటే ఎక్కువే పురుషార్థము దేవతాస్థాపనకు అవసరమౌతుంది.

పాడుచేయుట సులభము, నిర్మాణము కఠినము అని అందరికి తెలుసు. ఒక అగ్గిపుల్ల గీసి పూర్తి గ్రామాన్నే కాల్చివేయ వచ్చు. కానీ దానిని తిరిగి అదేవిధంగా లేక అంతకంటే ఎక్కువ అందంగా నిర్మించడానికి ఎంతో పెద్ద సమర్థవంతమైన ప్రయత్నాలు అవసరము. రామరాజ్యస్థాపనకి మరి ఎంత అవసరమౌతుంది? నిజానికి అసలు లక్ష్యముకూడా ఇదే. అసురులను చంపడమే లక్ష్యమై ఉంటే, తాత్కాలిక ఉపశమనము మాత్రమే లభించియుండేది. మళ్ళీ పరిస్థితి మొదటికొచ్చేది. లంకా దహనము తరువాత ఒక శ్మశాన వాతావరణమే కనిపించేది. కాలిపోయిన భవనాలు, వెదజల్లబడిన మృత శరీరాలు, దుర్గంధపూర్ణమైన వాతావరణము చూచి రాముని పురుషార్థము గొప్పదని ఎలా అనుకొనగలము? ఈనాటికి గుర్తున్నటువంటి ఆ పురుషార్థము నాశనము మాత్రమే చేయలేదు, అనేక సృజనాత్మక కార్యక్రమాలుకూడ చేసిపెట్టి, ఈనాటికీ గుర్తుండే రామరాజ్యస్థాపన జరిగింది. విషయము లంకదైనా, అయోధ్యదైనా, ఏ ప్రదేశానిదైనా పాతదానితో పోలిస్తే చాల గొప్ప నిర్మాణము జరిగినప్పుడే అది ప్రశంసించ బడుతుంది. ఈ కార్యక్రమము ఎలా సుసంపన్నమైనదో, రామాయణంలో వివరింపబడి ఉండలేదు. దీన్నిబట్టి రామ చరిత మానసము యొక్క ప్రముఖ సూత్రసంచాలకునికి, ఈ విషయంలో పెద్ద భాగము లేదని తెలుస్తున్నది. సంభవతః ఇతరులు దానిని చేసియుండవచ్చు.

సూక్ష్మీకరణ ఉద్దేశ్యము ఇదే. ఒకవిధంగా దీనిని ఆక్రమణాత్మక సాధన (A process of attack) అనవచ్చు. తలక్రిందులుగా యున్నదానిని తిప్పి తిన్నగా చేయుట అనవచ్చు. పట్టాలు తప్పిన రైలును క్రేను ద్వారా తిరిగి పట్టాల మీదికి తీసుకురావడము అనవచ్చు. కానీ అంతమాత్రము చేత రైలుబండి నడవదు. దానిని లోకో వర్క్‌షాపుకు తీసుకువెళ్ళి మరమ్మత్తులు చేయించాలి. భయంకర అగ్నికాండ జరిగినపుడు ఫైర్ ఇంజన్స్ (fire engines) ఎంతో పరిశ్రమతో దానిని ఆర్పివేస్తాయి. మంటలు చల్లారిన తరువాత అందరూ సంతోషంగా గాలి పీల్చుకుంటారు. అయినా కాలిపోయిన ఇళ్ళను తిరిగి నిర్మించి, అందులో నివసిస్తున్నవారు తిరిగి దానిని యథాస్థితికి తీసుకు వచ్చే బృహత్తర కార్యము మిగిలే ఉంటుంది. యుద్ధ కాలములో శత్రువుల ఆక్రమణ ఆపటానికి నదిపై ఉన్న వంతెనలను కూల్చివేస్తారు. కానీ యుద్ధానంతరము దానిని తిరిగి నిర్మించకపోతే రవాణాసౌకర్యములలో విఘ్నములు ఏర్పడి ప్రజలు గగ్గోలెత్తుతారు. శత్రువుల దాడిని ఆపటానికి, ఎవరు వంతెనను ఎంత సాహసంతో ధ్వంసపరచారో చాలా ప్రముఖంగా చరిత్రలో చర్చించబడుతుంది. కానీ దాని తర్వాత పునర్నిర్మాణము కొరకు ఎంతమంది ఇంజనీయర్లు, కాంట్రాక్టర్లు, కార్మికులను ఉపయోగించవలసి వచ్చిందో చర్చించబడదు.

ఈరోజులలో ధ్వంసము చేసే వినాశకర పతనము వైపు తీసుకువెళ్ళే శక్తులు విజృంభిస్తున్నాయి. వీటిని నిలువరించుట

**కార్యసిద్ధికి ఓర్పు, చిత్తశుద్ధి, పట్టుదల, ప్రేమ కావాలి**

ఈనాటి ప్రముఖ కర్తవ్యము. దీనికొరకు చేయబడేదంతా తాత్కాలిక ఉపాయములే. ఇది లేకుండా పరిణామక్రమము (evalution) ముందుకెళ్ళదు. వీటికి ప్రాముఖ్యత ఇచ్చినప్పటికి, తరువాత చేయవల్సిన నిర్మాణాత్మక కార్యక్రమాల గురించి కూడ ఆలోచించాలి.

## సమర్థ అగ్రదూతలకు నా యొక్క వర్చస్సు,బలము లభిస్తుంది

ఇంతవరకు సమర్థుల ద్వారా ఏమి చేయించబడుతున్నది, ఏమి చేయించవలసియున్నదీ, క్లుప్తంగా చర్చించాను. నా యొక్క వ్యక్తిగత సంబంధము అదృశ్య జగత్తులో ఉన్న ఒక విశాల సంస్థతో ఉన్నది. అది ఏవిధంగా, ఎప్పుడు, ఎలా, ఏది చేస్తుందో అందరికి తెలియచేయడం వలన రానున్న అతి గొప్పమార్పులలో, వారు ఏవిధమైనటువంటి కార్యక్రమములు చేపట్టవలసి ఉన్నదో తెలుసుకొనగలుగుతారు.

నాయొక్క రెండవ పరికరము విశిష్టవ్యక్తులతో కూడినది. వీరిలో శాసనాధ్యక్షులు, మనీషీలు వస్తారు. మనీషీవర్గములో దార్శనికులు, వైజ్ఞానికులు ఇరువురూ వస్తారు. వీరు చాలా శక్తివంతులుగా గుర్తింపబడుతున్నారు. వీరు ఈనాటి సమస్యలకు సమాధానంగా సమాజముయొక్క ఆలోచనా సరళిని మార్చ గలిగితే, బలవంతంగానైనా మార్పులను తీసుకురావచ్చు.

అదృశ్య ఆత్మలు, వేటి సహచరునిగా, సహయోగిగా నేను కాబోతున్నాను. నివసించే పరోక్షజగత్తును వదలివేస్తే, ఈనాడు జీవించి ఉన్న జాగృత ఆత్మల వర్గము మిగిలిపోతుంది. వీరిని అగ్రగాములని, వర్చస్వసంపన్నులని, యుగసేనా నాయకులని అనుకోవచ్చు. వీరు తమ సామర్థ్యమును ప్రదర్శిస్తూ, సమాజానికి మేరుదండమువలె ఉంటారు. సమాజంలోని అన్ని రచనాత్మక నిర్మాణాత్మక కార్యక్రమములు వీరి శక్తితో సంపన్నమౌతాయి.

గొప్పవారు, దరిద్రులు ఇద్దరూ నిరర్థకులే. గొప్పవారి తృష్ణ ఎంత ఎక్కువగా ఉంటుందంటే, ఆ గందరగోళమునుండి బయటకువచ్చే ఆలోచనేరాదు. బయటకు రావడము వేరే విషయము. కూడబెట్టడము, విలాసవంతమైన జీవితము జీవించడము, దానిని ప్రదర్శించడము, మున్నగువానికి కాలము సరిపోక, ఇంకే పనినీ చేయలేని స్థితిలో ఉంటారు. ఒకవేళ ఏదైనా చేయదలచుకున్నా, వారి చుట్టూ ఉన్న భజన పరులు తమ గుప్పెటినుండి వారిని బయటకు పోనివ్వరు. ఎందువల్లనంటే నిర్మాణాత్మక కార్యక్రమములు చేబట్టినప్పుడు, పరాన్న భుక్కులుగా ఉన్న వీరి జీవితం సమాప్తమౌతుంది.

దరిద్రులను గురించి ఏమీ చెప్పనక్కర్లేదు. వారు ముందే ఒక పెద్ద విశాలమైన కుసంస్కారపూరితమైన కుటుంబాన్ని తయారు చేసుకుని ఉంటారు. వారి కడుపులు నింపడమే కష్టము. అన్నవస్త్రాలకే లోటు వున్నప్పుడు, చికిత్స, విద్యోపార్జన మొదలగునవి ఎలా సంభవమౌతాయి? అతిథి సత్కారాలు, పెళ్ళిళ్ళ ఖర్చులు, ఉన్న అతి స్వల్పశక్తిని గూడా నాశనము చేసేస్తాయి. వారి సంపూర్ణశక్తి, లోటును పూర్తి చేయటానికే వినియోగింపబడుతుంది. ఇక ఆదర్శముల పరిపాలన, సత్ప్రవృత్తుల పరిపోషణకు, వారు ఏమి చేయగలుగుతారు?

అతి ఉచ్చస్థితిలో ఉన్నవారు, అతి నీచస్థితిలో ఉన్నవారు, ఇరువర్గాలు సమాజానికి సమానంగానే నిరుపయోగులు, భారస్వరూపులు. పనికివచ్చే సముదాయము మధ్యమ వర్గమే (middleclass). వారికే కొన్ని సాధనాలు, వనరులు, కాలము మిగిలే అవకాశమున్నది. కేవలము స్వకేంద్రదృష్టికాక, ప్రపంచము గురించి కూడా ఆలోచించగలుగుతారు. ఈ పంక్తులలో మధ్యమవర్గములో ఉన్న విచారశీలురు, భావనా శీలురు, లోకహిత ప్రయోజనాలలో, రుచికలిగిన వ్యక్తుల గురించి చర్చిస్తున్నాను. చరిత్రయొక్క దీర్ఘకాలీన అధ్యయనము తరువాత, జాతి-వంశముతో సంబంధము లేకుండా, దేశ, ధర్మ, సమాజ సంస్కృతి యొక్క సేవ, మధ్యవర్గ సముదాయములో ఉన్న వ్యక్తులే చేస్తారు అన్నది స్పష్టంగా తెలుస్తుంది. వారిలో కూడా ఎక్కువమంది, తాత్కాలిక వేడిలో లక్ష్యహీన కార్యక్రమాలు ఏవేవో చేబడతారు. అనుభవము, సవ్యమైన ఆలోచనా విధానము లేకపోవడంచేత వయస్సుమళ్ళినవారు శారీరిక, మానసిక సామర్థ్యాలు తగ్గడం వల్ల, వారు ఇతరుల సహాయము కొరకు ఎదురుచూస్తూ ఉంటారు. అంతేకాకుండా కుటుంబ బాధ్యతలెన్నో అతుక్కుని ఉంటాయి. అలవాటైన జీవిత ఆలోచనా విధానాలు కూడ అడ్డుతగులుతూ ఉంటాయి. అందువల్ల యువకరక్తపు వేడి తగ్గి, సంతులనాత్మక దృష్టికోణముతో ఉంటే, ఈ వర్గపు మధ్య వయస్కులే ఈ పంక్తులలో చర్చించబడిన కార్యక్రమాలను చేయగలిగే శౌర్యపరాక్రమాలను చూపించ గలరు. ఇటువంటి శక్తి గల సముదాయము సమస్త విశ్వములో వ్యాపించియున్నది అని నా నమ్మకము. ధర్మ, సంప్రదాయ,

**ఓటమిలోనైనా ఓడదు ప్రేమ - చితిలోనైనా కాలదు ప్రేమ**

భాష, దేశముల విభజన మనుష్యులను చాలావరకు విడదీసింది. అయినా ఈ విశిష్ట సముదాయములో తగినంత ఇంగితజ్ఞానము ఉన్నది అని నేను చూస్తున్నాను. అందువల్ల వీరు ఈ విపత్కర అత్యద్భుత సమయంలో తమ పాత్రను సవ్యముగా పోషించగలరు అని భావిస్తున్నాను. వారికి కావల్సిన శక్తి నా సూక్ష్మీకరణ సాధన ఇస్తుంది.

ప్రజ్ఞాపరివారంలో సుమారు 20 లక్షలమంది సభ్యులు ఉన్నారు. వీరిలో ఎక్కువమంది భారతదేశంలో, హిందూధర్మ అనుయాయులే. కానీ పైన నేను చెప్పిన 'మధ్యమవర్గము' సమస్త విశ్వంలో వ్యాపించియున్నది. వారితో ఇప్పటివరకు నేను ప్రత్యక్ష సంపర్కము సాధించలేదు. నా సాహిత్యము కానీ, నా విచారధార(ఆలోచనాసరళి) కానీ వారికి ఇంకా అందలేదు. సీమిత సాధనాలతో ఇది సంభవముకూడా కాదు. కావల్సిన సాధనములు ఇప్పుడు ఉపలబ్ధమౌతాయి. అందువల్ల ఈ 'సముదాయము'తో ఘనిష్ట సంపర్కము సాధించగలుగుతాము. వారికి ప్రజ్ఞాఅభియానము, గాయత్రీపరివార్ అనే పేర్లు తెలియవలసిన అవసరము లేదు. కానీ వారు ఎక్కడి నుండో ఒక ప్రబల ఆలోచనాస్రవంతిని తమ వశం చేసుకొనుట అనుభూతి చెందుతారు. ఏదో అజ్ఞాతశక్తి చెబుతోంది, చేయమని వివశులను చేస్తోందని తెలుసుకొంటారు.

ఈ వర్గంవారి వద్ద తమ నిజసాధనా సంపత్తి వుండదు. కానీ తమ ప్రతిభతో సాధనాసంపన్నులను ప్రభావితము చేసి, ఉత్సాహ-ఉత్తేజపరచి, వారి సహయోగసహకారాలు పొందగలుగుతారు. సాధన సంపన్నులు ఒక యంత్రంవంటివారు. వారిని ఉపయోగించుకొనకపోతే జడభరతుల వలె ఎక్కడివారు అక్కడే ఉంటారు.

రాబోయేరోజులలో సామాజిక మార్పులద్వారా చాలా గొప్ప క్రాంతులు సంపన్నం కావలసి ఉన్నది. స్త్రీ-పురుష భేదము సమసిపోవలసి ఉన్నది. శృంగార సామాగ్రి వల్ల కాముకత ప్రబలి స్త్రీ విలువ దిగజారింది. రాబోయేరోజులలో స్త్రీ-పురుషులు అన్నదమ్ముల వలె, అక్కాచెళ్ళెల వలె జీవిస్తారు. వారి పరస్పర సహయోగము కావలసివచ్చే వేలకొలది క్షేత్రాలు ఉన్నాయి. యౌవ్వనకార్యము చాలా బాధ్యతాయుతమైన పనిగా గుర్తించి, దానికి ముందు ఇరుపక్షాలవారు వందసార్లు మేము ఏమి చేయబోతున్నాము అని ఆలోచిస్తారు. దాని పరిణామము మనమీద, కుటుంబముమీద, సమాజంమీద ఎలా ఉంటుందో ఆలోచిస్తారు. కామక్రీడ యొక్క నేటి పరిస్థితి అత్యంత బాధ్యతా రహితస్థితి యొక్క చరమదశకు (Ultimate stage of irresponsibility) చేరుకున్నది. ఈ సందర్భంలో క్రొత్త ఆలోచనలు, క్రొత్త అలవాట్లు (behaviour) ప్రవేశపెట్టుటకు ఎటువంటి అవరోధాలు వస్తాయో, వాటిని ఎలా అధిగమించాలి అనే గురుతరబాధ్యతను. 'మధ్యవర్గమే' చేపట్టాలి. దీనికి సంబంధించిన అనేక ఆలోచనలను చేతిలోకి తీసుకుని కార్యాన్వితము చేయాలి.

విద్యాక్షేత్రము రెండవ సమస్య. భారతదేశంలోనేకాక సమస్త ప్రపంచములో 3/4 వ వంతుమంది నిరక్షరాశ్యులు. వీరిలో ఎక్కువమంది ప్రౌఢులు. వీరికి చదువు చెప్పుటకు ప్రభుత్వ విద్యాసంస్థలు వుపయోగపడవు. ప్రజల సహకారం ఈ దిశలో తీసుకోవాలి. శిక్షణా(శైక్షణిక) విషయాలను తిరిగి నిర్ధారణ చెయ్యాలి. ఈనాటి శిక్షాప్రణాళిక, లార్డ్‌మెకాలే ద్వారా 'నల్లదొర' లను తయారుచేసే విధానమునే అవలంబిస్తోంది. ఒక సమర్ధనాగరీకుడు ఏమి తెలుసుకోవాలో అటువంటి పాఠ్యక్రమము ఇంకా నిర్ధారణచేయబడలేదు. ఇంకా దీనికి ఎలా శిక్షణ ఇవ్వాలో ఆ వ్యవస్థ ఎలా ఏర్పడుతుందో, రాబోయే రోజులలో జనశిక్షణకి ఒక విశాల పరికరము ఏర్పడుతుంది. దాని సహకారంతో అందరు కలసి ఈ బాధ్యతను నెరవేర్చగలరు.

కుటీరపరిశ్రమల నెలకొల్పుట మూడవ సమస్య. ఈనాటి నిరుద్యోగ సమస్యను, చిన్నచిన్న ఊళ్ళు, గ్రామాలలో, చిన్న-చిన్న యంత్రములతో నడిచే కుటీరపరిశ్రమలే నివారించగలవు. సహకారసమితులు వాటి ఉత్పాదన, మరియు విక్రయ బాధ్యతలను తీసుకుంటాయి. ప్రభుత్వ అధికారుల వల్ల ఇది జరుగదు.

సహకారసమితుల, పంచాయతీల, సేవాసమితుల నిర్వహణ యువకార్యకర్తలు ముందుకు రావాలి. క్రొత్తతరము అంటే, మధ్యవర్గ మనఃస్థితి ఉన్న జన సేవా సముదాయము.

మన దేశంలోనేకాక, సమస్త విశ్వంలో, సామూహిక శ్రమదానంతో చేయగలిగే అనేక కార్యక్రమాలు ఉన్నాయి. మానవుల, పశువుల మలమూత్రాలను ఎరువుగా మార్చుట, ఇంటి వెనుకా, ముందు లేక డాబామీద కూరగాయలు పండించుట, వృక్షారోపణ కొరకు సర్వజనీన ఉత్సాహము

మంటలోని మౌనం ప్రేమ - మరుజన్మకు ప్రాణం ప్రేమ

పెంపొందించుట మొదలగు కార్యక్రమాలను, స్వర్గం నుండి దేవతలు దిగివచ్చి చేయరు. ఇవి ప్రభుత్వ అధికార సంకేతాల వలన జరుగవు. దీనికొరకు అగ్రమపంక్తిలో నుంచొని, అనేక మందితో అందరూ దీనిని అనుకరించమనే ప్రేరణ ఇవ్వాలి.

చెడు అలవాట్లలో అనేకమైనవాటిని ఒక్కరోజుకూడా భరించకూడదు. 'సారా', 'మత్తు' అలాంటివి. ఆరోగ్యము, డబ్బు, మర్యాదా, తెలివి అన్ని దీనివల్ల నాశనమౌతాయి. తరాలు నాశనమౌతాయి. ఆరోగ్యాలు చెడతాయి. త్రాగుడు, మత్తుపదార్థములు తయారుచేయకూడదని, ఉపయోగించకూడదని గాంధీజీయొక్క సత్యాగ్రహ స్థాయి ఉద్యమాలు చేపట్టాలి.

మన దేశంలో పెళ్ళిళ్ళల్లో, కట్నం, తదితర అనవసర అపవ్యయము ఒక అధిశాపము. దానిలాంటిదే, మృత భోజనము, అన్యకురీతులు. వీటన్నింటిని ఒకేసారి సమూలంగా పెరికిపారవేయవలసిన అవసరమున్నది. భిక్షా వృత్తి, సమర్థులను కూడా వేషం మార్చి అడుక్కునేవారి సరసన కూర్చోబెడుతోంది. ప్రతి క్షేత్రంలో జాగ్రత్తగా వెతికితే, తమదైన చిత్ర-విచిత్ర కురీతులు కనిపిస్తాయి. ఆలస్యము-ప్రమాదము అనే మానసిక ప్రవృత్తులు ప్రతిభాసంపన్నులను కూడా (అంగ వైకల్య) అపంగ-అసమర్థస్థాయికి దింపుతుంది. తద్వారా దారిద్ర్యము అనుభవించవలసి ఉంటుంది. ఈ విధంగా ప్రజల నరనరాలలో వ్యాపించిన అవగుణాలను ఒక వ్యక్తి తీసివేయలేదు. దీనికొరకు యుద్ధప్రాతిపదికమీద ప్రణాళిక వేసి ఈ దుష్ప్రవృత్తులలో ఇరుక్కుపోయినవారిని ఎలా విముక్తుల చేయాలో నిర్ణయించుకోవాలి.

సృజనాత్మక కార్యక్రమాలు వేల సంఖ్యలో ఉన్నాయి. అంతకంటే ఎక్కువ ఉన్మూలన (నిర్మూలన) కార్యక్రమాలు ఉన్నాయి. కేవలము నాలిక కదిపి విరోధము వ్యక్తము చేయుట వల్ల ఏమీ జరుగదు. ఎంతోమంది నిత్యజీవితంలో పాటించడం వల్లనే ఈ కురీతులు, ఒక అలవాటుగా (జీవిత విధానంలో భాగంగా) మారాయో, వాటిని స్థానభ్రంశము చేయటానికి అది అలవాటుగా మారటానికి జరిపిన పురుషార్థము కంటే ఎన్నో రెట్ల పురుషార్థము చేయవలసి ఉంది.

మన భారతదేశంలోలాగే, ప్రతిదేశము ప్రతిక్షేత్రములో వారివారి లెక్కలేనన్ని విచిత్ర సమస్యలున్నాయి. వాటిని నివారించి, ముందడుగు వేయగలిగే శూరవీరుల అవసరము అడుగడుగునా ఉన్నది. వారు ఎక్కడినుండి వస్తారు? సర్వత్రా వారి అభావమే కనిపిస్తున్నది. రాత్రి చీకటిని చీల్చుకుంటూ, ప్రొద్దున్నే పక్షుల కిలకిలారావారాలు ఎలా వినిపిస్తాయో, అటువంటి వాతావరణమే ఏర్పడబోతోంది. వ్యక్తివ్యక్తికి ఈ పాఠములు ఎవరుచెప్తారు. ప్రతిఒక్కరూ తమ స్వార్థములు తగ్గించుకొని, పరమార్థ కార్యక్రమాలు చేపట్టటానికి ఎవరు వివశులను చేస్తారు? దీనికి ఇవాళ జవాబు ఇవ్వలేము. కాని రేపు-ఎల్లుండిలో, సత్ప్రవృత్తుల సంవర్ధన, దుష్ప్రవృత్తుల ఉన్మూలన అనే పెనుతుఫాను తప్పనిసరిగా వీచి తీరుతుంది. పెనుగాలులు వీచినప్పుడు గడ్డిపోచలు, ఆకులు, ధూళికణాలు కూడా ఆకాశాన్ని అంటుతాయి. త్వరలో వసంతము వచ్చి మోడులు చిగురుస్తాయి.

ప్రపంచంలో ఇప్పుడున్న వికాసము అనాయాసంగా రాలేదు. అసంఖ్యాక వ్యక్తుల ప్రతిభల అమూల్య సహయోగము ఇందులో వున్నది. ఇప్పుడు వాటికి రక్షణ కావాలి. దీనికి భావసంవేదనలు గల జనశక్తి కావాలి. దీనికి అనేక రచనాత్మక ఉద్యమాలు అప్పుడప్పుడూ పూనుకుంటూనే వున్నాయి. ఈసారి మరలా **పరోక్షజగత్తునుండి ఎండిపోయిన పృథ్విపై తిరిగి పచ్చదనము సంతరించుకుని అమృతధారలు కుఱుస్తాయి. జలాశయాలు తిరిగి నీటితో నిండుతాయి.**

## పండుగలు

**జులై 2016**

| | |
|---|---|
| 06-07-2016 | పూరీ జగన్నాథస్వామి రథయాత్ర |
| 15-07-2016 | తొలి (శయన) ఏకాదశి |
| 19-07-2016 | గురు (వ్యాస) పౌర్ణమి |

**ఆగస్టు 2016**

| | |
|---|---|
| 06-08-2016 | నాగుల చవితి |
| 10-08-2016 | సంత్ తులసీదాస్ జయంతి |
| 11-08-2016 | కృష్ణానదీ పుష్కరారంభం |
| 12-08-2016 | వరలక్ష్మీ వ్రతం |
| 15-08-2016 | స్వాతంత్ర్య దినోత్సవం |
| 18-08-2016 | రాఖీపూర్ణిమ |
| 25-08-2016 | శ్రీకృష్ణాష్టమి |

**నీ వల్ల ఒకరు కన్నీరు కార్చితే పాపం - నీ కోసం కార్చితే అది ప్రేమ**

# జ్ఞానసంపద

మనుష్యునికి గల విశిష్టత జ్ఞానాన్ని కలిగి యుండుట-జ్ఞాన హీనుడైనచో, చేతనత్వం కలిగి ఉన్నప్పటికి, ప్రాణులన్నింటి కన్నా క్రింది వరుసలో నిలువవలసి ఉంటుంది. జీవనమనేది (ప్రాణమనేది) వనస్పతులలో కూడా ఉంది. కానివానిలో జ్ఞానము లేదు. మరో ప్రాణులు ఉన్నాయి. నల్లులు, దోమలు, క్రిములు, కీటకాలు కూడా ఉన్నాయి. పిచ్చుకలు కూడా ఈ ప్రపంచంలో ఉన్నాయి. జలచరాదులు ఉన్నాయి. కాని వీటన్నింటిలో జీవమున్నది. ప్రాణులుగానే భావిస్తాము. కాని వీనికి జ్ఞానము లేదు.

మనుష్యుడు జ్ఞానం కలిగిన దేవతలా మన్నన పొందు చున్నాడు. జ్ఞానవంతుడైనందున, చింతనాపరుడైనందున, ఆలోచనాపరుడైనందున, ప్రాణికోటిలో మనుష్యుడు ఉన్నతంగా నిలిచాడు. ఊహించుకోండి! భావన చెయ్యండి. ప్రాచీన కాలంలో మనుష్యుడు, అడవి మనుష్యునిలా ఉన్నప్పుడు, అప్పుడతనికి జ్ఞానం లేదు. ఆనాడు మనుష్యునికి సామాజిక స్పృహ లేదు మరియు కర్తవ్యపాలన కూడా తెలియదు. అతని గౌరవ మర్యాదలు మరియు గుణ, కర్మల స్వభావాల గురించి కూడా ఏ మాత్రం అవగాహనలేని స్థితిలో ఉన్నప్పుడు, డార్విన్ మహాశయుడు చెప్పిన ప్రకారము మనిషి కోతుల సంతతికి చెందినవాడు అని తేలింది. వాస్తవంగా కోతుల జాతి మాదిరిగా సమాజం ప్రవర్తించుచున్నది. కాని నేడు సృష్టి యొక్క యజమానిగా తయారైనాడు. ఎలా ఇలా తయారు కాగలిగాడు? ప్రాచీనకాలముతో పోల్చిచూచినచో నేడు మనుష్యుని జ్ఞానము అనేక విధాలా పెంపొందుతూ వచ్చింది.

జ్ఞానం రెండు విధాలుగా ఉంది. రెండింటిని పెంపొం దించుకొనవలసి ఉంది. ఒకటి మన నిత్యజీవితంలో ఎదుగుటకై ఉద్దేశించబడింది. దీనినే శిక్షణ అనెదరు. దీని ఆధారంగా లోకవ్యవహార పనులను చక్కదిద్దుటను నేర్చుకుంటాం. పిల్లలకు పాఠశాలలో విద్యాబోధన జరుపుచున్నప్పుడు, శిక్షణ ఇస్తుంటాం. శిక్షణకు అర్థమేమి? దీనివలన లోకాచారాలు అవగతమవు తాయి. దీనిద్వారా సమాజం ఎలా నిర్మితమయ్యింది. భూగోళం అనగానేమి? ఇతిహాసాలనగా ఏమి? ప్రపంచంలో మనుష్యుల నడవడికలు ఎలా ఉంటాయి? ప్రపంచం ఎలా పయనిస్తూ ఉంటుంది? చెట్లు ఎలా ఎదుగుతాయి? ఈ సృష్టి ఎలా వచ్చింది? ఏమిటి? రాజనీతి ఏమి? సమాజం ఏమిటి? ఒక నాగరికుని కర్తవ్యమేమి? జీవి ఉపార్జన ఎట్లు చెయ్యాలి? అర్థశాస్త్రమనగానేమి? లోకవ్యవహారములలో కావలసిన ప్రావీణ్యాన్ని పొందుట ఒకటి.

జీవన ఉపార్జన రెండవది. దేనిని గురించి అయితే విషయ పరిజ్ఞానం మనకు లభించిందో దానినే శిక్షణ అనెదరు. శిక్షణ అవసరము ఉంది. శిక్షణ లేనిచో మనిషి తన శరీరాన్ని తగిన రీతిలో రక్షించుకొన జాలడు. సమాజంలో కలసి మెలసి ఏ రీతిగా జీవించగలడు? వీటన్నింటి కొరకై శిక్షణ పొందుట తప్పనిసరి.

శరీరం కొరకై, జీవించుటకొరకై, భౌతిక జీవనాన్ని సంవర్ధనం చేసికొనుటకై శిక్షణ పొందుట తప్పనిసరి. కాని ఈ శిక్షణ అనేది కేవలం భౌతిక జీవితం కొరకు మాత్రమే ఉద్దేశించింది కాదు. మనకు మరో జీవితం కూడా ఉంది. దీనినే మనం ఆధ్యాత్మిక జీవితమని పిలుస్తాం. చేతనత్వం కూడా మన లోపల ఉంది. ఆత్మ కూడా మనలో ఉంది. వివేకం కూడా మనలో ఉంది. సంవేదనలు కూడా మనలో ఉన్నాయి. వీనినన్నింటిని సక్రమమైన రీతిలో ఉంచుటకై మరొకటి కూడా కావాలి. దీనినే విద్య అంటారు. మరియు జ్ఞానమని కూడా పిలచెదరు.

విద్యకు పూర్తిపేరు ఆధ్యాత్మ విద్య. దీనిని ఊహాజనిత వివేకము అని పిలచినప్పటికీ దీని తప్పు లేదు. వివేకం అని పిలచినా ఫరవాలేదు. దీనినే మీరు గాయత్రి అన్నా, వివేకమన్నా ఫరవా లేదు. వాస్తవంగా ప్రపంచంలో పరిశీలించినచో కొద్దిమంది మనుష్యులు మాత్రమే ఇట్టివారున్నారు.

వీరికి తెలిసినది చాలా ఉంది. ప్రచారం కూడా ఎక్కువే. విద్యావంతులైన మనుష్యులు తక్కువగా ఉన్నారా? కళాకారులు

ఎంత చేసినా కూటికే - ఎన్నాళ్ళు బ్రతికినా కాటికే

తక్కువగా ఉన్నారా? చతురత కలిగినవారు తక్కువ? క్రియా కుశలురు తక్కువగా ఉన్నారా? ఏమి? మీకు తెలుసో లేదో జైలు గోడల మధ్య చదువుకున్నవారిని నీవు చూడలేదు. ఒకరిని మించి ఒకరు తెలివైన వారు ఉన్నారు. ఒకరిని మించి ఒకరు శక్తిమంతులు, నేర్పరులు ఉన్నారు. మోసపూరిత పనులలో ఉన్నవారిలో ఎక్కువమంది విద్యావంతులే ఉన్నారు. తెలివి తక్కువవారు జేబులు కత్తిరించుట మరియు చిన్న-పెద్ద పనులు చేస్తూ ఉంటారు. కాని ప్రపంచంలో జరిగిన పెద్ద పెద్ద మోస పూరిత పనులు అన్నీ చదువుకున్నవారు చేశారు.

ప్రజలకు సేవలు అందించే విషయంలో మేము కొంత చెప్పదలచుకున్నాం. శిక్షణ విషయంలో చెప్పుతాను. శిక్షణ యొక్క ప్రాధాన్యత, విశిష్టత మీకు తెలియాలి. అప్పుడు మీలో సంతోషము, ఉత్సాహం వెల్లివిరుస్తాయి. శిక్షణ సహాయంతో మీ ఆలోచనలను ఏ రీతిగా ఉపయోగించుకొనగలరు? మీరు మీ శరీరాన్ని ఏ విధంగా ఉపయోగించుకుంటున్నారు? మీ వద్ద సాధనలు మరియు పరికరాలు ఉన్నాయి. వీనిని సరియైన పద్ధతిలో సమర్థవంతంగా ఉపయోగపెట్టుకొనుటనే శిక్షణ లేక విద్య అనెదరు. ఇందువలన సామాన్యులు జ్ఞానంతో పనులు చక్కపెట్టజాలరు. దీనికై మనిషిని కొంచెము ఉన్నత స్థానములో నిలిపే, ఆలోచన చెయ్యాలి, తదుపరి సమాజము యొక్క గౌరవము మరియు సమాజము యొక్క గొప్పతనము సురక్షితంగా ఉంటాయి. దీనిని తెలుసు కొనుటనే విద్య లేక శిక్షణ అనెదరు.

ఈ విద్యను తెలిసికొన్నవాడు ధన్యుడే. విద్యను పొందుట అమృతపానం చేయుట వంటిది. విద్యతో ఉచితానుచితాల జ్ఞానము వస్తుంది. అప్పుడు ఏది కష్టమనిపించదు. ఈ రోజు సత్సంగము సమాప్తం

– అనువాదం: ఎ. వేణుగోపాలరెడ్డి

---

## కన్నతల్లిపై అచంచల గౌరవం

*ప్రఖ్యాత విద్వాంసుడైన చాణక్యుడు అతని తల్లికి మిక్కిలి ప్రేమపాత్రుడు! అతని బాల్యంలో అతని ఇంటికి ఒక జ్యోతిష్యుడు వచ్చుట తటస్థించింది. చాణక్యుని తల్లి జ్యోతిష్యునికి చాణక్యుని కుండలినీ చూపించింది! కుండలిని పరిశీలించిన జ్యోతిష్యుడు "అమ్మా! నీ కుమారుడు అత్యంత భాగ్యశాలి! రానున్న కాలంలో అతడు చక్రవర్తి కాగలడు! నా మాటలపై విశ్వాసము లేనిచో చాణక్యుని ముందరి పంటిని చూడండి! దానిపై నాగుపాము గుర్తు ఉన్నది!" అన్నాడు! చాణక్యుడు తిరిగి రాగానే అతని ముందరి పంటిని చూచి తల్లి ఆలోచనలో పడింది! చక్రవర్తి కాగానే తనను మరచిపోతాడేమోనని భావించసాగింది! ఆమె విచారించుట చూచిన చాణక్యుడు కారణమడిగి విషయాన్నంతా తెలిసికొన్నాడు! చాణక్యుడు వెనువెంటనే రాయితో ఆ పంటిని మోది ఊడగొట్టి దానిని తెచ్చి తల్లి ఎదుటపెట్టి "అమ్మా! నీ ఎదుట ఒక్కరు కాదు అనేక సామ్రాట్లు బహుమతిగా నిలుస్తారు"*

*– హిందీమూలం : అఖండజ్యోతి, జూన్ 2016*

*అనువాదం: ఎ. శారద*

## అంతరమెరుగని ఆప్యాయత

*హరినారాయణ ఆప్టే చాలా దయగలవాడు. ఆయనకు వంటచేసే మనిషికి ఐదేండ్ల కూతురుంది. ఆ పాప మీద ఆయనకు వల్లమాలిన ప్రేమ తాను భోజనం చేసేటప్పుడు ప్రక్కనే కూర్చుండబెట్టుకునే వాడు. ఒకసారి ఆప్టేగారింటికి ఒక అతిథి వచ్చాడు. ఆప్టేగారి ప్రక్కన కూర్చున్న బాలికను చూచాడు" ఈ పాప మీ మొదటిభార్యకు పుట్టిన అమ్మాయా? అని అడిగాడు. జవాబుగా ఆప్టేగారు "నా కూతురు కాదు. మేనకోడలు" అన్నారు.*

*– ప్రజ్ఞాపురాణం నుండి*

*అనువాదం : శ్రీమతి నేమాని గౌరీ సావిత్రి*

## ప్రమాదకారిణి

*దార్శనికుడైన డయోనిజ్‌ను ఒక వ్యక్తి ప్రశ్నించాడు. "అయ్యా! జంతువులన్నింటిలో అత్యంత ప్రమాదకారి జంతువేది?". వెంటనే ఆయన "మానవుడు" అన్నాడు. ఎందుకంటే మానవుడు అనాగరికుల మధ్యలో నిందకుడు. ఇంటివారి మధ్యలో ముఖస్తుతి చేసేవాడు.*

*– ప్రజ్ఞాపురాణం నుండి*

*అనువాదం : శ్రీమతి నేమాని గౌరీ సావిత్రి*

**రూపాన్ని చూసి మోసపోకు - రూపాయిని చూసి మురిసిపోకు**

తంత్రవిద్య-4

# లుప్తమైపోయినప్పటికినీ తంత్రవిద్య ప్రచండమైన సామర్థ్యము కలది

తంత్రసాధనల ద్వారా లభించే సిద్ధులు, సఫలతలను గురించి రోమాంచితమైన వర్ణనలు మన పురాణములలో కోకొల్లలుగా కనిపిస్తాయి. యోగులలో, సిద్ధులలో మరియు తాంత్రికపరంపరలలో నమ్మశక్యము కాని ఎన్నెన్నో ఆశ్చర్య కరమైన విషయములు ఉల్లేఖించబడినాయి. అవన్నీ కట్టుకథలనీ లేదా కల్పనాలోకములో విహరింపజేసే కల్పితకథనాలనీ భావించబడుతూ; మరోమాటకు తావులేకుండా సూటిగా తిరస్కరించబడుతున్నాయి. ఈ యుగములోని ప్రసిద్ధ తాంత్రిక విద్వాంసుడు (తంత్రాచార్యుడు) మహామహోపాధ్యాయ పండిత గోపీనాథ్ కవిరాజ్ అభిప్రాయము ఏమనగా 'పురాణ గ్రంథము లలో కనపడే వర్ణనలు అభూతకల్పితములు కావు. వాటన్నింటినీ ఈ మానవ శరీరములో జాగృతపరచుకొనగలిగే అవకాశం ఉన్నది. వాటిని తట్టిలేపితే కనుక మనిషి అద్భుతమైన శక్తి సంపన్నుడు కాగలడు.'

ఈనాటి పరిస్థితులలో ఆ వర్ణనలన్నీ కాల్పనికములని ఎందుకు అనిపిస్తున్నది? పండితుడైన కవిరాజ్ ఏమంటారంటే – వాటికి సంబంధించిన సూత్రములు చేజారిపోయాయి. సాధారణ ప్రయత్నములతోనే సిద్ధిని, శక్తిని సముపార్జించు కొనగలిగే తంత్రవిద్యాపద్ధతులు, కర్మకాండలన్నీ క్షీణించి పోయాయి. ఇంట్లోనే కూర్చుని టి.వి తెర మీద మొత్తము ప్రపంచములో ఏ మూలనో జరుగుతున్న సంఘటనను ప్రత్యక్ష ప్రసారము ద్వారా వీక్షించగలము. అంతర్జాల (ఇంటర్‌నెట్) వ్యవస్థ ద్వారా క్షణమాత్రములో మన మాటలను విశ్వములోని మూలమూలలకూ పంపించగలము, వినిపించగలము. కొద్ది కాలము క్రితము వరకు అతి విస్తృతమైన టెలిఫోన్‌వ్యవస్థ ద్వారానే మరోచోటున ఉన్నవారితో సంభాషించుట సాధ్యపడేది. ఆ టెలిఫోన్‌తీగలు అక్కడక్కడా స్తంభాల ద్వారా కలుపబడి ఉంటాయి. ఎక్కడైనా ఆ తీగ తెగినచో మన సంభాషణను కొనసాగించలేము. ఇప్పుడు ఇంత పెద్ద టెలిఫోన్‌వ్యవస్థ యొక్క ఆవశ్యకత అంతగా లేదు. జేబులో ఉన్న అతి చిన్న సెల్‌ఫోన్ ద్వారా ప్రపంచములో ఎక్కడున్నవారితోనైనా మాట్లాడగలము. సందేశమును పంపించగలము. మాట్లాడేవారిని కూడా ప్రత్యక్షముగా చూడగలము.

వైజ్ఞానిక చమత్కారములను చూసి ప్రజలు ఇప్పుడు ఆశ్చర్య పోవటము లేదు. ఆ అద్భుతములను గురించి విని, చదివి సంతోషిస్తున్నారు. రోమాంచితులవుతున్నారు. కానీ భావి కాలములో ఎటువంటి పరిస్థితి రావచ్చునంటే అది కూడా ఎంతో ఎక్కువకాలము కాదు కేవలము 50 సంవత్సరముల తరువాత వీటిని గురించి మర్చిపోయి మిగిలివున్న అరాకొరా ఉపకరణములను పనికిరాని వస్తువులుగా పరిగణిస్తారు. ఉపలబ్ధులను ఎలా పొందాలి? అన్న విషయములను తెలియ జెప్పే సూత్రములు మిగిలివున్నా కూడా ప్రజలు వాటిని విశ్వసించలేరు. ఈ ఊహను స్పష్టము చేయటానికి కవిరాజ్ ఇలా వ్రాశారు. 'అకస్మాత్తుగా పరమాణుయుద్ధము వచ్చి పడిందనుకోండి. ప్రపంచములోని పలు ప్రాంతములలో 20 నుండి 50 శాతం పరమాణుబాంబులు విస్ఫోటనము చెంది అధిక జనసాంద్రత గల నవనాగరిక పట్టణములు నేలమట్ట మయ్యాయనుకుందాము. **యుద్ధము ఎప్పుడు జరిగినా గొప్ప సంపన్నులుండే పెద్దపెద్ద నగరాలతో పాటు వాటిని నిర్మించిన ప్రతిభావంతులు, వైజ్ఞానికులు కూడా తుడిచిపెట్టుకుపోతారు. ప్రపంచములోని ఎక్కువమంది ప్రజలు, వారి సభ్యత, విజ్ఞానము నష్టమైపోయిన తరువాత చిన్నిపల్లెలు, గ్రామములు, ఊళ్ళు మిగులుతాయి మరియు ఆదీవాసీలు మాత్రము బతికి బట్టగడతారు.** చిన్నపట్టణములలో అక్కడక్కడా ఇంకా కొంత మంది ప్రజలు జీవించి వుండివుండవచ్చుగాక! పరమాణు యుద్ధము తరువాత బ్రతికి బయటపడ్డ ప్రజానీకము తమ సంతానమునకు టి.వి., టెలిఫోన్‌వ్యవస్థ, అంతర్జాలవ్యవస్థ, రవాణావ్యవస్థ మొదలైన వైజ్ఞానిక ఉపలబ్ధులను గురించి చెపితే కనుక దాన్ని ఆ తరం నమ్మదు. ఎందుకంటే వేటి శక్తి ఆధారంగా విలక్షణమనిపించే చమత్కారములు సంభవమౌతాయో; ఆ వైజ్ఞానికతంత్రము, వ్యవస్థ ఎక్కడా కనిపించదు. అప్పుడు కనుక ఒక టి.వి సెట్ ఎక్కడైనా దొరికినా దాన్ని ఉపయోగపడని, పనికిరాని ఖాళీడబ్బాగా భావిస్తారు. టి.వి తెరమీద మొత్తము ప్రపంచములోని సంఘటనలు ప్రత్యక్షముగా కనిపిస్తాయి అని చెపితే ఆ తరంవారు ఎగతాళిగా నవ్వుతారు, ఆ మాటలను గేలిచేస్తారు.

రూపం, రూపాయి శాశ్వతం కావు - మనస్సులోని ప్రేమాభిమానాలే శాశ్వతం

50 సంవత్సరముల తరువాత నేటి వైజ్ఞానిక ఉపలబ్ధులు నమ్మరానివిగా చెప్పబడే దుస్థితి రావచ్చును. తంత్రము-యోగము ఇచ్చే ఫలితములను గురించి ఇవ్వబడుతున్న వివరములు వాటిలో ఎక్కువ శాతము నిజమైనవే అయినప్పటి కినీ వాటివ్యవస్థ, తంత్రము (టెక్నాలజీ) అస్తవ్యస్తమైపోయిన కారణముగా అవి అవిశ్వసనీయమైనవిగానే పరిగణించ బడతాయి. విలక్షణ శక్తుల ద్వారా వ్యక్తులు-స్థానములను గురించి చెప్పిన విషయములన్ని కచ్చితముగా నిజము కాక పోవచ్చును. వాటిలో అతిశయోక్తులతో పాటు కల్పనలు కూడా జోడించబడివుండవచ్చు. కానీ ఇవ్వబడిన వివరాలు తప్పుకావు. నిజమైనవే. గణేశ ప్రతిమ పాలు త్రాగింది అన్న సంఘటన ఎవరైనా చేసిన ప్రచారము అయ్యుండవచ్చుగాక; కానీ ఇది తప్పయ్యే అవకాశము కూడా లేదు. అంటే అలా జరిగే అవకాశం ఉన్నది. దేవతాప్రతిమలు రోదించడము, ఆహారము స్వీకరించటం, స్థలమార్పిడి వంటి సంఘటనలెన్నో జరిగాయి. ఇటువంటి సంఘటనలు జరిగాయని చెప్పినవారిని సందేహించ లేము. పెద్దలు నిజమే చెపుతారు కదా!!

ఏరోజులలోనైతే తంత్రవిద్య ఒక కంప్యూటర్, విమానము, రవాణావ్యవస్థ వంటి వాటివలె ఉపయోగించ బడుతుందో ఆ కాలములో దైనందినజీవితములో వాటి ప్రమాణాలు దృగ్గోచర మౌతాయి. చిల్లరడబ్బులు వేసి గిన్నెలోకి పాలు రాబట్టుకునే పద్ధతి ఈనాడు పెద్ద చమత్కారమేమీ కాదు. సభ్యతకు చెందిన ఈ సుదీర్ఘయాత్రలో కూడా గురుత్వాకర్షణశక్తి నుండి బయట పడి వాయువేగముతో ఎక్కడినుండి ఎక్కడికో వెళ్లిపోగలగటము, అగ్ని-వాయు-జల-ఆకాశ-పృథ్వీతత్త్వములను వాటి గుణ-ధర్మములకు విరుద్ధముగా పనిచేయించగలిగే ప్రయోగాలు సాధ్యపడినాయి. ఆ సభ్యతను పరిచయము చేస్తూ మనీషులు ఇలా వ్రాశారు. 'నేటి నవనాగరిక సభ్యత ఆ స్థాయికి ఇంకా చేరుకోలేదు. అక్కడికి చేరుకోవాల్సి ఉన్నది. ఆ సభ్యత స్థూల పరికరముల సహాయము లేకుండానే చమత్కారములను చేసి చూపిస్తుంది. ఈనాడు యుద్ధములలో అనేకరకాల బహు మూల్యమైన అస్త్ర-శస్త్రములు వినియోగించబడుతున్నాయి. ఒకవేళ ఏవైనా రెండు దేశములు 45 రోజులపాటు నిరవధిక పోరు సాగించినచో ఆ దేశముల ఆర్థికస్థితిగతులు 2,3 సంవత్సరములు వెనక్కిపోయేంత అధిక ఖర్చుతో కూడుకున్నవై పోతాయి యుద్ధాలు. ఏరోజులలోనైతే సూక్ష్మజగత్తులోనూ వ్యాపించి ఉన్న శక్తిని ఉపయోగించుకుని యుద్ధములు జరుగుతాయో; ఆరోజులలో నేటి వలె ఆర్థికవ్యవస్థ కుదేలై పోదు. అలా చేయటానికి ప్రచండమైన ఆత్మశక్తిని జాగృత పరచు కోవాల్సి ఉంటుంది. డబ్బు సంపాదించుకోవటము, సాధనము లను సమకూర్చుకోవటము కన్నా కూడా ఆత్మశక్తి సముపార్జన మరింత శ్రమతోనూ, ప్రతిభతోనూ కూడుకున్న ప్రయత్నము. ఆత్మశక్తిని పొందినచో రణరంగములో వారుణాస్త్రము, ఆగ్నేయాస్త్రము, సమ్మోహనాస్త్రము, నాగపాశము మొదలగు వాటిని అతి సహజముగానే ప్రయోగించవచ్చును.

పురాణములలోనూ, కావ్యములలోనూ చేసిన వర్ణనలన్నీ కూడా చారిత్రకదృష్ట్యానే నిజమైనవని చెప్పటము మా ఉద్దేశ్యము కాదు. వాటిలో వర్ణించబడినవన్నీ కూడా కాల్పనిక జగత్తు నుండి పుట్టినవి కాదు' అని యోగిజనులు సెలవిస్తారు. నిజముగానే ఆ శక్తుల అస్తిత్వమున్నది. వాటిని గూర్చి చెపుతూ తంత్రమార్గ ఆచార్యులు ఇలా ప్రశ్నిస్తున్నారు. 'అటువంటి సిద్ధులు, విచిత్రాలు ఈనాడెక్కడైనా మచ్చుకైనా కనిపిస్తున్నా యేమిటి? కుంభవృష్టిని కురిపించగల వారుణాస్త్రం; అగ్ని కీలలను సృష్టించగల ఆగ్నేయాస్త్రం; ప్రజలను సమ్మోహనానికి గురిచేయగల సమ్మోహనాస్త్రం ఈనాడు ఎక్కడున్నాయి? ఇంజన్-ఆవిరి-పెట్రోల్ వంటి ఇంధనములు లేకుండా నీరు-భూవ్యాకాశములు మూడింటి మీద సమానముగా ప్రయాణించగల వాహనం ఎక్కడైనా కనిపిస్తున్నదా ఏమిటి? మారీచుని వలె మనిషి నుండి పశువుగా మారటం, నల-నీలుల వలె నీటిమీద తేలియాడే రాళ్ళను తయారుచేసి, ఆ రాళ్ళతో సముద్రము మీద వంతెన నిర్మించడము, యుద్ధములో అదృశ్యమైపోవటము, సంజీవనీవిద్య ద్వారా మృతశరీరములో ఊపిరిలూదటము వంటివి సాధ్యమేనా? కాదు.

వైదికకాలం నుండే వికసించబడిన ఈ విద్య నాగార్జునా చార్యుడు-గోరఖ్‌నాథ్-మత్స్యేంద్రనాథ్ వంటి సిద్ధపురుషులు గతించిపోయాక నెమ్మదిగా లుప్తమైపోసాగింది. సిద్ధపురుషులు తమ సూక్ష్మశక్తిని జనహితమునకై వినియోగించారు. తత్కారణ ముగా తంత్రవిద్య ఫలిస్తూవచ్చింది. 'సావిద్యా యా విముక్తతే' అనగా ముక్తిని ప్రసాదించేదే విద్య అని కూడా ఉల్లేఖించ బడినది. ఎప్పుడైతే తంత్రవిద్య మోక్షమును ప్రసాదించేస్థాయి నుండి క్రిందకు జారిపడి భోగసాధనకు ఆలంబనయైనదో అప్పుడిక దానిలో వికారాలు తలెత్తడము స్వాభావికమేకదా మరి? తంత్రవిద్యలో ప్రవేశించిన వికృతులు దానిని-అవిద్యగా -మార్చివేశాయి. పనికొచ్చే విద్యను-పనికిరాని విద్యగా

**స్వేచ్ఛలేని జీవితం ఆత్మలేని శరీరం ఒక్కటే**

మార్చివేశాయి. ఇక ఆ అవిద్య ఘోరాంధ కారములో పడి కొట్టుమిట్టాడేందుకు కారణమైనది. విదేశీ ఆక్రమణలు, ఆకతాయిలు చేసిన దాడులు ఈ పతన-పరాభవములకు, దుస్థితికి కారణమని ఎవరైతే భావిస్తారో; వారంతా సగం నిజమే చెపుతున్నారు. పూర్తి నిజమేమిటంటే తంత్రవిద్య ద్వారా ఉపలబ్ధమయ్యే విభూతులను క్షుద్రమైన స్వార్థప్రయోజనాల కోసం వినియోగించుకోవటం మొదలైన రోజు నుండి మన సమాజము దీనంగా, హీనంగా మారిపో సాగింది. పరమాణు యుద్ధము ముగిశాక ఏవిధమైన వినాశనం జరుగుతుందని ఊహిస్తామో; అలాగే మహోన్నతవిద్య ద్వారా లభించిన సిద్ధులను మితిమీరిన వ్యక్తిగత రాగద్వేషములను ప్రదర్శించ టానికి, ఇంద్రియసుఖములను అనుభవించటానికి దురుప యోగపరిచారు. కనుక ఆ విద్య కాలగర్భములో కల్సిపోయింది.

తంత్రవిద్య ఛిన్నాభిన్నమైపోయి ఈనాడు కేవలం అతుకుల బొంత వలె ఉన్నది. ఆ మిగిలిన చిన్నచిన్న ముక్కల నుండి తంత్రవిద్య యొక్క సమగ్ర వైభవమును ఊహించలేము. ఐనప్పటికినీ దాన్ని గురించి ఎంతో కొంత తెలుసుకొనగలము. తంత్రవిద్యలో ఇప్పుడు సశేషముగా వున్నవాటిలో 'ఇతరుల మీద మంచి లేదా చెడు ప్రభావమును చూపించగల సామర్థ్యము అనేది ఒకటి!' కొద్దిపాటి ఏకాగ్రతను సాధించి మంత్రముల యొక్క విశిష్ట జపానుష్ఠానం చేసిన పిమ్మట ఈ శక్తిని ప్రాప్తించుకొనవచ్చును. అభిచారము-ఉపశమనం వంటి కర్మకాండల రూపంలో ఈనాడు ఈ విద్య క్రొత్తరూపును సంతరించుకుని ప్రజామోదమును పొందుచున్నది. ఒకానొక సమయములో ఈ కృత్యములను మూఢనమ్మకము, వెనుకబాటుతనము అని అంటూ జనం తమ అభిప్రాయమును వ్యక్తపరచేవారు. కానీ 80వ దశకం తరువాత వీటి తీరు మారి; ప్రజల ఆలోచనాశైలి పరివర్తన చెంది వీటిపట్ల ఆసక్తిని పెంచుకోసాగారు.

ఆత్మశక్తిని ఘోరంగా దురుపయోగపరచుకునే కృత్యం పేరే 'అభిచారం!' అభిచారకృత్యం ద్వారా ఆరోగ్యవంతుడైన వ్యక్తిని రోగాలపాలు చేయవచ్చును. ఏదైనా జబ్బును, వ్యాధిని చాలా తొందరగానూ, తేలికగానూ మనిషి శరీరములోకి ప్రవేశపెట్ట వచ్చును. ప్రయోగం యొక్క తీవ్రతను బట్టి మనిషి నెమ్మది నెమ్మదిగా క్షీణించిపోతాడు. అంతేకాదు నెలలు, సంవత్సరాల పాటు ఆ బాధను అనుభవిస్తూంటాడు. మంచానపడతాడు లేదా తక్షణమే మరణిస్తాడు. అభిచారము ద్వారా ఎవరి బుద్ధి నైనా సరే మార్చి ప్రక్కదారి పట్టించవచ్చు(మంచికీ ఉపయోగ పడుతుంది). అప్పుడతను సరైన నిర్ణయము తీసుకోలేడు. బుద్ధి పెడత్రోవ పట్టుట వలన సదా తప్పుడు నిర్ణయములనే తీసుకుంటాడు. తనకు తానే నష్టమును కలిగించుకుంటాడు. మెదడు మీద చేయబడిన ప్రయోగాల వలన మనుష్యులు పిచ్చివారవడము కూడా కనిపిస్తూనే ఉంటుంది. అభిచార ప్రయోగము తీవ్రముగా లేకపోయినట్లయితే అది నెమ్మదిగా చూపించే ప్రభావము చేత ఆ మనిషి భ్రమ, భయము, అనుమానము, సందేహము, అశాంతి వంటి చిత్తభ్రమల్లో కూరుకుపోతాడు.

ఉపశమనం అన్నది హానిని కలిగించే లేక దుశ్చర్యల ప్రభావమును దూరం చేసే ప్రయోగము. ఈ ఉపశమన ప్రయోగాలను-దృష్టిదోషం పోవుటకు, భూతోన్మాదము, దుష్ట శక్తుల ప్రభావము, శాపము, మారణము వంటి క్షుద్ర ప్రయోగములతో బలియగుట వంటివాటినుండి బయట పడటానికి ఆశ్రయిస్తారు. ఉపశమనం కళ్యాణకర స్వభావము కలిగినది. ఇతరులకు మేలును చేకూర్చే దృష్టితో దీనిని ప్రయోగిస్తారు. అందుచేత ప్రయోగము చేసినవారికి ఆ పుణ్య ఫలము తప్పక లభిస్తుంది. సాధకుడు తన శక్తి ద్వారా శుభకర మైన ప్రయోగాలు చేపడుతూ ఇతరులకు దారి చూపించడమే కాదు; స్వయముగా తనకు తాను సంతోషముగా ఉంటాడు. కానీ అభిచారకృత్యములను ప్రయోగించే సాధకుడు తనకు తానే హానిని కలిగించుకుంటాడు. ఎవరిమీదనైనా దాడిచేసే వ్యక్తి ఎదుటివ్యక్తిని తన శక్తితో దెబ్బతీయవచ్చుగాక; కానీ అతడు కూడా ఏమాత్రమూ ప్రసన్నముగా ఉండడు. దెబ్బతిన్న వ్యక్తి చిత్తం నుండి వెలువడే ప్రతీకారజ్వాల అభిచార ప్రయోగ మును చేసిన వ్యక్తిని పీల్చిపిప్పిచేసి చివరకు సర్వనాశనము చేసివేస్తుంది. అందువల్లనే తాంత్రికప్రయోగములు చేస్తున్న వ్యక్తులు ఎన్నడూ సుఖముగా, సంతోషముగా ఉండటము కనిపించదు. వారు రోదిస్తూ, విలపిస్తూ, బాధతో మూల్గుతూ, తిడుతూ ఉంటారు.

మారణం-మోహనం-ఉచ్చాటనం-వశీకరణం మొదలగు ప్రయోగాలలో ఈనాడు ఏ ఒక్కటీ చలామణిలో (వాడుకలో) లేదు. ఇతరులను సమ్మోహితులను చేసి వశపరచుకొనగలిగే సమ్మోహనమనే ప్రయోగము ఈనాడు చెయ్యబడుట లేదు. మానసికవైద్యులు-ఇంద్రజాలికులు ఈరకమైన పనిని

**ఈ జీవితం ఎవ్వరికి అందంగా చెక్కిన శిల్పం కాదు - దానిని మనమే అందంగా మలచుకోవాలి**

చేస్తున్నారు. కానీ అది కేవలము మనోవైజ్ఞానికప్రయోగమే తప్ప తంత్రము కాదు.

తాంత్రిక ప్రయోగాలలో కూడా మనోశక్తిని ఉపయోగిస్తారు. అది ఒక ఆవరణ వలె ఉంటుంది. ఆ ఆవరణకు నలువైపులా వ్యాపించి ఉన్న సూక్ష్మశక్తిని సమీకరించి, దానిని సరైన విధముగా, సరైన దిశలో ప్రయోగించినప్పుడే ముఖ్యమైన కార్యం నెరవేరుతుంది. దశదిశలా వ్యాపించియున్న శక్తి భాండారం నుండి సాధకుడు కణములను లేదా తరంగాలను పట్టుకుంటాడు. వాటినే ఉపత్యికా–కృత్రికా–కృత్యా అని కూడా పిలుస్తారు. అవగాహన చేసుకునేందుకు వీలుగా దానిని కుదించి – 'చేతనాగ్రంథి' అని చెప్పటము జరిగింది. చేతన యొక్క విశేష గుచ్ఛకములే గ్రంథులు! వాటిని ఎవరైనా సరే పట్టుకోగలరు. ఉదా: నెయ్యినిండి ఉన్న పాత్రలో ప్రతి ఒక్క నేతిబొట్టు నేతిలో ఉండే ప్రత్యేకతలతోనూ, గుణములతోనూ నిండి ఉంటుంది. బాగా కాచిన నేతిలో కొన్ని నేతిపలుకులు ఉంటాయి. వాటిని వ్రేళ్ళతో పైకితీసి ధాన్యపుగింజల వలె అఱచేతిలో పెట్టుకోవచ్చు. చేతనాగ్రంథులను కూడా ఈ ఉదాహరణ వలెనే అర్థము చేసుకోవాలి.

తంత్రసాధనలో చేతనాగ్రంథులు, ఉపత్యికలు మరియు కృత్యల నుండి తనకు అవసరపడే ప్రత్యేక అంశములను జాగృత పరచుకొని, చైతన్యము కావించుకొని సక్రియము చేసుకొన వచ్చును. సక్రియమైన తరువాత గ్రంథులు భృత్యుల వలె అనగా సేవకుల వలె పనిచేస్తాయి. వ్యావహారికముగా ఈ గ్రంథుల సముచ్చయమును, పిశాచము, భైరవుడు, ఛాయా పురుషుడు, బేతాళుడు, ప్రేతము మొదలైన పేర్లు గల సిద్ధులుగా పిలుస్తూంటారు. సిద్ధిపొందిన తాంత్రికునకు గ్రంథులు లేదా సూక్ష్మశక్తుల యొక్క గుచ్ఛకము 'యజమాని ఆజ్ఞలను పాలించే సేవకుని వలె పనిచేస్తున్నాయా' అన్నట్లుగా తాంత్రికుని ఆదేశాలను పాటించి, పనిని పూర్తిచేస్తాయి. శక్తులన్నీ ఆ సిద్ధ సాధకుని వశములో ఉంటాయి. తాంత్రికుడు వాటితో తన ఇచ్ఛానుసారము పనిచేయించుకుంటాడు.

తంత్రవిద్యకు సంబంధించిన అతి స్వల్ప అంశములు మాత్రమే ఈనాడు ఉపలబ్ధమౌతున్నాయని పైన చెప్పుకున్నాము కదా! ఆ మిగిలినవాటితో పెద్ద పెద్ద ప్రయోజనములు సిద్ధించవు. నిజజీవితములో చాలా వ్యక్తిగత స్థాయిలోనే వాటి ద్వారా లాభము పొందగలము. దుర్బుద్ధి, ఈర్ష్యాద్వేషములు నిండిన సమాజములో వాటి దురుపయోగమే ఎక్కువగా జరుగుతున్నది. ఈవిధమైన దురుపయోగము లేక దాడి జరుగుతుందని చెప్పినప్పటికినీ దాన్ని గురించి ప్రతి ఒక్కరూ భయపడ వల్సిన అవసరమేమీ లేదు. **ఈర్ష్య–పగ–క్రోధం–క్రూరమైన స్వభావం గల ప్రజలనే ఈవిధమైన దాడులు అమితముగా ఇబ్బందిపెడతాయి, కష్టపెడతాయి. పవిత్రమైన, సాత్వికమైన, కోమలమైన, సంవేదనాశీలమైన మనస్సున్న మనుష్యుల మీద వీటి ప్రభావము ఉండదు. చాలా శక్తివంతమైన దాడి జరిగినప్పటికినీ మంచి మనిషి తన నైర్మల్యము, సాత్వికతల బలం ఆధారంగా కొద్దికాలములోనే దాన్నుండి తప్పించుకుని బయట పడగల్గుతాడు.** సదాచారులకు తమ ఆంతరికస్థితి సుదృఢముగానూ, ఆరోగ్యముగానూ, పుష్టిగానూ ఉంటుంది కనుక వారు పెద్దపెద్ద తాంత్రిక ప్రయోగాల బారినుండి సత్వరమే కోలుకుంటారు.

తంత్రమార్గములో స్వయముగా ఎన్నో ముప్పులు పొంచి ఉంటాయి. వీటి సాధనాపద్ధతులను బాహాటముగా చర్చించ రాదు. ఒకానొక సమయములో అది పరమాణుబాంబు వలె శక్తివంతముగా ఉండి ఉండవచ్చు. ఈనాడు అది తుపాకీ తూటాల స్థాయిలోనే పనిచేస్తున్నది. తూటా, తుపాకీయే కాదు; చిన్నచాకులు, పెద్ద కత్తి (కరవాలం) స్థాయికి దానిశక్తి పరిమిత మైనప్పటికినీ, అటువంటి చిన్నా పొన్నా స్థాయి ప్రయోగములను చెయ్యటము కూడా నిషిద్ధమే. అందుకు కారణమేమిటంటే దుర్మార్గుల చేతిలో పడితే ఆ శక్తి అతనికీ–ఇతరులకూ కూడా ముప్పువాటిల్లజేసే అవకాశమే మెండుగా ఉంటుంది. ఇందు వల్లనే పాత్రత కలిగిన వివేకవంతుడు మాత్రమే తంత్రవిద్యకు అధికారి అవుతాడు అని సుస్పష్టముగా చెప్పబడినది. అంతే కాదు ఈ సాధనలను అందరూ చెయ్యకూడదు అని పెద్దలు ఒక హెచ్చరికను కూడా చేశారు. దానికి కారణమేమిటంటే– శక్తులు, సిద్ధులు హస్తగతమయ్యే చోట తప్పకుండా కొన్ని షరతులు కూడా ఉంటాయి. ఆ షరతులను, నియమాలను, క్రమశిక్షణను అనివార్యముగా పాటించి తీరవల్సినదే! అలా చేయుటలోనే మంచి, శుభము దాగియున్నది. ఎవరైతే ఆ కఠినమైన నియమాలను, షరతులను పాటించగలరో వారే తంత్రమార్గములో మున్ముందుకు సాగేందుకు ఆలోచించాలి. అట్టివారు తప్పక సత్ఫలితములను పొందుతారు అనుటలో ఎట్టి సందేహమూ లేదు.

*– అఖండజ్యోతి, సెప్టెంబర్ 2000*
*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

**నిజం చెప్పుటకు నీతి, మంచి చెయ్యుటకు మనస్సు కావాలి**

# మందులు వేసుకోవటము అత్యావసరము కాదు

ఈ విశాల విశ్వములో కోట్లాది ప్రాణులు, జీవజంతువులు ఎలాంటి మందులు వేసుకోకుండానే రోగములను తగ్గించు కుంటున్నాయి. తమ జాతికి అనువైన ఆహారమును తిని రోగ రహితముగా మనగలుగుతున్నాయి. రోగరహితముగా ఉండటమే కాక అవి శారీరకముగా మంచి బలమునూ, శక్తినీ కూడా పొందుతున్నాయి. అందుచేత ఈ సృష్టిలోని ప్రాణులన్నింటిలోకి శ్రేష్ఠునిగా భావించబడే మానవుడు 'మందులు వాడనిదే రోగములు తగ్గవు, ఆయుర్వేదములో తయారయ్యే ఫలానా భస్మాలను తింటేనే తప్ప బలము రాదు' అని అనుకుంటూంటే అది చాలా పొరపాటు. మానవుడు మరణము సంభవించేదాకా ఈ భ్రమలోనే ఉంటాడు. ఎవరికైనా జబ్బుచేసి మంచంలో పడినా లేదా ఏదైనా శారీరక వ్యాధికి గురైనా అతనిని చూడటానికి వచ్చే స్నేహితులు, సంబంధీకులు మొట్టమొదటగా వేసే ప్రశ్న – 'ఏదైనా మందు వాడుతున్నావా? లేదా? ఏం మందులు వాడుతున్నావు?' అనే! సరే రోగి వాడుతున్న మందు ఒకవేళ పనిచెయ్యటం లేదని భావిస్తున్నట్లయితే ఈ సర్వజ్ఞులు తమకు తెలిసిన కొన్ని క్రొత్త మందుల పేర్లు ఏకరువు పెట్టి అవి వాడమని ఉచిత సలహానిస్తుంటారు.

సర్వత్రా మానవుల పరిస్థితి ఇలాగే ఉండటాన్ని గమనిస్తే – అధికశాతం వ్యక్తులకు మందులు వేసుకొననిదే వ్యాధి తగ్గదు' అన్న దృఢమైన అభిప్రాయమున్నట్లు తెలుస్తున్నది. ఆకలి లేక పోవటం చేతనో, అధిక పరిశ్రమ చెయ్యటం వల్లనో, దిగులు వల్లనో, చెడు అలవాట్ల వల్లనో... ఇంకా మరే కారణం చేతనైనా సరే శరీరములో బలం తగ్గినప్పుడు 'బలమును వృద్ధిచేసే ఏదైనా మందు తీసుకుంటే తప్ప శక్తి రాదేమో' అని కచ్చితముగా అనుకుంటారు. ఇటువంటి ఆలోచనల ఫలితమే ఈనాడు మార్కెట్టులోకి వేలాదిగా క్రొత్త క్రొత్త మందులు వచ్చిపడు తున్నాయి. ప్రతిరోజు తెల్లవారేసరికి వార్తాపత్రికల్లో ఏదో ఒక క్రొత్త మందును గురించిన ప్రకటన ఉండటం సహజమై పోయింది.

అసలు విషయమేమిటంటే డబ్బు సంపాదించటానికి మందుల తయారీని కూడా ఒక మంచి మార్గముగా ఎన్నుకున్నారు నేటి జనం. ఐదారు రకముల ఓషధీమొక్కలను సేకరించి వాటిని నూరి–జల్లించి–ముద్దజేసి–మందుగుళికలుగా తయారు చేసి అమాయకప్రజల చేతులలో గుమ్మరించి డబ్బులు దండు కుంటారు వ్యాపారులు. మందు వేసుకోనిదే రోగము తగ్గదు అన్న కచ్చితమైన నిర్ణయమునకు అలవాటుపడిన ప్రజలు రకరకముల మందులను కొని అల్మైరాలలో నింపుకుంటున్నారు.

గడచిన 20, 30 సంవత్సరములలో ఎన్నో వేల రకముల మందులు మార్కెట్టులోకి వచ్చినాయి. వాటి గురించిన ప్రకటనలు ఎంత శక్తివంతముగా ఉంటాయంటే 'ఈ మందులు వాడితే నాకు లోకోత్తరమైన భాగ్యం లభించి తీరుతుంది' అన్న భావం చదివేవారిలో కలిగేటట్లుంటాయి.

మందులు వాడటము వల్ల రోగము తాత్కాలికముగా అణచిపెట్టబడుతుంది. కానీ వాటివలన శరీరములోని జీవనీ శక్తి చాలావరకూ క్షయమైపోతుంది. ఫలితముగా క్రొత్త రోగములు శరీరములో తలెత్తుతాయి. అందుచేత రోగము వచ్చినప్పుడు మందు వేసుకొని తాత్కాలికముగా ఉపశమనము పొందేకన్నా ఆ వ్యాధి రావటానికి అసలు కారణమును కనుక్కొని దానిని ప్రకృతి సహజ విధానములతో దూరము చేసే ప్రయత్నము చెయ్యాలి. వ్యాధికి అసలైన కారణమును తొలగించకుండా, తాత్కాలికముగా అణచిపెడుతున్న మందులను ఉపయోగించే నేటి వైద్యవిధానము ఎలా ఉందంటే దుర్గంధము వస్తున్న ప్రదేశములో ఆ దుర్గంధమును కలిగించే పదార్థమును తొలగించకుండా సువాసన వచ్చే సాంబ్రాణిపొగ వేసి, అగరు వత్తులను వెలిగించినట్లుగా ఉంటుంది. అవి వెలిగించినంతసేపే సువాసన ఉంటుంది. తర్వాత పరిస్థితి మొదటికి వస్తుంది.

రోగములు రావాలనే ప్రాకృతిక నియమమేమీ లేదు. కానీ ఆరోగ్య సంబంధిత నియమములను ఉపేక్షించడము వల్ల శరీరములో పేరుకుపోయిన విషపదార్థములను ప్రకృతి బయటకు నెట్టివేసే ప్రయత్నము చేసినప్పుడు వ్యాధి ప్రకటిత మవుతుంది. అందుచేత రోగమనేది మనకు హితము చేసే

**తనకు ఏమి కావాలి, ఎక్కడ దొరుకుతుంది తెలిస్తే ఎదుగుతాడు - గమ్యానికి చేరెడి దారిని తెలుసుకోవటమే జీవిత పరమార్థం**

మిత్రుడి వంటిది. కాబట్టి వ్యాధిని అణచిపెట్టివేసే మందులను వేసుకొనడమంటే దానిని బయటకు రాకుండా అడ్డుకున్నట్లే! ఇంటిలో పాము ఉన్నదని తెలిసినప్పుడు ముందర దానిని పట్టి బుట్టలో మూతపెట్టినా లేదా ఇంట్లో ఉన్న రంధ్రములను మట్టిపెట్టి మూసివేసినా పాము యొక్క ప్రమాదము నుంచి తప్పించుకున్నట్లు కాదు. కాబట్టి వ్యాధికి వేసుకునే మందు విషయములో కూడా ఇదే సూత్రము వర్తిస్తుంది.

## మందులు వాడటమనే ఫ్యాషన్ నానాటికీ వృద్ధి అవుతున్నది : 1.45

'జబ్బు చేసిందంటూ మావద్దకు వచ్చే రోగులలో సుమారు 70% మందికి అసలు వైద్యము చెయ్యవల్సిన అవసరమే ఉండదు' అని ఒక వైద్యుడే స్వయముగా పేర్కొన్నాడు. బాగా ఆలోచిస్తే ఆయన మాటలలోని సత్యము బోధపడుతుంది. తలనొప్పి, అలసట, జ్వరము, బలహీనత, మలబద్ధకము మొదలైన సమస్యలకు వైద్యుడి వద్దకు పరుగుతియ్యటం ఈనాడు ఒక ఫ్యాషన్‌గా మారిపోయింది. ఇవి అంత ప్రమాదకరమైన జబ్బులు కాకపోయినప్పటికీ జనం వీటి గురించిన ఆలోచనల లోనే మునిగి వాటికోసము ఎన్నోరకముల మందులు వేసుకుని క్రొత్త రోగములకు ఆహ్వానము పలుకుతున్నారు.

సాధారణముగా జనము ఏదైనా వ్యాధి వచ్చినప్పుడు ప్రారంభమునుండే దానిపట్ల తగిన శ్రద్ధ వహించకపోతే అది భయంకరమైన రోగముగా తయారవుతుందేమో అనుకుంటారు. ఈ ఆలోచనాక్రమం వల్లనే సామాన్యజ్వరంతో పాటు టైఫాయిడ్, టీ.బీ., తలనొప్పి, హిస్టీరియా వంటి రోగములు వస్తాయేమోననే సందేహమునకు పుష్టిచేకూరుతుంది. 'రోగమనేది శరీరము లోని విజాతీయపదార్థములను బయటకు నెట్టివేసే మార్గమే' అని వైద్యుడు లక్షసార్లు చెప్పినా రోగికి నమ్మకము కుదరదు. మంచి మాటలు చెప్పే వైద్యుడు రోగి దృష్టిలో అసమర్థుడు, చేతకానివాడు క్రింద లెక్క. అలాకాక రోగి చెప్పే కాల్పనికకథను శ్రద్ధగా వినే వైద్యుడు తెలివిగలవాడు, సమర్థుడు అని ప్రజల నమ్మకము. ఎక్కువ భాగం రోగములు ప్రజల ఊహలు, ఆలోచనల వల్ల పుడుతుంటాయి. ఈవిధమైన ఊహాజనిత రోగములను వృద్ధిచెందించటములో టానిక్కులు, మందుల ప్రకటనలు మరింత ద్రోహం చేస్తున్నాయి. 'నిద్ర లేవగానే మీకు మోకాళ్ళు, చేతివ్రేళ్ళు నొప్పులుగా ఉన్నాయా? ఐతే ఫలానా మందు వాడండి' అని దినపత్రికలలో పెద్ద పెద్ద అక్షరములతో ప్రకటనలను చూసి తక్షణమే మందుల దుకాణము వైపు పరుగెత్తి ఆ మందు తెచ్చుకొని వాడటం ఈనాడు ఒక ఫ్యాషన్‌గా మారింది. ఈవిధముగా ఇంట్లో అనవసరమైన మందులు కుప్పలు కుప్పలుగా వచ్చి చేరుతున్నాయి. అందులో ఎక్కువ భాగము టానిక్కులే! తమాషా ఏమిటంటే అసలు ఆధునిక సిద్ధాంతముల ననుసరించి 'టానిక్' అనేదే లేదు అని అంటారు నిపుణులు. టానిక్ అనే పదార్థము వల్ల ఒకవేళ ఏదైనా ఉత్తేజనము లభిస్తే అది అందులో వాడబడిన రసాయనికపదార్థముల వల్లనే అని తెలుసుకోవాలి. దానికి బదులు ఒక గ్లాసు పాలు త్రాగినా సరిపోతుంది.

తలనొప్పి, కడుపునొప్పి, తలతిరగడము, అలసటగా ఉండటము మొదలైనవన్నీ ఎక్కువగా మలబద్ధకము వల్లనే వస్తుంటాయి. జీర్ణశక్తి పెరగటానికి మందులు వాడితే లోపల అసలు రోగము అలాగే ఉండిపోతుంది. అవసరానికన్నా అధికముగా తినడమే మలబద్ధకమునకు మూలకారణము. ఏ కారణము చేతనైనా కొంచెము అధికముగా తింటే కనుక ఉషాపానం ద్వారా అనగా ఉదయమే 2 నుండి 3 గ్లాసుల మంచినీరు త్రాగడముతో సమస్య నివారింపబడుతుంది. వైద్యుల దగ్గరకు వెళ్ళటం గొప్పగా భావిస్తుంటారు. ఈ భ్రాంతిని మనస్సులో నుండి తొలగించుకొని ప్రకృతికి సమీపముగా జీవించగలిగితే మన ఆరోగ్యము అనుకున్నదానికన్నా ఎక్కువ సురక్షితముగా ఉంటుంది.

మార్కెట్టులో అమ్మే పండ్లు, ధాన్యాలు, కూరలు, పాలు, పంచదార... మొదలైన ఎన్నో పదార్థముల మీద సూక్ష్మక్రిముల బారినుండి కాపాడటానికై కొన్నిరకములైన రసాయనములను చల్లుతారు. విషాక్తమైన ఈ రసాయనములు కొద్దిగానే చల్లబడి నప్పటికినీ అవి మన శరీరమునకు అధికముగా హానిని కలుగ జేస్తాయి. 'ఈ రసాయనిక సమ్మిశ్రణములు ఎలాంటి వ్యాధులను కలుగజేస్తాయంటే వాటికి కారణములు కానీ, వాటికి చికిత్స గానీ మన ఊహకు కూడా అందవు' అని జర్మనీదేశపు ఫెడరల్ ఫుడ్ లేబోరేటరీ అధ్యక్షుడైన వాల్టర్ తెలియజేశాడు. మాంసం వృద్ధి కావటానికి పశువులకు కొన్ని ఇంజక్షన్‌లు చేస్తారు. ఆయా పశువుల మాంసమును తిన్న వ్యక్తులకు నపుంసకత్వం వంటి వ్యాధులు వచ్చే అవకాశముందని రూఢీగా తెలుస్తున్నది.

**భవిష్యత్తు గురించి ఎక్కువ ఆలోచించేవానికి భయం ఉంటుంది**

పైన చెప్పి ఉదాహరణలలో ఆధునిక అల్లోపతి మందుల గురించిన సమస్యలను కొద్దిగా వివరించడము జరిగింది. రాబోయే రోజులలో చికిత్సావిజ్ఞానం ఫలితముగా ఇవి ఇంకా ఎక్కువగా ఉత్పన్నము కానున్నాయి. కాబట్టి ముందుగా చెయ్యవల్సినదేమిటంటే వైద్యవిజ్ఞానం యొక్క ఆధారములను మార్చివేసి రోగమునకు మూలమైన అసలు కారణములను నిర్మూలించడము పైన దృష్టిని కేంద్రీకరించాలి. ఇది విజ్ఞాన వేత్తల కర్తవ్యము. సామాన్యప్రజలు రోగరహితముగా ఉండటానికై గుడ్డిగా మందులు వాడకుండా ప్రాకృతిక దినచర్యను అవలం భించడము ఎంతో అవసరము.

## యాంటీబయాటిక్స్ మందుల ద్వారా జరుగుతున్న సర్వసంహారము

బాక్టీరియా అనబడే అతి సూక్ష్మాతిసూక్ష్మమైన సూక్ష్మ క్రిముల ద్వారా వ్యాధులు ఉత్పన్నమౌతాయనేది అందరికీ తెలిసిన విషయమే. అందుచేత వాటిని సంహరించే ఉపాయమును కనుగొనాలి. రోగాలను ఉత్పన్నము చేసే ఆ శత్రువుల బారి నుండి మనల్ని మనము రక్షించుకోవాలి. మందులకు సంబంధించిన విజ్ఞానం ఈ రంగములో చాలా ప్రముఖముగా పనిచేస్తున్నది. బలమును కలిగించే మందులను పెద్దగా కనిపెట్టలేకపోయినా; ఘాతకమైన మందులను తయారు చేయటములో చాలావరకూ విజయమును సాధించింది. బలవర్ధకమైన ఏదైనా రసాయనికపదార్థమును కనుగొనగలిగితే బహుశా ధనికవర్గములో ఒక్కడు కూడా బలహీనముగా ఉండడేమో!

ఘాతకమైన ఔషధములు ఈ బాక్టీరియాలను చంపటములో అద్భుతమైన ప్రభావమును చూపిస్తున్నాయి. సూక్ష్మక్రిములను నాశనము చేసే మందులతో నిండిన బస్తాలు కెమిస్ట్ల గోదాముల నిండా నింపబడుతున్నాయి. అవి అధికముగానే అమ్ముడవు తున్నాయి. కానీ ఈ 'బాక్టీరియా' అనబడేవి మటుకు చస్తూనే వున్నా; అవి అమరత్వమును పొందినట్లు బ్రతుకుతూనే ఉంటాయి. 'బాక్టీరియాల'ను చంపటానికి మందులు వాడుతున్న ప్పటికీ అవి చావటానికి బదులుగా ఇంకా పెరిగిపోతున్నాయి. వాటివల్ల భయముతోటి మానవుడు క్షణం కూడా నిశ్చింతగా ఉండలేకపోతున్నాడు. ఈ అపజయమును, కారణములను అన్వేషిస్తూపోతే మనము మన అభిప్రాయములను సంపూర్ణముగా మార్చుకొనవల్సి ఉంటుంది. 'వ్యాధులను కలుగజేస్తున్నది బాక్టీరియా కాదు. మన శరీరములో స్వతహాగా ఆ వికృతి చోటుచేసుకున్నది' అని ముఖ్యముగా అర్థం చేసుకోవాలి. మన శరీరము లోపల వాటి ఉనికికి తగిన వాతావరణము ఏర్పడి నప్పుడే బయటనుండి అవి లోపలికి ప్రవేశించగలవు. ఆహార విహారములలో అవాంఛనీయత, ఆలోచనలలో ఆవేశము చోటుచేసుకున్నప్పుడే పైన చెప్పిన పరిస్థితులు ఉత్పన్న మవుతాయి. ఈ స్థితిని మనము సంస్కరించుకొనకపోతే కీటక నాశనమందులు పూర్తిగా పనిచెయ్యలేవు.

బాక్టీరియాలు ఒంటరిగా చావవు. ఈ సర్వసంహార ప్రక్రియలో సురక్షా ప్రహరీ అనబడే మన యొక్క రక్షణ కవచము నేలకొరుగుతుంది. ఈ రక్షణ కవచము యొక్క సామర్థ్యము మీదనే మన ఆరోగ్యమంతా ఆధారపడి ఉంటుంది. సూక్ష్మక్రిములను నశింపజేయటము కన్నా ఈ రక్షణ కవచము దెబ్బతినడమే అధికముగా ఉంటుంది. అంతేకాదు, ఈ సూక్ష్మ క్రిములు ఏదో ఒక మూల 5% ఉన్నా అవి అత్యంత వేగముగా వృద్ధిచెంది అనుకూల పరిస్థితులు రాగానే తుఫాను లాగా మన మీద విరుచుకుపడతాయి. బయట నుండి లోపలికి తీసుకునే గాలి-నీరు; అన్నం-జలం మొదలైనవాని ద్వారా అవి శరీరము లోపలికి ప్రవేశించటాన్ని అరికట్టడం సాధ్యం కాదు. శుభ్రతపరముగా వెయ్యి జాగ్రత్తలు తీసుకుని వాటిని నిరోధించాలని ప్రయత్నించినా ఏదో ఒక విధముగా అవి లోపలికి ప్రవేశించితీరతాయి.

వాటిని అడ్డుకొనటానికున్న ఏకైక మార్గము - 'స్వచ్ఛమైన, శుభ్రమైన, శక్తివంతమైన రక్తమును కలిగి ఉండటమే!' అప్పుడు ఎలాంటి బాక్టీరియా కూడా లోపలికి ప్రవేశించి మనుగడ పొందలేదు. ఆరోగ్యపరమైన నియమములను ఎంతో కఠినముగా అమలు చెయ్యగలిగినప్పుడే అది సాధ్యమవుతుంది.

'సామాన్యముగా ప్రజలు క్రిమిసంహారకమందులను వాడి వీలైనంత త్వరగా వ్యాధి బారినుండి బయట పడటానికి ప్రయత్నిస్తుంటారు కానీ; అసలు సూక్ష్మక్రిముల ప్రవేశమును నిరోధించటానికిగానీ, అవి లోపల వృద్ధిచెందగలిగే పరిస్థితులు కల్పించకుండా ఉండగలిగినటువంటి ఆహారవిహారముల ఎడ నియంత్రణను కచ్చితముగా అమలుచెయ్యాలి.

- అనువాదం: *శ్రీమతి కృష్ణకుమారి*

**గతాన్ని గురించి ఎక్కువ ఆలోచిస్తే బాధ మిగులతుంది**

# భారతీయ సమాజం (హిందూసమాజం) ప్రవర్తనపై స్వామి వివేకానందుని విశ్లేషణ-2

*(గతసంచిక తరువాయి...)*

## గురు గోల్వాల్కర్ స్థిర సంకల్పం

గాంధీజీ హత్య తదుపరి పరిణామాలను పరిశీలించిన గురు గోల్వాల్కర్ వ్యక్తిత్వం బోధపడుతుంది. గాంధీజీ హత్య వెనుక "రాష్ట్రీయ స్వయం సేవక్ హస్తమున్నదన్న అనుమానంతో రాష్ట్రీయ స్వయం సేవక్ కార్యకర్తలను వేలసంఖ్యలో ప్రభుత్వం నిర్బంధించింది. అప్పుడు ఏకనాథ్ రనడే (ఆర్.ఎస్.ఎస్. ప్రముఖ్) ఇండోర్‌లో ఉన్నాడు. సాయంత్రానికి జబల్‌పూర్ చేరుకోవాలి. ఆయన దారిలో ఉండగా ఆయనకు తెలిసింది గాంధీజీని చంపివేశారని అయినా తన ప్రయాణాన్ని కొనసాగించి 'మో' పట్టణానికి చేరుకున్నారు. ప్రజలు స్టేషనుకు చేరి నినాదాలు (స్లోగన్స్) చేస్తున్నారు. దీనిని గమనించిన రనడే తన మార్గాన్ని మార్చుకొని ఇటార్సీ మీదుగా నాగపూర్ చేరుకున్నాడు. నాగపూర్‌లో గురూజీ గోల్వాల్కర్‌ను గృహ నిర్బంధంలో ఉంచారు. ఇంటి చుట్టూరా పోలీసు పహరా ఉంది. ఎవ్వరిని లోనికి అనుమతించుటలేదు. స్వయం సేవకు లందరికీ గురూజీ ఒక సందేశాన్ని పంపారు. "అందరూ ప్రశాంతంగా ఉండండి. ఎవ్వరు రెచ్చగొట్టినా మీరు సంయ మనం పాటించండి." అదేరోజు చిట్నీస్ పార్కులో బహిరంగసభ ఏర్పాటు చేయబడింది. ఆ సమావేశంలోనికి వచ్చెడి ప్రజా సమూహాన్ని రెచ్చగొట్టి తదుపరి వారిని గురూజీ ఉన్న ఇంటిపైకి దాడికి పంపించుట దీని లక్ష్యం. గురూజీ ఇంటివద్దనున్న పోలీసు పహరాను ఉపసంహరించుట దీని వెనుక ఉన్న పథకం. ఇది తెలిసికొన్న రనడే రాత్రి చీకటిలో ఇళ్ళ పైకప్పుల దాటుకుంటూ గురూజీ ఉన్న ఇంటి పైకప్పు మీదుగా ఇంటి లోనికి ఎవ్వరూ చూడకుండా ప్రవేశించాడు. గురూజీని కలిసి జరుగ నున్న సంఘటనల గురించి వివరించి ఆయనను కారులో తప్పించి మరో చోటికి తరలించాలనెడి పథకాన్ని వివరించాడు. అంతా విన్న గురూజీ శాంతంగా ఇలా అన్నారు – "నీవు చాలా ఆందోళనలో ఉన్నావు. భయంతో ఉన్నావు. నేను ఎక్కడికి వెళ్ళాలి? ఎందుకు వెళ్ళాలి? **ఈ ప్రజలంతా మనవారే! నేను ఈ నాగపూర్‌లో నివసిస్తున్నాను! నా ప్రాణం కావాలంటే తీసికొమ్మను. బహుశ అది దైవీప్రణాళికేనేమో! నేను ప్రజల కోసమే పని చేస్తున్నాను. ఒకవేళ నేను వెళ్ళిపోవలసి వస్తే ప్రజల కోసమే పోతాను. నా ప్రజలకు నేను అక్కర లేకపోతే వారు నా ప్రాణాలు తీసుకోవచ్చు. బహుశ ఇది నా దేశానికి ఉపయుక్తం కావచ్చు. ఎవరికి తెలుసు? నేను ఎచ్చటికి పోను! నేను నా ప్రజల మధ్యే ఉంటాను, వారు నన్ను ఏమైనా చేయ వచ్చు. ఇచ్చట ఎవ్వరిని ప్రోగుచేయవద్దు. అనవసరంగా ఎవ్వరిని ప్రేరేపించవద్దు. రక్షక భటులున్నా లేకున్నా ఎవ్వరైనా నా వద్దకు నేరుగా రావచ్చు. మరోగంటలో ప్రజలు నన్ను చుట్టు ముడతారు అంటున్నారు. అప్పుడు నన్ను సంధ్యావందనం చేసికోనివ్వరు. కావున ఈలోపు నా సంధ్యావందనాన్ని పూర్తి చేసికొంటాను"** అన్నారు నిర్భయంగా.

అత్యంత ఉద్వేగస్థితిలో కూడా ఆందోళనకర పరిస్థితులలో కూడా మనిషి తన సంకల్పస్థితిని, స్థిరత్వాన్ని, లక్ష్యాన్ని కోల్పోరాదు. **ఇది గురూజీలోని ప్రత్యేకత. నిర్భయత్వాన్ని వ్యక్తం చేశాడు. ఇదంతా మన అంతఃకరణ పరిపక్వతను తెలుపుతుంది. కావున మనము మన నమ్మకాలను మన ఉన్నత గ్రంథాలైన వేదాలు, ఉపనిషత్తులు మున్నగువానిపై ఆధారపడి మలచు కోవాలి. మన ఆలోచనల ప్రచారం వలన ఫలితం ఉండదు. వానిని తొలుత మనమే ఆచరించి చూపాలి. ఇదే గురూజీ చూపిన బాట.**

**ఈనాడు సమాజానికి కావలసింది సాధన కాదు. కొలది పాటి సాధనతో కూడిన బహుళార్థ సాధక కార్యాచరణ. మన దేశంలో ఇప్పుడు జరుగవలసింది మతపరమైన పని అంతా, ప్రజోపయోగ కార్యక్రమాలలో వినియోగింపబడాలి. అప్పుడు దేశనిర్మాణం, సమాజనిర్మాణం ఏ రీతిగా ముందుకు పరుగెడు తుందో మీరే ఊహించుకోవచ్చు. దేశంలో అనేక చోట్ల నేడు భజనలు, పూజలు, ఆరాధనలు, జరుగుతూ ఉన్నాయి. ఇది నిర్మాణాత్మకమైన పని కాదు.** ఇదే పని భక్తియార్ ఖిల్జీ సమయంలో జరిగింది. ఆయన ఢిల్లీలో కొద్దిమంది సైనికులతో బయలుదేరి కలకత్తా వరకు నిరాటంకంగా జైత్రయాత్ర చేశాడు. దారిలో ఆయనను అడ్డుకొన్న వారే లేకపోయారు. వారికి

**వర్తమానంలో జీవించేవానికి ఆనందం ఉంటుంది**

సంబంధం లేదని మిన్నకున్నారు. ఎవరు వచ్చారు ఎవరు వెళ్ళారు అనేది మాకనవసరం మాకు వ్యక్తిగతంగా చెడు జరుగనంతవరకు అన్న భావనలో ప్రజలు ఉన్నారు. దీనివలన దేశం ఈనాడు ఈ దుస్థితిని ఎదుర్కొనుచున్నది. ఈ మత సంబంధిత పనులు, పూజలు సమాజ నిర్మాణానికి తోడ్పడవు.

ప్రతి ప్రణాళికకు ఒక వ్యతిరేక ప్రణాళిక ఉంటుంది. ప్రతి ఆయుధానికి ఒక వ్యతిరేక ఆయుధం ఉంటుంది. ఇదే స్థితి వివేకానందుని స్మారక నిర్మాణవేళ రనడేకు ఎదురైంది. సిమెంటు కాంక్రీటుతో స్మారకాన్ని నిర్మించుట తన లక్ష్యం కాదని, స్వామి వివేకానందుని వ్యక్తిత్వానికి ప్రతిరూపంగా నిలచి జీవనీశక్తితో తొణికిసలాడెడి స్ఫూర్తిదాయకమైన స్మారకాన్ని నిర్మించుటే తన లక్ష్యమని ప్రకటించాడు. ఇదే భావి భారతాన్ని ఆవిష్కరించుటకు స్ఫూర్తినివ్వగలదని భావించారు.

స్వామివివేకానందుడు భారతీయులకు అందించిన మంత్రము – **"మానవ సేవయే మాధవ సేవ"** – భగవంతుణ్ణి కోరికలు కోరమని స్వామీజీ చెప్పలేదు. గుహలలో కూర్చొని తపస్సు చేయమని చెప్పలేదు. సమాజంలో నిలబడి సమాజం మధ్యన జీవించు" అన్నారు. సన్యాసులు కాని, నిజమైన సమాజ సేవకులతో కూడిన సన్యాసుల సంస్థను నిర్మించుటకై కృషి చేశారు. స్వామీజీ ఆత్మవిశ్వాసం కలిగిన నూతన సమాజాన్ని నిర్మించ యత్నించాడు.

**అత్యంత శక్తితోకూడిన మంత్ర మరియు వాక్శక్తులకు వారసులైన భారతీయులే నేడు వారి నిజజీవితాలలో అత్యంత పిరికివారుగా, భయశాలురుగా రూపుదాల్చారు. ఓ వైపు మరణం లేదని చెప్పెడి మంత్రాలను వల్లిస్తూ, మరోవైపు భయంతో నిండిన జీవితాన్ని జీవిస్తుందుట అత్యంత శోచనీయం మరియు హృదయ విదారకం.** భారతదేశం తిరిగి తన పూర్వపు ఔన్నత్యాన్ని పొందవలయునన్నచో ప్రజలు పైన చెప్పిన భయాన్ని వీడి, కార్యోన్ముఖులు కావాలి.

**వ్యక్తులుగా భారతీయులు గొప్పవారే కాని ఏ ఇద్దరు ఒక ఉమ్మడి లక్ష్యసాధనకై కలిసి పనిచేయజాలని దుస్థితి భారతీయులది. భారతదేశాన్ని జయించిన మహమ్మదీయులు లేక క్రైస్తవులు, మంగోలియన్లు లేక ఐరోపావాసులు విజయం సాధించుటకు కారణం వారిలోగల ఐక్యత, కలిసి పనిచేసెడి గుణము. ఇదే మన శత్రువుల నుండి మనం నేర్చుకొనవలసిన సత్యము.**

మన వేదాలలోని మంత్రాలు నిరంతరం మనలో సామూహిక శక్తి యొక్క విలువలను పెంచి పోషించుటకు తోడ్పాటు నందించాయి. **దీనిని "యజ్ఞ" మాధ్యమంగా చేపట్టుటకు తోడ్పాటునందించాయి. ఇదే మనలను పూర్వము ప్రపంచంలో ఒక గొప్పజాతిగా శక్తిగా నిలిపింది. కాని కాలక్రమేణా మనము ఈ శక్తిని జారవిడచుకున్నాం. దీనితో మనము మన సర్వస్వాన్ని కోల్పోయాం. చివరకు మన స్వాతంత్ర్యాన్ని కూడా కోల్పోయాం. ఇప్పుడు మనము సామూహికశక్తిగా ఆవిర్భవించి, తిరిగి మన జాతి పూర్వపు ఔన్నత్యాన్ని పొందేలా కృషి చేయాలి.** విశ్వ గురుస్థానాన్ని అలంకరింపచేయాలి.

దేవుని పూజించుట అనగా ప్రపంచానికి సమాజానికి దూరమగుట కాదు. ఆచరణపూజ్యానికి ఆయన వ్యతిరేకి. అంతా మాయ అనెడి దానిలో మునిగిపోవుట తెలివిలేనితనం మరియు బాధ్యతారాహిత్యం. స్వామీజీ ఇట్టి వారితో యుద్ధం ప్రకటించారు. నీ చుట్టూ ఉన్న వారిలో భగవంతుని చూడలేని వాడివి ఎచ్చటనూ చూడలేవు అన్నారు. దీన్నికై తన జీవితమంతా పోరాడారు. ఉపనిషత్ సారాంశమిదియే. పనియే పూజించ దగింది. మానవ సేవయే మాధవ సేవ.

**సాంబారు తయారు చేయుటకు పప్పు – ఉప్పు వాడతారు. సాధన ఉప్పుతో సమానం అట్లే పని పప్పుతో సమానం. వీని రెండింటి మధ్య నిష్పత్తి చక్కగా ఉన్నప్పుడే ఆ వంటకము లేక ఆ వ్యక్తిత్వము పరిపూర్ణంగా ఉంటాయి. వివిధ ఆధ్యాత్మిక శక్తులతోపాటు మనము కూడా ఎదగాలి. అంతేకాని ఒక వర్గంగా మారరాదు. వివేకానందుడు ప్రజలను సాధకులుగా కాక కార్యోన్ముఖులుగా తయారుచేయుటకు కన్యాకుమారిలో ధ్యానం చేశాడు.**

**మనదేశంలో జరుగుచున్న మత సంబంధిత ప్రజా కార్యక్రమాలు దేశపునర్నిర్మాణానికి, ప్రజాసంక్షేమానికై ఉపయుక్తమైనచో ఉత్పన్నమయ్యెడి ఫలితాలు నిజంగా ఊహ కందవు.** ఆ ఫలితాలు ఒక అద్భుతమైన శక్తిగా ఉద్భవిస్తుంది. దేశంలోని ప్రజలనేకులు, మతసంబంధిత కార్యక్రమాలలో

**భయపడి చెవులు మూసుకుంటే, గెలుపు కొట్టే తలుపు చప్పుడు వినపడదు**

తలమునకలై ఉన్నారు, భజనలు చేస్తున్నారు, తీర్థయాత్రలు చేస్తున్నారు, సత్సంగాలు నిర్వహిస్తున్నారు, కీర్తనలు పాడుతున్నారు, ఇదంతా దేశ, సమాజ నిర్మాణానికి తోడ్పడవు. ఇవన్నీ కదలిక లేని ప్రాణశక్తి లోపించిన చర్యలతో సమానం. భక్తియార్‌ఖిల్జీ కాలంలో కూడా మనదేశం ఎన్నో మతసంబంధ పనులలో నిండిపోయి ఉంది. కాని ఏమి జరిగింది? ఆయన కొద్దిమంది గుర్రపు రౌతులతో ఢిల్లీలో బయలుదేరి తిన్నగా కలకత్తా చేరాడు. అక్కడి రాజ్యాన్ని ఆక్రమించాడు. మార్గమధ్యంలో ఆయనను ఎవ్వరూ ఎదిరించలేదు. ప్రజలంతా తమకు సంబంధం లేనట్లుగా ఉన్నారు. ఎవ్వరు వస్తున్నారు? వారు ఎందుకు వచ్చారు? ఏమి తీసికెళ్తున్నారు? వారి రాక వలన నష్టం కల్గిందా? **లాభం కల్గిందా? ఇంతటి పట్టరాని స్థితిలో జనులు ఉండుట వలననే ఈ దేశానికి ఈ దుస్థితి సంభవించింది. ఇటువంటి మత సంబంధిత కార్యకలాపాలు దైవసంబంధిత ఆలోచనలు ఎట్టి నిర్మాణాత్మకమైన పనులకు దారితీయవు. ఇట్టి పనులు అటు దేశానికి, ఇటు సమాజానికి ఎటువంటి ప్రయోజనాన్ని చేకూర్చవు.** స్వామీజీ అనేక పర్యాయాలు ప్రజలను మేల్కొల్పుటకు ప్రయత్నించాడు. ఇట్టి అచేతన నుండి, చేతనత్వంలోనికి వారిని నడిపించుటకు కృషిసల్పాడు.

స్వామీజీని దేవుని అవతారంగా చూడరాదు. మనము ఎదుర్కొనెడి సమస్యల పరిష్కారానికై అవతారాలు మనకు తోడ్పడవు. ఒక సామాన్య మానవునికి మార్గదర్శనం ఇవ్వగలగాలి. ఒక అవతార పురుషుడు ఇట్టి మార్గదర్శనాన్ని అందింపజాలడు. దీనిని మరో సామాన్యమానవుడు మాత్రమే ఇవ్వగలడు.

**స్వామీజీ కేవలం ఆయన తపశ్శక్తితో ఇంతటి గొప్పవాడు కాగలిగాడు. ఆయన ఒక సామాన్యకుటుంబంలో జన్మించాడు. ఆయన తన జీవితంలో అనేకానేక కష్టాలు అనుభవించాడు. దారిద్ర్యంలో మగ్గిపోయాడు. అన్నం లభించక పస్తులున్నాడు. కటికి నేలపై నిద్రించాడు. డిగ్రీ సాధించిన తదుపరి ఉద్యోగ వేటలో ఎన్నో బాధలననుభవించాడు. అట్లే ఆధ్యాత్మిక జీవన యానంలో కూడా అనేక కష్టాలనెదుర్కొన్నాడు. రామకృష్ణ పరమహంసను తొలుత నమ్మలేదు. దేవుడున్నాడని కూడా నమ్మలేదు. ఇట్టివాడే సామాన్య మానవులకు మార్గదర్శనం అందివ్వగలడు. రాముడు, కృష్ణుడు వీరిని మనము అవతారాలుగా చూస్తున్నాము. వారిని ఆదర్శంగా తీసికొని అనుసరించుటకు బదులుగా, వారిని మానవస్థాయికి పైనున్న వ్యక్తులుగా చూపి, వారిని అనుసరించి మన జీవితాలను చక్కదిద్దుకొనుటకు బదులుగా వారిని పూజించుటతో సరిపుచ్చుకుంటున్నాం. ఇదే మనజాతికి పట్టిన దుర్గతి. మనం అనుసరించవలసిన వారిని దేవునిగా చూపించి మానవ బాధ్యతల నుండి తప్పుకొనుచున్నాం.** ఆయన భగవంతుడు కావున ఆ పనులు చేయగలిగాడు, కావున ఆ పనులు మనం చెయ్యనక్కరలేదు అనెడి భావనలను జీర్ణించుకొన్నాం. మానవులు గొప్ప పనులు చేయజాలరని మన నమ్మకం. దీని ఫలితంగా మన మహాపురుషులందరిని భగవంతుని అవతారాలుగా మార్చివేశాం, వారిని ఆ దృష్టితోనే చూడసాగాం. మనదేశంలో మానవ గరిమను గుర్తించి తగిన రీతిలో గౌరవించుట అలవరచుకొనలేదు. ఎవ్వరైనా మానవా తీతమైన పనులు నిర్వహిస్తే వారిలోని నైపుణ్యత, పట్టుదల, సంకల్పం, కృషి, మున్నగునవి దీనికి కారణమని మనం అంగీకరించుటకు సిద్ధంగా లేము. ఈ లోపాన్ని మనం అధిగమించాలి.

వివేకానందుడు మనలానే ఒక సామాన్య మానవుడుగా జన్మించాడు. మనలో వలె బలహీనతలు ఆయనలో కూడా ఉన్నాయి. అన్నింటిని అధిగమిస్తూ వచ్చాడు. కాలగమనంలో ఆయనకు శ్రీరామకృష్ణ పరమహంసగారితో పరిచయమైంది. ఆయన ద్వారా తనలోని మానసిక శక్తులను పెంపొందించుకొనుటకు కావలసిన జ్ఞానాన్ని, శక్తిసంపదలను, సాధనలను అందిపుచ్చుకున్నాడు. ఆయన ఒక అత్యంత గొప్పవ్యక్తిగా ఎదిగాడు. దైవీగుణాలను పెంపొందించుకున్నాడు. ఆయన ఈ శక్తులను 39 సంవత్సరాల వయస్సు వచ్చేసరికి అందుకోగలిగాడు, అదే శంకరాచార్యుడు 32 సం॥ల వయస్సు వచ్చేసరికి అందుకోగలిగాడు. స్వామి వివేకానందుడు అనేకసార్లు చెప్పారు – "మీకు దేవునిపై నమ్మకమున్నచో మీపై మీకు విశ్వాసము ఉండాలి. మీరు ఎన్నో ఆశ్చర్యకరమైన పనులు చేయగలరు. ప్రతి మనిషిలోని ఆత్మ దైవాంశం కల్గినదే. దీనిని మన ప్రజల మనస్సులలో భావనలలో నింపాలి. ఇదే ఇప్పుడు కావలసింది. మనలో అంతర్గతంగా నిబిడీకృతమై దాగియున్న శక్తిని మనం వెలికి తెచ్చి ఉపయోగించాలి. ఆయా రంగాలలోనున్న గొప్ప వారితో ఈ విషయాలను చర్చించాలి. చరిత్ర మనకందించిన వానిని, గొప్పవారి జీవితాలు మన కందించిన జ్ఞానాన్ని

**పొగడ్తకు మందహాసం - తెగడ్తకు మౌనం వహించేవాడే ఉత్తముడు**

ఉపయోగించుకోవాలి. ప్రతి ఒక్కరు అత్యంత ఉచ్ఛస్థితికి ఎదగవచ్చని వేదాలు, ఉపనిషత్‌లు తెలుపుతున్నాయి.

తనపై తనకు నమ్మకమున్నవాడు దేనినైనా సాధించగలడు. ఇట్టి ఆత్మవిశ్వాసాన్ని తన దేశ పౌరులలో నింపేందుకు వివేకానందుడు అవిరళ కృషి చేశారు. మనలోని ప్రతి ఒక్కరిలో ఎంతోశక్తి దాగి ఉంది. దానిని సక్రమంగా వినియోగింపజాలకున్నాం. దానిని వెలికి తీయుట కూడా చాతకాని వారు అనేకులు ఉన్నారు. వారిలో నిక్షిప్తమైయున్న అంతర్గతశక్తిని ఉపయోగింపజాలకున్నారు. అట్లు చేసినవాడు వారు ఆకాశాన్ని, నక్షత్రాలను తాకగలరు. వీరికి అడ్డుగా ఏది నిలువజాలదు. **ఇట్టి ఆత్మవిశ్వాసము, దృఢ సంకల్పబలం ప్రజలలో ఉన్న తమోగుణాన్ని, సోమరితనాన్ని తొలగించి వారిలో చేతనత్వాన్ని నింపాలి. మతతత్వం చాటున పాతుకుపోయిన ప్రజలలోని జడత్వాన్ని, అదృష్టం, నుదుటిరాత మున్నగు వానిపైనున్న భ్రమలనన్నింటిని తొలగించాలి. వివిధ ఆధ్యాత్మిక సంస్థల జెండాల క్రింద ఉన్నవారినందరిని మేల్కొల్పి, జాతి ఉమ్మడి లక్ష్యాన్ని వారికి తెలియజెప్పాలి. అందరిని ఒకే వేదికపైకి తేవాలి. ఒక భారతజాతిగా వీరంతా ఐకమత్యముగా ఏకం కావాలి. భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించి, జాతినంతటిని ఒకే త్రాటిపై నడిపించవలసిన అవసరం నేడు ఎంతగానో ఉంది" అన్నారు వివేకానందుడు.**

**మన లక్ష్యాన్ని మనమే నిర్ణయించుకుంటాం. కర్మ సిద్ధాంతాన్ని అనుసరించి "నీవు ఈరోజు ఉన్న స్థితిగతులకు గత జన్మలలో నీవు చేసిన పనులే కారణం." నీ భాగ్యానికి నీవే నిర్మాతవు. అయాచితంగా, అప్రయత్నంగా లేక ప్రమాదవశాత్తు ఏదైనా జరిగినచో అది ప్రమాదవశాత్తు కాక మరొకటి కాదు. అది ఒక సంఘటన మాత్రమే అని గుర్తించండి. ప్రతి సంఘటనకు కార్యము, కారణము ఉంటాయి.**

మనము పశ్చిమదేశాలను విమర్శిస్తుంటాం. వారిది భౌతిక వాదము, మనము ఆధ్యాత్మికత తెలుసుకున్నవారం. మనం చనిపోయిన తరువాత ఏమవుతాం? మన గొప్పతనాన్ని గురించి చెప్పుకుంటూ ఉంటాం. **ఇప్పటికీ పశ్చిమ దేశాలలో అనేకమంది చర్చీలకు వెళ్ళి ప్రార్థనలు చేస్తారు. చర్చి ఫాదర్లుగా సన్యాసిసన్యాసినులుగా మారుచున్నారు. వారి వారి కుటుంబాలు వారిని ప్రోత్సహిస్తూ అభినందిస్తున్నారు. వారి కుటుంబంలోని ఒక వ్యక్తిని చర్చిసేవకై, భగవంతునిసేవకై నియోగించామని ఆనందిస్తూ, విందులు, వినోదాలు పంచుకుంటారు. ఇందు వలననే మనదేశంలో వేలసంఖ్యలో మిషనరీలు ఏర్పడ్డాయి. కాని మనలో ఈ తెగువ, ఈ సేవాభావం ఏమైనాయి? మాటలకు పరిమితమైపోయాం, చేతలకు దూరమైనాం. బాల్యం నుండి మనం ఆచరణకు దూరంగా ఉంటున్నాం! కర్తవ్యపాలనకు దూరం, బాధ్యతలకు దూరం.**

ఎదుటివారి సహాయం లేనిదే మనం అడుగు ముందుకు వేయజాలకున్నాం. **మన ఋషులు, మునులు వ్రాక్రుచ్చిన దానికి వ్యతిరిక్తంగా మనం నడచుకొనుచున్నాం! దీని నుండి మనజాతి బయటపడాలి. ఋషులవెంట, మునులవెంట, గారడీవాళ్ళ వెంట పడుతూ వారి ఆశీర్వాదాలకై వెంపర్లాడుతున్నాం. అడ్డ దారులలో ప్రయాణిస్తూ అతి తక్కువకాలంలో, శ్రమలేకుండా వరాలను పొందాలనెడి కోరికలతో కొట్టుమిట్టాడుచున్నాం.** దీనితో ఒక బలహీనమైన జాతిగా, వ్యక్తులుగా మరియు అసంఘటితంగా కూడా రూపుదాల్చాం. ఒక బలమైన అవతార పురుషుడు, ముని, ఋషిలాంటివాడు వచ్చి మనల ఉద్ధరించాలి అనెడి వాంఛలకు, ఆలోచనలకు బందీలమైనాం. "అహం బ్రహ్మాస్మి" అనెడి ఉపనిషద్ వాక్యాన్ని మనకు అన్వయించుకొని తదనుగుణంగా మన జీవనవిధానాన్ని రూపొందించ జాలకున్నాం. **ప్రతిఆత్మ వస్తుతః దైవాంశతో కూడి ఉన్నది. ఆత్మకు చావులేదు. అమృతాన్ని సేవించిన వారము అంటూ ఉంటాం! కాని నిజజీవితంలో మనం ఇలాంటి భావనలతో జీవించుట లేదు. స్వామి వివేకానందుని మాటల్లో – "మీకు నిజంగా ఈ దేశంలోనున్న 33 కోట్ల దేవీదేవతలందు విశ్వాస మున్నచో మొదట మీపై మీకు విశ్వాసముండాలి. తొలుత "నరుడు నారాయణునిగా ఎదుగుతాడు" అనెడిది మన జాతి ప్రగాఢ విశ్వాసం. దీనిని మన ఋషులు, మునులు వారి నిజ జీవితంలో పరీక్షించుకొని నిగ్గు తేల్చిన జీవిత సత్యాలు. దీని సాధనకై ప్రతి వ్యక్తి తీవ్రసాధన చేయాలి.** అప్పుడు ఈ విశ్వంలో మనం దేనినైనా సాధించగలం. ఆనాడు ఈ దేశం విశ్వ గురుత్వాన్ని పొందగలదు.

*ఆంగ్ల మూలం: ఏకనాథ్ రనడే*
*"Story of Vivekananda Rock Memorial"*
*తెనుగు సంకలనం: ఎ. వేణుగోపాలరెడ్డి*

**కలలు కనే వాడు మరో ప్రపంచాన్ని సృష్టిస్తాడు**

గురుపౌర్ణమి ప్రత్యేకం

# గురుకృప వలన క్రొత్త జన్మ లభించినది



అక్టోబర్‌నెల మరీ వేడి గాను లేదు, మరీ చల్లగాను లేదు. వాతావరణము ఎంతో ఆహ్లాద కరముగా ఉన్నది. ఇక్కడి నుండీ బదరీనాథ్, కేదార్‌నాథ్, గంగోత్రి, యమునోత్రి అనే నాలుగు దివ్యధామాలకు యాత్ర ప్రారంభ మౌతుంది. హిమాలయముల నుండి దిగివచ్చే గంగా ప్రవాహం ఇక్కడ మరింత వేగవంత మౌతుంది. ప్రాతఃకాలములో మలయమారుతం మందంగా వీస్తున్నది. ఏంజెల్ ఒక రాతి మీద కూర్చుని నిర్మలమైన గంగా ప్రవాహ మును తిలకిస్తున్నది. పాదాలు గంగను తాకకుండా జాగ్రత్తపడుతూ కూర్చున్నది. ఆమె కన్నులలో కాంతి తళుక్కు మంటున్నది. గంగమ్మతల్లి శీతలత్వము, పవిత్రతలతో ఆమె మనసు పరవశమౌతున్నది. కానీ ఆమె కళ్ళు వెనుకకు తిరిగి ఎవరినో వెదుకు తున్నట్లు చూస్తున్నాయి. వాస్తవానికి ఆమె కళ్ళు ఎవరిని వెదుకు తున్నాయో వారి గురించిన వివరములు ఆమెకు తెలియదు. ఇంత పెద్ద నగరమైన ఋషీకేశ్‌లో ఆమెకు అతడిని ఎక్కడ వెదకాలో, ఎలా అడగాలో తెలియని పరిస్థితి. ఐతే అతడిని తప్పక కలుసుకొనగలనని ఏంజెల్‌కు పదే పదే అనిపిస్తున్నది.

అమెరికాలోని ఒక పెద్ద సంస్థలో ఉన్నతపదవిలో ఉద్యోగం చేస్తున్న ఏంజెల్ రెండువారాల సెలవుమీద భారతదేశ పర్యటనకై వచ్చింది. దీనితరువాత మళ్ళీ ఇంకొకసారి భారతదేశమునకు తాను రాలేనేమోనని ఆమెకు అనిపిస్తున్నది. అందుచేత తన ప్రాణాలను రక్షించిన ఆ అజ్ఞాతవ్యక్తికి ధన్యవాదాలు తెలపాలని ఆమె వచ్చింది. ఋషీకేశ్‌కు వచ్చి ఒక వారం గడిచిపోయింది కానీ ఆ అజ్ఞాతవ్యక్తిని ఇంతవరకు ఆమె కలవలేకపోయింది. ఈ సాయంకాలమే ఆమె ఢిల్లీకి చేరుకొని, అక్కడినుండి రాత్రి 2.30 గం॥లకు విమానమెక్కి అమెరికాకు తిరిగి వెళ్ళవలసి ఉన్నది.

ఆ అజ్ఞాతవ్యక్తి యొక్క అనుపమానమైన సహాయత, సహృదయతల మూలంగా ఏంజెల్‌కు ఒక క్రొత్త జన్మ లభించినట్లైనది. $3^1/_2$ సంవత్సరముల క్రితం జరిగిన ఆ సంఘటన తాలూకు స్మృతి ఆమె మదిలో సజీవంగా ఉన్నది. ఆరోజు ఇదే సమయము, ఇదే రేవులో, ఇదే బండరాయి పైన ఆమె కూర్చొని ఉన్నది. అప్పుడు ఆమెకు 'ఆరోజే తన జీవితములో ఆఖరిరోజు' అనిపించసాగినది. 'దీని తరువాత అంతా శూన్యము! మహాశూన్యమే! జీవిత పరిసమాప్తి తరువాత ఏమౌతుంది?' అని మదిలో కలతచెందసాగినది. ఏంజెల్‌కు కడుపు లోపల చిన్నప్రేవులలో కేన్సర్ వచ్చింది. అమెరికాలోని వైద్యులు భగవంతుడిని ప్రార్థించడ మొక్కటే ఉపాయమని చెప్పేశారు. ఏంజెల్ యొక్క తల్లిదండ్రులు, సోదరి, సోదరుడు ఎంతో బాధపడుతున్నారు. భారతదేశములోని తీర్థములు, గంగానది యొక్క మాహాత్మ్యము గురించి ఏంజెల్‌కు ఇంత క్రితమే పరిచయమున్నది. 'అమ్మా! నేను నా శరీరమును గంగానది ఒడ్డున వదిలివేస్తాను. గంగామాత నన్ను పిలుస్తున్నది. నేను అక్కడకు వెళుతున్నాను. గంగామాత యొక్క పవిత్రమైన ఆకర్షణ నా హృదయమును ఉద్విగ్నభరితము చేస్తున్నది' అని తల్లితో చెప్పి, కుటుంబసభ్యులు వారిస్తున్నా వినకుండా ఆమె ఋషీకేశ్‌కు చేరుకున్నది.

ఋషీకేశ్‌లో ఏంజెల్ బసచేసిన హోటల్ నుండి చూస్తే గంగానదీ, హిమాలయపర్వతసానువులు దర్శనమిస్తాయి. పొట్టలో వ్యాధి వలన కలిగే తీవ్రమైన బాధతో ఆమె ఉండుండి విలపిస్తున్నది. ఆమె భోజనం చెయ్యలేకపోవటం అటుంచి, ఏదైనా పళ్ళరసం తీసుకున్నా కూడా అది ఆమెను తల్లక్రిందులు చేస్తున్నది. గంగానది ఒడ్డున మాత్రం ఆమె ఒకింత సేదదీరేది. ఇవాళ ఆమె కూర్చున్న ఆ ప్రదేశమే ఆ సమయములో కూడా ఆమెకు ఎంతో ఇష్టమైన ప్రదేశంగా ఉండేది. ఒకనాటి సాయం కాలం ఆమె ఇదే స్థలములో కూర్చునుండగా తీవ్రమైన బాధ ఆమె కడుపులో సుళ్ళుతిరిగినది. కళ్ళుతిరిగి గంగలో పడి

**ఒకటి పుట్టినరోజు, రెండవది ఎందుకు పుట్టింది తెలుసుకున్నరోజు - ఈ రెండూ మరపురానివి**

పోతానేమో ననిపించి ఆమె అతి కష్టమ్మీద ముఖం రెండవవైపుకు తిప్పుకుంది. సరిగ్గా అదే సమయములో అపరిచితుడైన ఒక యువసన్యాసి ఆమెను సమీపించి 'నేను మీకు ఏమైనా సహాయ పడగలనా? మీరు చాలా అశాంతిగా ఉన్నట్లున్నారు? మీరు నాపైన నమ్మకముంచితే నేను మీకు సహాయం చెయ్యగలను. మీరు సంపూర్ణమైన ఆరోగ్యమును పొందగలరనే నమ్మకం నాకున్నది' అని ఆంగ్లములో అడిగాడు.

ఏంజెల్ విస్మయముతో అతని వంక చూస్తూ 'నా శరీర మంతటా కేన్సర్‌వ్యాధి వ్యాపించి ఉన్నది. ఇక నాకు చెయ్య వలసినదేమీ లేదు. ఐనా మీరు ఇంత అభిమానముతో అడుగు తున్నందుకు ధన్యవాదాలు. దయచేసి మీ పేరేమిటో చెప్పండి' అని అన్నది.

గౌర వర్ణములో ఆకర్షణీయమైన రూపురేఖలతో ఉన్న అతడు పసుపుపచ్చని ధోవతీ, లాల్చీ ధరించాడు. 'నా పేరు సమర్పణ్. మధ్య భారతదేశములోని ఛత్తీస్‌గఢ్ ప్రాంతం మా నివాసస్థానం. ప్రస్తుతం నేను మా గురువుగారి వద్ద శిక్షణ కోసం వచ్చి ఉన్నాను. ఆయనతో పాటు బదరీనాథ్‌పైన ఒక గుహలో నివాసం ఉంటున్నాను. ఇక్కడ కొంచెంసేపు తిరుగుదామని వచ్చాను' అని చెప్పాడా యువకుడు. 'సమర్పణ్' పేరు కలిగిన ఆ యువకుడిని చూస్తూ ఏంజెల్ కొద్దిసేపు మరణాంతకమైన తన బాధను మరచిపోగలిగినది.

'ఏంజెల్ పద! మా గురువుగారు నిన్ను తీసుకురమ్మన్నారు. వారు తప్పక నీకు ఉపశమనమును ప్రసాదించగలరు' అన్నాడు.

'సరే పదండి. నాకు తగ్గుతుందనే ఆశ లేదు. అయినా మీ నమ్మకమును ఎందుకు కాదనాలి?' అని అంటూ లేచిన ఏంజెల్‌కు చేయూత నిచ్చి ఎలాగో ఒకలాగా గురువుగారి సమ్ముఖమునకు తీసుకెళ్ళినాడు. అప్పటికి సాయంత్రం దాటి చీకటి ప్రవేశిస్తున్నది.

'రా తల్లీ! ఆందోళనపడవద్దు. అంతా చక్కబడుతుంది!' అని పలికి గురువుగారు ఏంజెల్‌ను ఒక ఆసనంపై పరుండజేసి కొన్ని ప్రత్యేకమైన యౌగికక్రియలు చేసి మంత్రములతో ఆమె శరీరముపై ఊదారు. మంత్రముల ధ్వని అస్పష్టముగా ఉండుటచేత 'సమర్పణ్'కు మంత్రమును గురించిన అర్థమేమీ బోధపడలేదు. మంత్రం, యోగక్రియల ప్రభావం చేత ఏంజెల్ శరీరములో అలజడి తగ్గి శాంతంగా, స్థిరంగా తయారైనది.

కొద్దిసేపటి తరువాత గురువుగారు ఏంజెల్‌కు ఒక ప్రత్యేకమైన ప్రాణాయామం నేర్పించారు. ఈ క్రియ వలన ఏంజెల్ భరించశక్యంకాని ఆ బాధను కొంతవరకూ ఓర్చుకొనగలిగినది.

'తల్లీ! నీకు పూర్తిగా నయమౌతుంది. నా ఆశీస్సులు ఎల్లప్పుడూ నీ వెంటనే ఉంటాయి. నీవు ఎక్కడున్నా, అక్కడే నేను నీకు దర్శనమిస్తాను. ఈ ప్రాణాయామమును ప్రతిరోజు చెయ్యవలసి ఉంటుంది' అని చెప్పి; సమర్పణ్ వైపు తిరిగి 'నాయనా! వెళ్ళి ఏంజెల్‌ను ఆమె నివాసస్థానములో వదిలిపెట్టి రా' అని చెప్పారు.

ఏంజెల్‌కు ఆమె పట్ల ఇప్పటివరకు జరుగుతున్నదంతా నమ్మశక్యం కావటంలేదు. 'భారతదేశములో ఇటువంటి మహాత్ములు కూడా ఉంటారా!' అన్న దిగ్భ్రాంతితో ఆమె తన కళ్ళను తానే నమ్మలేకపోతోంది. సమర్పణ్ ఆమెను ఆమె బస చేసిన హోటల్ వద్ద దించి వెళ్ళిపోయాడు. ఒకవారం రోజుల వరకు అతనితో మాట్లాడుతూనే ఉన్నది ఆమె. తదుపరి అమెరికాకు తిరిగి వెళ్ళిపోయింది. ఆమెను సంపూర్ణ ఆరోగ్య వంతురాలినిగా చూసి అక్కడివారందరు ఆశ్చర్యచకితులయ్యారు. ఏంజెల్‌కు ఒక విధంగా ఇది పునర్జన్మే! అక్కడ ఆమె ఒక సంస్థలో ఉద్యోగం చెయ్య సాగింది. రెండువారాల సెలవు దొరికిన కారణముగా ఆమె తిన్నగా భారతదేశమునకు వచ్చింది. ఆమె కళ్ళు సమర్పణ్ కోసం గాలించసాగినవి. ఈవిధంగా ఆమె గతస్మృతులలో లీనమై ఉండగా అకస్మాత్తుగా వెనుకనుండి 'ఏంజెల్! నువ్విక్కడా? ఎప్పుడు వచ్చావు? అన్న పరిచిత స్వరం విని వెనుదిరిగింది. అక్కడ నిలబడి ఉన్న సమర్పణను చూసి ఆమె ఎంతో సంతోషించినది.

'నువ్వు కనపడతావన్న నమ్మకమే లేకుండాపోయింది. ఈ రోజే నేను తిరిగి అమెరికా వెళ్ళవలసి ఉన్నది' అన్నది ఏంజెల్.

'ఇదంతా గురువు కృప వలన మాత్రమే సంభవించినది. నేను కూడా గురువుగారి ఆదేశాల మేరకు నా కార్యరంగం వైపు తిరిగి వెళుతున్నాను' అన్నాడు. సమర్పణ్‌కు కూడా ఇదంతా ఒక పొడుపుకథగా అన్పించసాగినది. సమర్పణ్ ఏంజెల్‌కు భోజనం పెట్టించి ఒక టాక్సీలో ఆమెను ఢిల్లీకి పంపించే ఏర్పాటుచేసి వీడ్కోలు పలికాడు. కొద్దిరోజుల తరువాత సమర్పణ్ తన ఇంటికి తిరిగివచ్చాడు. ఏంజెల్ వెళ్ళేటప్పుడు సమర్పణ్ ఇంటి చిరునామా తీసుకుంది.

**నీ నవ్వు నీ మనోభావాలకు ప్రతిరూపం - మనస్ఫూర్తిగా నవ్వు**

సమర్పణ్ ఇంటికి వచ్చి తన పనిలో లీనమైనాడు. సరిగ్గా ఒక సంవత్సరము తరువాత అతనికి ఏంజెల్ యొక్క తమ్ముడి నుండి ఒక ఉత్తరం వచ్చింది. సంతోషముతో విప్పి చూశాడు. కానీ అందులోని సమాచారం చదివి నమ్మలేకపోయాడు. ఏంజెల్ యొక్క మరణవార్తను ఆమె తమ్ముడు అందులో తెలియ జేశాడు. దానితోపాటు ఏంజెల్ 'సమర్పణ్'కు వ్రాసిన ఉత్తరమును జతచేశాడు. ఏంజెల్ ఉత్తరములో 'ప్రియమైన సమర్పణ్! గత రాత్రి నాకు ఒక కల వచ్చింది. నేను నీ వద్దకు వచ్చి విషయములు చెపుదామనుకున్నా. కానీ అంతకాలం ఆగలేక ఉత్తరం వ్రాస్తున్నాను. నేను చూసిన కలలో గురువుగారు అదే ప్రేమపూరితమైన మధురస్వరంతో 'తల్లీ! నీవు ఇంటికి వెళ్ళవద్దు. నా వద్దకు వచ్చెయ్యి. నేను అక్కడ నీకోసం ఎదురుచూస్తుంటాను' అన్నారు. ఈ సంఘటన ఇటువంటి విస్మయాత్మకమైన, రహస్య పూరితమైన పద్ధతిలో సమాప్తమౌతుందని అతడు ఏమాత్రము ఊహించలేదు.

ఆశ్చర్యచకితుడైన అతడు గురువును స్మరిస్తూ భావ సమాధిలోకి ఎప్పుడు ప్రవేశించాడో అతనికే తెలియదు. సమాధి స్థితుడై ఉన్న సమర్పణ్‌ను చూసి గురువుగారు 'నాయనా! గత జన్మలో ఏంజెల్ నీకు గొప్ప సహాయం చేసింది. ఈ జన్మలో నీవు ఆమెకు ప్రత్యుపకారం చేసి ఋణం తీర్చుకున్నావు. నేను ఆమెను భారతదేశంలోని ఒక మంచి కుటుంబములో జన్మించే లాగా చేస్తాను. ఇంక ఈ విషయమై దిగులుచెందకుండా నీవు నీ పనిపట్ల దృష్టిసారించు. ఈ సృష్టి మొత్తము కర్మనను సరించి నడుస్తుంటుంది. కర్మ సమాప్తమైనప్పుడు సంబంధం కూడా సమాప్తమైపోతుంది. ఇదే సత్యం!' అన్నారు.

ఆయన ఈ మాటలు అంటూండగానే సమర్పణ్ యొక్క ధ్యానం చెదిరిపోయింది. సృష్టిలోని సత్యం యొక్క రహస్యం అతని కళ్ళెదుట సాక్షాత్కరించసాగింది.

*– అఖండజ్యోతి, మార్చి 2014*
*అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*

---

## పూవు పుట్టగానే పరిమళిస్తుంది: మహర్షి దధీచి వృత్తాంతము

*మహర్షి దధీచి తన బాల్యం నుండి పరోపకార పరాయణత్వం కల్గినవాడు. ఒకసారి ఒక చెట్టు కొమ్మపై విషపూరితమైన పాము చేరింది. అదేకొమ్మపై ఒక కౌజు పక్షి కుటుంబం నివసిస్తున్నది. పాము నెమ్మదిగా వెళ్ళి ఆ కౌజు పక్షి పిల్లలను నోట కరచుకొని మ్రింగుటకు సిద్ధము కాసాగింది. పక్షి పిల్లలు భయంతో రెక్కలు కొట్టుకొంటూ అరవసాగాయి. తమ పిల్లలు మృత్యు ఒడిలో ఉండగా చూచి తల్లి పక్షి, తండ్రి పక్షి ఏడవసాగాయి! కొమ్మ క్రింద ఈ తతంగాన్నంతా చూస్తూ కొందరు గుమిగూడారు. కాని వారిలో ఏ ఒక్కరు పక్షిపిల్లలను కాపాడుటకై సాహసించలేదు. ఆ సమీపంలోనే బాలుడు దధీచి ఆడుకుంటున్నాడు. చెట్టు క్రింద జరుగుచున్న అరుపులను విని దధీచి అచ్చటికి చేరుకున్నాడు. అచ్చటనున్న వాస్తవిక స్థితిని గమనించి దధీచి వెంటనే చెట్టుపైకి ఎక్కాడు. చెట్టు క్రింద ఉన్నా వారంతా పెద్దగా కేకలు వేస్తూ "దధీచి! క్రిందికి దిగారా! పాము నిన్నుకాటు వేస్తుంది!" అంటూ అరవసాగారు. దధీచి బదులిస్తూ, ప్రాణులను రక్షించుట మనుష్యుల ధర్మం! కౌజుపక్షుల పిల్లలు ఆపదలో ఉన్నాయి! నేను చూస్తూ ఊరుకోజాలను" అంటూ కర్రతో పామును కొడుతూ పక్షి పిల్లలను పామునోటినుండి విడిపించేలా చేశాడు. తమ పిల్లలు రక్షింపబడుటను చూచిన తల్లి పక్షి, తండ్రి పక్షి కిలకిలారావాలు చేస్తూ ఎగిరిపోయాయి! ముందే పగబట్టి ఉన్నది పాము. చెట్టుకొమ్మపై నుండి దధీచి దూకాడు. అతనిని చుట్టుముట్టిన వారంతా, దధీచి నీకు భయమేయలేదా? అని ప్రశ్నించగా "భయమెందుకు? తప్పు పని చేస్తున్నప్పుడు భయం ఉంటుంది! మంచి పనులు చేసెడి వారిని స్వయంగా భగవంతుడు రక్షిస్తాడు. అని బదులిచ్చాడు దధీచి! బాల్యం నుండి అలవడిన ఈ పరోపకార బుద్ధియే దధీచిని లోకరక్షణ కార్యాలలో ముందుంచింది – త్రిపుర సంహారార్థమై తన వెన్నెముకను దానంగా ఇచ్చిన గొప్ప దానశీలిగా నిలిచాడు. ఈ సద్గుణాల వల్లనే నేటికి కూడా దధీచి విశ్వవిఖ్యాతుడుగానే నిలిచాడు.*

*– హిందీమూలం: అఖండజ్యోతి, జూన్ 2016*
*అనువాదం : ఎ. వేణుగోపాలరెడ్డి*

---

**నీలోని సంతోషం, ఉల్లాసం నీ దేహాన్ని ఓ శక్తికేంద్రంగా మార్చుతాయి**

జ్యోతిర్విద్య

# సమగ్రజ్ఞానం అందరికీ అందాలి

జ్యోతిష్యం వేదజ్ఞానంలోని ఆరు అంగాలలో జ్యోతిష్యం ఒక ప్రముఖ అంగం. సౌరమండలంలోని నవగ్రహాలది, బ్రహ్మాండంలో వ్యాపించి ఉన్న 27 నక్షత్రాల అసాధారణ ప్రభావం భూమి మీద ఉంటుంది. ఈ విధంగా లాభపడక పోయుంటే భూమి కూడా సౌరమండలంలోని మిగిలిన గ్రహ ఉపగ్రహాల లాగానే ఒక నిర్జీవ పిండంలా పడుండేది.

ఎప్పుడు, ఏ నక్షత్ర ప్రభావం భూమి మీద ఎంతుంటుంది? ఎప్పుడు, ఏ ఏ గ్రహ నక్షత్రాలు భూమికి ఎంతెంత దూరంలో ఏ స్థితిలో ఉన్నాయి, వాటి ప్రభావం నీరు, వాయువు, చెట్లు, ప్రాణుల మీద ఎలా ఉంటుంది మొదలైన విషయాల గురించిన జ్ఞానం జ్యోతిషశాస్త్రం ద్వారానే తెలుసుకోగలం. వాతావరణంలో మార్పు, వర్షాలు, క్షామం, భూకంపం, తుఫాన్లు, మహమ్మారి వంటి ప్రాకృతిక ఆపదల ప్రభావం గురించిన జ్ఞానం తెలుసుకుని ప్రతికూలతల నుండి ముందే జాగ్రత్త పడవచ్చు, అనుకూల విషయాల వల్ల లాభమూ పొందవచ్చు.

పుట్టిన పసికందులు ఎంతో నాజూగ్గా ఉంటారు. వారిపై సౌరమండల పరిస్థితుల యొక్క ప్రభావం ఉంటుంది. ఈ ఆధారంగా వ్యక్తి యొక్క అభిరుచి, ప్రతిభ, వ్యక్తిత్వం మొదలైనవి ఎలా ఉండవచ్చు అనే విషయాలు బాగా తెలుస్తాయి. మనిషి జీవితంతో ఘనిష్ఠ సంబంధం ఉన్న మరెన్నో రహస్యమయ విషయాలున్నాయి. ఇటువంటి విద్య గురించిన సరైన జ్ఞానం ఉంటే వ్యక్తి తన క్రియాకలాపాలను అదృశ్య అంతరిక్షంతో పరస్పర సామ్యాన్ని ఏర్పాటు చేసుకోవచ్చు. అందుకే విజ్ఞానాన్ని వేదాంగాలలోని ఆరు భాగాల్లో ఒకటిగా భావించారు.

అయితే గ్రహాల సూక్ష్మగణితంలోనే ఇబ్బందొస్తుంది. కాలంతో పాటు మార్పులు వస్తూంటాయి. వాటిని సరైన సమయానికి మారుస్తూండే వ్యవస్థ ఈ రోజుల్లో లేదు. పృథ్వి తన చుట్టూ తాను తిరగడానికి సరిగ్గా 24 గంటలు పట్టవు. కొన్ని క్షణాల తేడా ఉంటుంది. ఈ విధంగా ఒక సంవత్సర కాలానికి 365 రోజులు కాకుండా 366.20 రోజులు పడుతుంది. పృథ్వి గురించిన మరో వింత విషయం ఏంటంటే అది తిన్నగా ముందుకు సాగదు. పరిగెడుతూ, గంతులు వేస్తూ, ఓల లాడుతూ, నాట్యం చేస్తూ పరిక్రమ పథం మీద వెళుతుంది. కాబట్టి దాని కక్ష్యలో కూడా మార్పులు వస్తూంటాయి. సూర్య చంద్రుల కదలికల విషయంలోనూ అంతే. ఒకో సారి సూర్యుడు చల్లబడుతూంటాడు, మధ్యమధ్యలో భయంకర సౌర జ్వాలలు వెదలగక్కుతూంటాడు. చంద్రుడు భూమి నుండి దూరంగా వెళుతూంటుంది. అందుకే దాని ఆకారం తగ్గటమే కాక సముద్రంలో పోటెత్తే అలలు కూడా తగ్గుతూ పెరుగుతూ ఉంటాయి. సౌరమండలంలోని మిగిలిన గ్రహాల కదలికలు, కక్ష్యల గురించిన లెక్కలు కూడా పూర్తిగా సరైనవి కావు. కాబట్టి పంచాంగ నిర్మాణవిధి ప్రకారం చూసుకుంటే అన్నీ సరైన లెక్కలుండవు. కొంత కాలానికి వాటిలో మార్పులు వస్తూంటాయి. సరైన ఉపకరణాలను ఉపయోగించి వాటిని మార్పులను నమోదు చేస్తూ ఉండాలి. దీన్నే దృశ్యగణితం అంటారు.

భారతీయ జ్యోతిర్విజ్ఞానం ఆధారంగా ఒకప్పుడు ఏర్పాటు చేయబడ్డ వేధశాలలు (observatories) కాలచక్రంలో మార్పుని బట్టి కొత్త తరహాలో పునర్నిర్మించవలసి వచ్చింది. జైపుర్ రాజు ఢిల్లీ, జైపుర్, ఉజ్జైన్, మథుర మరియు వారణాసిలలో ఐదు వేధశాలలు నిర్మించారు. దేశంలో పలుచోట్ల సూర్య మందిరాలు ఉన్నాయి. వాటి నిర్మాణాల్లో కూడా వేధశాలల యొక్క విశేషత ఉంది. కోణార్క్‌లోని సూర్యమందిరం దీనికే ఉపయోగపడింది. శాంబపురీ, ఉదయగిరీలోని వేధశాలలు కూడా ప్రసిద్ధమైనవి. ఢిల్లీలోని కుతుబ్ మినార్ నిర్మాణం కూడా వేధశాల లాగానే జరిగింది. అందులోని 7 అంతస్తులు, 7 గ్రహాలకు, 27 కిటికీలు 27 నక్షత్రాలను గమనించడానికి నిర్మించబడ్డవి. పృథ్వి కొంత ఒరిగి ఉంటుంది, దానికి తగ్గట్టుగా కుతుబ్‌మినార్ పై భాగం 5 డిగ్రీలు వంగి ఉన్నట్టుగా చెప్పబడు తుంది. అదేదో కట్టడంలో జరిగిన పొరపాటనుకుని ఆంగ్లేయులు ఆ పై భాగాన్ని కొట్టించేసారు, ఇప్పుడు ఆ మిగిలింది మినార్ అవశేషం మాత్రమే. 21 జూన్ మధ్యాహ్నం దాని నీడ నేల మీద పడదు.

**నీలోని విచారం, దుఃఖం నీ దేహాన్ని సారహీనంగా మార్చుతాయి**

ఈజిప్ట్‌లో పిరమిడ్ల సంరచన కూడా ఈ నిమిత్తమే జరిగింది. వాటి పొడవు, ఎత్తు, వెడల్పు అన్నీ ఒక పద్ధతి ప్రకారంగా రూపొందించారు. వాటిని బట్టి భూమి నుండి సూర్యుడి దూరాన్ని కొలవగలరు. పృథ్వి కేంద్రం ఉన్న చోట ఈ కట్టడాలను నిర్మించారు. స్కాట్‌లాండ్ నుండి బెర్మూడా క్షేత్రం వరకు విస్తరించిన స్థలంలోని విశాలమైన శిలల సంరచనతో కూడా సూర్యుడి నుండి భూమి మధ్యలోని దూరం తెలుస్తుంది. మెక్సికో, చైనా, మరియు అరబ్ దేశాల్లో కూడా ఇటువంటి అవశేషాలు లభ్య మయ్యాయి. ప్రపంచ వ్యాప్తంగా జ్యోతిష జ్ఞానం గురించిన ఎరుక ఉండేదని, సమయాను సారంగా గమనించుకుంటూ మార్పులు చేస్తూండేవారని తెలియవస్తుంది. వీటి ద్వారా దృశ్య గణితాన్ని ఉపయోగించుకుని పృథ్వికీ మిగిలిన గ్రహాలకు మధ్య తేడాలను తెలుసుకుని మార్పులను చేస్తూండే వారు.

భూమి వ్యాసం 13,000 కి.మీ. 71% సముద్రపు నీటితో నిండి ఉంటుంది. 29% భూమి ఉంటుంది. పసిఫిక్ మహా సముద్రం లోతు 14050 అడుగులుంటుంది. ఉపరితలం మీదుండే ఆర్కిటిక్ మహా సముద్రం 4200 అడుగులే లోతుంటుంది. సముద్రం లోపల కూడా పెద్ద పెద్ద పర్వతాలు ఉంటాయి.

భూమి బరువు 66,00,000,000,000 ఖరబ్బు టన్నులు. (ఒక ఖరబ్బు=పదివేల కోట్లు) 30 కిమీ/సెకను వేగంతో తిరుగుతూంటుంది. 365.2 రోజుల్లో సూర్యుడ్ని పరిక్రమిస్తుంది. ఉత్తర ధృవం 14,000 అడుగులు లోతుంటుంది, దక్షిణ ధృవం 19,000 అడుగులు ఎత్తులో ఉంటుంది. ఉత్తర ధృవంలో మొక్కలు, మనుషులు, పశువుల అస్తిత్వం కనిపిస్తుంది. కాని దక్షిణ ధృవంలో మాత్రం పెంగ్విన్లు మరియు ఒక రకమైన దోమలు మాత్రమే కనిపిస్తాయి. రెండూ ఎగరలేవు.

అంతర్గ్రహ తరంగాలు ఉత్తర ధృవానికి చేరతాయి. వాటిలో ఉపయోగకరమైనవి పృథ్వి గ్రహిస్తుంది. అనవసరమైన వాటిని దక్షిణ ధృవం గుండా వదిలేస్తుంది. భూమి మీదనుండే చల్లటి పొర సామాన్యంగా 15 మైళ్ళ లోతువరకే ఉంటుంది. ఆ తరువాత వేడి ద్రవాలతో నిండి ఉంటుంది. ఎప్పుడైనా సముద్రజలాలు ఈ ద్రవాలను చేరితే ఆవిరైపోతాయి, జ్వాలా ముఖీ పర్వతాలు బద్దలవుతాయి, భూకంపాలొస్తాయి. వీటి వల్ల భూమి మీద ప్రాణులు భయంకరంగా నష్టపోతారు, చాలా ఇబ్బందులపాలవుతారు.

పృథ్వి మీదకు ప్రసరించే సూర్యకిరణాలను పర్యావరణం వడపోసి పంపిస్తుంది. ఈ కిరణాల వల్ల వేడి, వెలుగుతో పాటు ప్రాణుల అస్తిత్వం ఉంటుంది, ఉత్పత్తి కూడా జరుగు తుంది. పృథ్వి మీద జీవనదాయకమైన వాయుమండల పొర కమ్ముకుని ఉంటుంది. మనం ఊపిరి పీల్చుకోగల వాయువు 100 మైళ్ళకన్నా ఎక్కువుండదు. ఇది కాక పృథ్వి మీద కప్పబడి ఉన్న లావు పొర నుంచి మిగిలిన గ్రహాల ప్రభావం వడపోసాక, ఉపయోగకరమైనవి మాత్రమే భూమిని చేరతాయి. మొదటి పొరను అయనోస్ఫిర్, రెండవది ట్రోపో స్ఫియర్, మూడవది స్ట్రాటోస్ఫియర్, నాలగవది ఒజోనోస్ఫిర్, ఐదవది ఎవజోస్ఫియర్ షంటారు. ఇవన్నీ 65,000 అడుగుల ఎత్తుంటాయి.

ధృవకేంద్రాల పరిస్తితి విచిత్రంగా ఉంటుంది. అక్కడ 6 నెలలు పగలు, 6 నెలలు రాత్రి ఉంటుంది. వెలుగు దోబూచు లాడుతూంటుంది. నేల మీద నడుస్తున్న వాళ్ళు గాల్లో తేలు తున్నట్టు కనిపిస్తారు. శబ్దాలు మారుమ్రోగడం, రకరకాల ఈలలు వినిపించడం, ఇవన్నీ ధృవక్షేత్రాలలోని వింత విషయాలు భూమి మీదకు గ్రహశక్తులు వస్తూ పోతూ ఉంటాయని నిరూపిస్తాయి. వీటి గురించిన సమగ్ర జ్ఞానం సంపాదిస్తే, మన వర్తమానం, భవిష్యత్తుల గురించి మనకి తెలియని ఎన్నో విషయాలు తెలుసుకోగలం.

భూమి మీదకు సూర్యశక్తి ఏ అనుపాతంలో వస్తుందంటే, ఆ తీవ్రతతో మనషుల అవసరాలన్నీ తీరిపోతాయి, వేరే శక్తి స్రోతలు అవసరమే లేదు. సముద్రంలోని ఉప్పు నీరు కూడా ఆవిరై తాగునీటి సమస్య పూర్తిగా తీరిపోగలదు.

భూకంపాలు, జ్వాలాముఖీ విస్ఫోటాలు, హిమయుగం, సునామీలు మొదలైనవన్నీ దేనితో ముడిపడి ఉన్నాయో అవన్నీ జ్యోతిష్య విజ్ఞానం ద్వారానే తెలియస్తాయి. తోకచుక్కలు, ఉల్కల వంటి వాటి రాక సంకటానికి తక్కువేమీ కాదు. వాటి రాక యొక్క సరైన సమయం లెక్కించగలిగితే ఆ విపత్తులను ఆధునిక అణుఆయుధాలను ప్రయోగించి దూరం చేయచ్చు.

ఎన్నో సంవత్సరాలు సూర్య, చంద్ర గ్రహణాలంటే దేవతలకు కోపం రావడం వల్లనో, ఆపదల రాకను సూచించడమో అనుకునే వారు. కానీ వైజ్ఞానిక జ్ఞానం వల్ల ఆ అపోహలన్నీ తొలిగి పోతాయి. గ్రహణం అనేది సూర్యుడు, చంద్రుడు, భూమి నీడల ఆట. ఆకాశంలో నక్షత్రం విస్ఫోటనం అయితే ఎవరో

**నవ్వు అనే ఆభరణం నీ ముఖానికి అందాన్ని చేకూర్చుతుంది**

మహాపురుషుని మృత్యువుకు సూచనగా భావించేవారు. కాని ఇప్పుడు వాటి గురించిన సత్యాలు తెలిసాయి. మంగళగ్రహం, గురుగ్రహాల మధ్య తిరిగే ఉల్కలు, వాటి ముక్కలు ఎగిరి వాతావరణంలోకి పడతాయి. ఆ ధాటికి కాలి బూడిదవుతాయి. వాటి వెలుగే ఉల్కాపాతంగా కనిపిస్తుంది. భూకంపాలు, జ్వాలా ముఖి విస్ఫోటాలకు సంబంధించి భయంకర మూఢనమ్మకాలన్నీ జ్యోతిర్విజ్ఞానం తెలియడం వల్ల వాటంతటవే దూరమై పోయాయి.

ఆకాశంలో విహరించడం, ఉపగ్రహాలను పంపడం వంటివి తేలికైపోయాయి. పని చేసుకోడానికి, లాభం పొంద డానికి ఆకాశమనే కొత్త క్షేత్రం దొరికింది. మనుషుల మీద పడే గ్రహాల ప్రభావం గురించి తెలియడం వల్ల ముందు జాగ్రత్తలు తీసుకోవడం సులువైంది. ఋతుపవనాలు, తుఫాన్లు మొదలైన వాటి గురించిన సూచనలు ముందే లభించడంతో రక్షణ చర్యల గురించి ప్రణాళికలు వేయగలుగుతున్నారు.

నక్షత్రాలు ఆకాశంలో చెట్లకు వేలాడదీసిన దీపవిన్యాసాల్లా ఉంటాయనుకునేవారు, కాని ఇప్పుడు అవి కూడా సూర్యుడి లాంటివే అని, ఒకదానికొకటి కొన్ని లక్షల కాంతి సంవత్సరాల దూరంలో ఉంటాయని తెలిసింది. ప్రకాశ గణితంలో ఒక ప్రకాశ కిరణం 1,86,000 మైళ్ళు/సెకను వేగాన్ని కొలమానంగా భావిస్తారు. దీన్ని బట్టి కాంతి సంవత్సరం లెక్కిస్తారు. అంత దూరం ఉండడం వల్ల ఆ నక్షత్రాలు పృథ్వి మీద జీవులపై గొప్పగా ప్రభావం చూపలేవు. ఈ మూఢనమ్మకాన్ని కూడా విజ్ఞానం తొలగించింది.

జ్యోతిర్విజ్ఞానం యొక్క పరిధి చాలా విస్తారమైనది. దీని ద్వారా భూమి యొక్క ధరాతలంపై మరియు అంతరిక్షంలో జరిగే సంఘటనల క్రమం తెలుస్తుంది, మనుషుల వ్యక్తిగత ప్రకృతిలోని గుణదోషాల గురించి తెలుసుకున్నాక ఒక నిష్కర్షకు రావచ్చు. తద్వారా అనర్థాలకు దారితీయగల పరిస్థితులను ఆపవచ్చు. కాని ఇదంతా ఎప్పుడు సాధ్యం. సమగ్రమైన జ్యోతిష్య జ్ఞానం తెలుసుకుని, నేర్చుకుని, నేర్పించగలిగినపుడు. పెద్దగా శ్రమపడలేని వాళ్ళు, బజార్లో దొరికే పంచాంగాల ఆధారంగా గ్రహదోషాలున్నాయి అంటూ అమాయకుల్ని భయపెట్టి డబ్బు లాక్కునే వ్యాపారం చాలా మంది మొదలుపెట్టారు. బజార్లో పంచాంగం కొన్నంత మాత్రాన జ్యోతిష్కులైపోతే గ్రహ గణితం వంటి కష్టమైనవి నేర్చుకునే ప్రయత్నం ఎందుకు చేయడం?

భూమి మీద ఒక్కోచోట పగలు రాత్రి వేరు వేరు సమయాల్లో ఉన్నట్టే, గ్రహనక్షత్రాల వల్ల పడే ప్రభావం కూడా వేరు వేరుగానే ఉంటుంది. కాబట్టి స్థానీయ లెక్కలకు తగ్గట్టుగా పంచాంగాలు ఏర్పడాలి, స్థానికులు వాటినే ఉపయోగించాలి. బొంబాయిలో గణితంతో తయారయిన పంచాంగం ఉపయోగించి ఢిల్లీలోని పరిస్థితులను అంచనా వేయడం కుదరదు. మన క్షేత్రం లేదా మన దగ్గరలోని క్షేత్రానికి సంబంధించిన పంచాంగం ఆసరా తోనే కావలసిన ప్రయోజనం సిద్ధిస్తుంది.

జ్యోతిర్విజ్ఞానం ఎంతో విశాలమైన క్షేత్రం. మనకు తెలిసిన జ్ఞానంతో పాటు భౌతిక జ్యోతిష్యంలో జరిగే పరిశోధన మరింత మెరుగులు దిద్దింది. దాంతో జ్యోతిష్యానికి సంబంధించిన మూఢనమ్మకాల నుంచి బయటపడి గ్రహనక్షత్రాలు మరియు మన చుట్టుపక్కల వాతావరణం వల్ల జీవులపై పడే ప్రభావాన్ని నిర్మోహమాటంగా చర్చించే పరిస్థితి వచ్చింది. వైజ్ఞానిక పరిశోధనల వల్ల తెలిసిన జ్ఞానాన్ని అందరికీ సరళమైన భాషలో అందివ్వగలిగితే ఖగోళశాస్త్రానికీ, జ్యోతిషశాస్త్రానికీ మధ్య కనపడే తేడాను తుడిచేయవచ్చు. దీని వల్ల అనవసరమైన భయాలు ఎలాగూపోతాయి. దాంతోపాటు కుంటుపడుతున్న పురాతన జ్యోతిర్విద్యకు కూడా ఆధారం లనిస్తుంది.

*– అఖండజ్యోతి, సెప్టెంబరు 1985*
*అనువాదం: శ్రీమతి జయలక్ష్మి*

## భగవంతుడు మహాపురుషుల రూపంలో జన్మిస్తాడు

*జలంధర్‌లో తులసీదాసు జయంతి జరుపుతున్నారు. అనేకమంది పెద్దలు పాల్గొని మహాకవికి శ్రద్ధాంజలి ఘటిస్తూ ఉన్నారు. పంజాబు రాజ్యపాల్ శ్రీ గాడ్గిల్ మాట్లాడుతూ ఒక రహస్యాన్ని ప్రకటించారు. ఏంటో తెలుసా? భగవంతుడు ఇక అవతారాలు ఎత్తనని నిర్ణయిం చుకున్నాడట. ఎన్ని అవతారాలెత్తినా ప్రజలలో మార్పు రాలేదట. అందుకని ఇక మహాకవుల రూపంలో గొప్ప గొప్ప సాహిత్యకారులరూపంలో జన్మిస్తాడట. ఆయన చమత్కారసంభాషణకు అందరు మనసారా నవ్వుకున్నారు.*

– ప్రజ్ఞాపురాణం నుండి
*అనువాదం : శ్రీమతి నేమాని గౌరీ సావిత్రి*

**స్వార్థం, దురాశ, సంకుచితం, వ్యామోహం నిన్ను కురూపిగా మార్చుతాయి - వీనిని సత్వరం విడిచిపెట్టు**

# సురదుర్లభ మానవజన్మను సద్వినియోగం చేసికొందాం

ప్రాతఃకాల సూర్యోదయంతో ప్రపంచానికి ఒక నూతన ఉదయం ప్రారంభమౌతుంది. అట్లే సూర్యాస్తమయంతో ఆ రోజు పరిసమాప్తమవుతుంది. ఈ విధంగా ఆయుష్షులో ఒక రోజు తరిగిపోతూ ఉంటుంది. జన్మ తీసికొన్న క్షణం నుండి, మానవుని ఆయువు దినదినం తరిగిపోతూ ఉంటుంది. మనుష్యులు అనేక పనులలో, వృత్తివ్యాపారాలలో మునిగి పోయి, తరిగిపోతున్నా తమ ఆయుష్షును గమనించకున్నారు. మనుష్యజన్మ తీసికొన్నవారు, వృద్ధావస్థతో మరియు విపత్తులతో, రోగాలతో, మృత్యు కారణంగా, వారిలో ఆలోచనల రేకెత్తించెడి దృశ్యాల చూస్తూ కూడా లేశమాత్రమైనా చింతించక మదాంధతతో కూడిన పనులు చేస్తూ, అవివేకంగా జీవిస్తూ ఈ భూమిపైన పుట్టిగ్రుడ్డివారిగా ప్రవర్తించుట ఆశ్చర్యజనకం మరియు బాధాకరం. మోహంతో కూడిన సంసారజీవనంలో మునిగి పోయిన మనుష్యులు క్షణమాత్రమైన ఏకాంతంగా కూర్చొని, అంతర్ముఖులై, సర్వులూ ఇష్టపడెడి అతిసుందరతతో కూడిన మానవజన్మను పొందుటలో గల కారణాన్ని, మానవ జన్మ లక్ష్యాన్ని మనమెవ్వరమని, మనమెచ్చట నుండి వచ్చాం, తిరిగి ఎచ్చటికి వెళ్ళతాం? అని ప్రశ్నించుకొనరు.

ప్రకృతి, ప్రహస్థితులకు లోనైన మూర్ఖపరంపరకు చెందిన మానవులు సంసారసుఖాలనో, ఇంద్రియభోగాలనో, వస్తు సంపాదనో, ధన, పుత్ర మున్నగు వివిధ కోరికలను తమ జీవిత లక్ష్యాలుగానెంచుకొని, అత్యంత విలువైన వానిని పోగొట్టు కొనుచున్నారు. అంత్యకాలమందు అంతిమక్షణం సమీపించగనే, ఈలోకం నుండి తనువువీడి శాశ్వత వీడ్కోలు తీసికొనెడివేళ, శిరస్సుపై పాపభారాన్ని మోస్తూ, ఘోర పశ్చాత్తాపాన్ని, దుః ఖాన్ని ఆంతరిక అశాంతితో అనుభవించెడి లక్షణాలను మరువ జాలము. శతాధిక వసంతాలు పూర్తిచేసికొని, అమూల్యమైన వైభవాలు, ధనసంపత్తులు, సంతానము మనవెంట ఏమి రావు. ఇవ్వరు. ఈ యావత్ సంసారం ఇచ్చటి స్థితిగతులు, కంటికి కనిపించేవన్నీ అంత్య సమయమందు మనకు అక్కరకురావు. పై పెచ్చు, మనం ఉపయోగించుకొనలేని స్థితి అది. చివరకు మన శరీరం కూడా మనలవెన్నంటిరాదు! కేవలం మనం చేసిన మంచి–చెడు కర్మల వెంటనిడుకొని జీవుడు ఈ లోకం నుండి నిష్క్రమించవలసిందే. ఆ జీవి ఎంతటి అనుభవ శాలియైనా ఆ క్షణంలో అదంతా అక్కరకు రాదు.

మనిషి జీవితంలో మరచిపోవలసింది ఏదైతే ఉందో అదంతా అతని యొక్క చెడు సాంగత్యం ద్వారా ఒనగూడినది. జ్ఞానాన్ని పొందుట ద్వారా మనలోపల నుండి ఒక ప్రశ్న ఉదయిస్తుంది! నేనెవ్వరిని? నేను ఏమిటి? నేను ఏమి చెయ్యకూడదు? వీటన్నిటికి సంబంధించిన జ్ఞానం మనలోనే దాగి ఉన్నది! కాని మన జీవనవిధానానికి సంబంధించి సరియైన దృష్టికోణాన్ని మనం ఏర్పాటు చేసికోనందున, ఆ జ్ఞానమంతా చిందరవందరగా మారి వ్యర్థంగా పడి ఉన్నది! మనిషి జీవిత మొదటి పురుషార్థం యొక్క జీవితలక్ష్యం ప్రమాదంలో పడనీయరాదు! ఇది సాధించగల్గిననాడు పనులు సవ్యదిశలో సాగుతూ అర్థవంతంగా ఉంటాయి. కర్తవ్యాలను మనిషి తనంత తానుగా మరచిపోతాడు! అప్పుడు అతను ఏదైనా చెయ్య దలచినచో వాని ఆవశ్యకత జ్ఞప్తిలో ఉండక, ఆ పనివలన తనకు లభించే లాభాన్ని బేరీజు వేస్తాడు!

వ్యవహారిక జీవితంలో ఎవ్వరు క్రిందికి జారాలని కోరుకోరు. అందరు ఎత్తుకు మరింత ఎత్తుకు ఎదగాలని ఆకాంక్షిస్తూ ఉంటారు. తమనుతాము ప్రత్యేకం అని భావించేవారు తాము ఎత్తుకు ఎదుగుటకు కావలసిన దానిని సిద్ధం చేసుకుంటారు. దీనికై వారు వారి వారి పద్ధతిలో కావలసిన శక్తిని మరియు అనుకూలతను ప్రోదిచేసికొంటారు. తగిన సమయంలో వాని సఫలతకై తమ కోర్కెను కూడా వ్యక్తపరుస్తుంటారు. జీవితంలో ఎదగాలనుకొనుట మనిషి స్వాభావికం. కాని ఎవరైనా దీనిని గురించి అడిగితే అతడు / ఆమె సమాధానానికై లోతుగా పరిశీలిస్తారు. తదుపరి తమ లక్ష్యసాధనకై ఎటువంటి ప్రణాళిక వేసికొన్నది తెలిసికొనుటకై ప్రయత్నిస్తే వారంతా దీనిపై లోతుగా విచారించినట్లు కనిపించదు.

శారీరకంగా మనష్యులెంత బలంగా ఉన్నా బుద్ధిపరంగా, వారు ఎంతో వెనుకపడి ఉంటారు. అట్లే ధన సంపత్తిపరంగా దృఢంగా ఉన్నా, ఆత్మసంపదలేమితో, మణివిహీన సర్పంలా

**ఉన్నదానితో తృప్తిజెందుచూ, లేనిదానిని పొందుటకు ప్రయత్నించు**

అర్ధ వికసితంగా జీవిస్తుంటారు. ఒక్క ఆత్మబలం యొక్క ఉపలబ్ధితో, కోట్లకొలది ప్రపంచ భౌతిక సంపదలకు మించిన బలాన్ని కలిగి ఉంటాడు. ఆత్మిక సంపదల కలిగినవారే, నాయకత్వం వహించెదరు, లోకానికి మార్గదర్శనమందించెదరు. నిర్ధనులైన ఫకీరుల పాదాల వద్ద, పెద్దపెద్ద భవనాల యజమానులు, మోకరిల్లి, వారి దయాదాక్షిణ్యాలనర్థిస్తూ ఉంటారు. దీని అర్థం, మనుష్యుని గొప్పతనం బాహ్య ప్రపంచంలో లేదు, కేవలం అతని అంతరంగంలోనే ఉన్నదని స్పష్టమగుచున్నది. మనిషి శక్తి అతని గుణాల వికసితపై ఆధారపడి ఉంటుంది. అట్లే మనిషి అంతరంగ శ్రేష్ఠత అతనికి గల శ్రేష్ఠతను నిర్ణయిస్తుంది. భౌతికసంపదలు క్షణికమైనవి మరియు అశాశ్వితాలు, కొద్ది సమయంలోనే తల్లక్రిందులైపోతాయి, నష్టమౌతాయి.

అలభ్యమైన మనుష్యజన్మ (మనుష్య శరీరం) లక్ష్యం తెలియనిచో, మనిషిజన్మకు, పశుజన్మకు మధ్య అంతరమేమున్నది? సురదుర్లభమైన ఈ మనుష్యజన్మంలో ఆత్మకళ్యాణ సాధన చేపట్టలేనిచో ఈ జన్మవ్యర్థమైనట్లే.

శ్రీమత్ భాగవతం 11-6-7లో ఇట్లు చెప్పుచున్నది. "మోక్షానికై మనుష్యుడు శరీరాన్ని పొంది కూడా పక్షిలా అజ్ఞానంలో కొట్టుమిట్టాడుచున్నాడు.

వెలుపలికి వచ్చి చూడండి. ఈ విశ్వం ఎంత విశాలమైనదో, ఎంత విస్తృతమైనదో అవలోకించండి! రాత్రివేళ వినీల ఆకాశం క్రింద నిలబడి తనివితీరా నలుదిక్కులూ పరికించి చూడండి. ఎన్నెన్ని నక్షత్రాలు, గ్రహాలు దర్శనమిస్తాయో చూడండి! ఎంత విస్తృతంగా ఈ విశ్వాన్ని గురించి ప్రచారం చేసినా వీటన్నింటి గురించి ఆలోచించే సమయమందు సుఖభోగాల నుండి దృష్టి మొత్తం మరలినప్పుడు, ఈ చేతనత్వ ప్రధానవిషయాలపై దృష్టి ప్రసరిస్తుంది. ఆత్మవికాసమార్గంమందు స్వార్థంతో కూడిన ఆటంకాలు అడ్డుగా నిలుస్తాయి! ఈర్ష్య, ద్వేషం, కామ, క్రోధ, భయ, లోభాలు క్రమ్మివేస్తాయి. దీనివలన మనం, జీవన ఉన్నత లక్ష్యంవైపు మన దృష్టిని నిలువలేకున్నాము.

మనం ప్రేమాస్పదులమై సాహసంతో ఆధ్యాత్మిక జీవనంలో గల ఆటంకాలను, కష్టనష్టాలనెదిరించి నిలబడాలి! మనం తదుపరి ఏ గొప్ప లక్ష్యసాధన కొరకై ఉన్నామో, అది మన అంతరంగంలో అనునిత్యం శోభిస్తూ ఉంది. అదే నిజం మరియు సత్యం. సాధనతో దీనిని జాగృతం గావించాలి! ఇదే మనకు గల ఏకైకమార్గం.

*- హిందీ మూలం: యుగనిర్మాణ యోజన, అక్టోబరు 2013*
*అనువాదం: ఎ. వేణుగోపాలరెడ్డి*

---

## తండ్రి చింతను బాపిన "తిలకమంజరి"

*ఒక రాజదర్బారులో ఒక పండితుడు నౌకరీ చేయుచున్నాడు. కొన్ని సంవత్సరాలు కృషిచేసి బాణుడు రచించిన 'కాదంబరి' గ్రంథాన్ని ప్రాకృతభాషలోనికి అనువదించాడు. అనువదించబడిన ఆ గ్రంథాన్ని చూచిన రాజు, తన పేరును గ్రంథంలో చేర్చమనగా, పండితుడు వినమ్రంగా రాజు కోర్కెను తిరస్కరించాడు. తనను ఆశ్రయించి పనిచేసెడి పండితుడు తన కోర్కెను మన్నించకపోయేసరికి కోపోద్రిక్తుడై ఆ అనువాద గ్రంథాన్ని అగ్నికి ఆహుతి చేయమని ఆదేశించాడు. సంవత్సరాల తరబడి శ్రమించి అనువదించిన గ్రంథం తన 'కళ్ళ ఎదుట కాలిపోవుట చూచి ఖిన్నుడై ఉద్విగ్నతకు లోనైనాడు! అన్నపానీయాలు తీసికొనుట మానివేశాడు - విచారంలో మునిగిపోయాడు. ఒకనాడు అతని కుమార్తె తండ్రి విచారానికి కారణము అడిగి తండ్రి నుండి దాని పూర్తి కథను తెలిసికొంది.*

*"తండ్రిగారూ! మీరు చింతించకండి! మీ గ్రంథానువాదాన్ని నేను సంపూర్ణంగా చదివాను. దాన్ని కంఠస్థం కూడా చేశాను. నేను దానిని మీకు అప్పచెప్పుతాను. మీరు తిరిగి దానిని వింటూ వ్రాయండి" అన్నది కుమార్తె! కుమార్తె అండతో తిరిగి గ్రంథాన్ని వ్రాశాడు పండితుడు. దీనితో సంతుష్టుడై ఆ గ్రంథానికి తన కుమార్తె పేరు మీద "తిలకమంజరి" అని నామకరణం చేశాడు.*

*- హిందీమూలం: అఖండజ్యోతి, మార్చి 2016*
*తెనుగు సేత : ఎ. వేణుగోపాలరెడ్డి*

---

**ప్రసన్నంగా ఉన్న నీ మోము ఎదుటివారితో ఆత్మీయతను పెంచుతుంది**

# అవసరానికి మించి ఏదీ కోరవద్దు

ఎందుకోగానీ నిజాయితీ, నీతి నియమాలు పాటిస్తే నష్టమే కలుగుతుందన్న భ్రమలో పడ్డారు మనుషులు. అవినీతి, మోసం, కుట్రలతో తొందరగా డబ్బు కూడబెట్టుకున్నట్టుగా కనిపిస్తుంది. వాళ్ళని చూసి మిగిలిన వారికి కూడా త్వరగా వైభవం చేజిక్కించుకోవాలి అనిపిస్తుంది. అలాంటి గొప్ప వాళ్ళ పెత్తనం, డాబు మాత్రమే బైటికి కనిపిస్తాయి. కాని అవినీతితో సాధించిన వైభవం పేకమేడల్లాంటివే అని తెలుసుకోవాలి. తమ అవసరాలు తీర్చుకోవాలనే స్వార్థంతో ఏ కొద్ది మందో వారి ముఖస్తుతి చేస్తారే కాని వారి హృదయంలో ఆదర భావాలేమీ ఉండవు.

అదే నిజాయితీగా, కష్టపడి పని చేసి, నైతిక విలువలతో నిష్టగా జీవించే వాళ్ళు మెల్లిగా సమృద్ధిని పొందినా, ప్రగతి సాధించినా వారి కీర్తి దేశకాలాల అంతరాలు దాటి విశ్వ వ్యాప్తంగా అమరులవుతారు. ప్రసిద్ధ సాహిత్యకారుడు జార్జి బెర్నాడ్ షా గురించి మొదట్లో ఎవరికి మాత్రం తెలియదు. ఆయన ఒక ప్రాపర్టీ డీలర్ దగ్గర క్లర్కుగా జీవితం మొదలు పెట్టారు. ఆయన పనల్లా అద్దెలు, బీమాలు, టాక్సులు వసూలు చేసి లెక్కలు రాయాలి. చాలా పెద్ద మొత్తాల్లో లావాదేవీలు చేయడంతో పాటు ఎందరో ప్రముఖులను కలవాల్సి వచ్చేది. స్వతహాగా వినమ్ర స్వభావం కల బెర్నాడ్ షా ఎవ్వరినీ ఒత్తిడి చేసేవారు కాదు, కటువుగా మాట్లాడేవారు కాదు, జనాలు ఆయన్ని పట్టించుకునేవారే కాదు. కాబట్టి చాలా పనులు ఆయన పూర్తి చేయలేకపోయేవారు. వారి యజమాని పెద్దగా ఫిర్యాదు చేయకపోయినా, షా గారికి తమ పని తమకే తృప్తినిచ్చేది కాదు.

ఒకరోజు తన యజమానికి రాజీనామా పత్రం అందించారు, "అయ్యా! ఈ నెల తరువాత నుండి నేను పనిలోకి రాలేను. మీరిచ్చే జీతానికి తగ్గ పని నేను చేయలేకపోవడమే అందుకు కారణం. ముందుగా సూచించడానికే ఈ పత్రాన్ని అందిస్తున్నాను."

నిజానికి యజమానికి ఆయన పని తీరంటే సంతోషమే. వారి స్వభావం కూడా యజమానికి నచ్చేది. ఎందుకంటే ఎవ్వరూ ఆయన మీద అప్పటి వరకు ఫిర్యాదు చేయలేదు. ఎంత ఒప్పించడానికి చూసినా బెర్నాడ్ షా మాట వినలేదు. తీసుకునే జీతానికి సరిపడా పని చేయకపోవడం సరి కాదు అని గట్టిగా నమ్మారు.

అమెరికాకు చెందిన ప్రసిద్ధ లేఖకుడు హెన్రీ మిల్లర్ కూడా ఒక ఉదాహరణ చెప్పారు. సాహిత్య క్షేత్రంలో కొత్తగా అడుగు పెట్టిన రోజులవి. 1919లో భారతదేశానికి చెందిన విశ్వ విఖ్యాత ఇంజినీరు శ్రీ విశ్వేశ్వరయ్యగారు అమెరికా వెళ్ళారు. వారి పత్రిక కోసం మిల్లర్‌ను ఒక లేఖ రాయమని అడిగారు. పది డాలర్ల పారితోషికం నిర్ణయించబడింది. మర్నాటి కల్లా లేఖ సిద్ధం చేస్తానన్నాడు మిల్లర్. అది పూర్తయ్యాక విశ్వేశ్వరయ్య గారు దాన్ని చదివి సంతోషించారు. చాలా బాగా రాసినందుకు గాను అదనంగా రెండు డాలర్లు మిల్లర్‌కు ఇచ్చారు. నేను ఊహించినదానికన్నా బాగా రాసినందుకే ఆ అదనపు పారితోషికం అన్నారు. కాని మిల్లర్, "అయ్యా! నేను అత్యుత్తమ లేఖకు తగిన పారితోషికాన్నే ముందు కోరాను. నా శ్రమకు తగినదాని కన్నా ఎక్కువ తీసుకోవడం అనైతికం." అంటూ రెండు డాలర్లను తిరిగిచ్చేసారు.

కష్టానికి తగ్గ ఫలితాన్ని మాత్రమే తీసుకుని, అందులోనే తృప్తిపడడం మనిషిని నీతివంతునిగా, శ్రమశీలిగానూ చేస్తుంది. అవతలివారి లోపాలను, పరిస్థితులను అవకాశాలుగా మార్చు కోవాలనే ఆలోచనలు ఉండవు. ఇటువంటి నియమాలను నిష్ఠగా పాటించడం వల్ల వ్యక్తిలో ధైర్యం పదునవుతుంది.

19 ఏళ్ళ వయసులోనే ప్రఖ్యాత రచయిత ఏకిల్ హోఫర్ తండ్రిని కోల్పోయాడు. తండ్రి చేతిలో అల్లారుముద్దుగా పెరిగినందు వల్ల జీవనోపార్జనకు సంబంధించిన అనుభవమేదీ లేకుండా పోయింది. కాని కష్టపడి సంపాదించింది మాత్రమే అనుభవించాలన్న విషయాన్ని హోఫర్ తండ్రి నూరిపోసారు. కాబట్టి ఎక్కడో అక్కడ కూలి పనైనా చేద్దామన్నా ఎలాంటి అనుభవమూ లేదు.

తండ్రి పోయాక అనాధుడై, నిలువ నీడ లేక ఆకలితో రోడ్డున పడ్డాడు. ఒక హోటల్ ముందు నిలబడి యజమానిని పని అడుగుదామని ఆగాడు. ఊపిరాడనంత పనిలో ఉన్నా

**నిర్మలమైన మనస్సు తన చుట్టూరా సుగంధ భరితాన్ని వ్యాపింపచేస్తుంది**

ఆ యజమాని దృష్టి హాఫర్ మీద పడింది. చాలా సేపు తదేకంగా చూస్తున్నాడు కాబట్టి అతను బిచ్చగాడైనా అయ్యుండాలి, బాగా ఆకలిగానైనా ఉండాలి అని అతన్ని పిలిచి, 'ఆకలేస్తోందా బాబూ!' అని అడిగాడు.

'ఆకలైతే వేస్తోంది' అని నిస్సంకోచంగా బదులిచ్చాడు. హోటల్ యజమాని ఏమీ అడక్కుండా ఒక ప్లేటులో భోజనం పెట్టి తినమని అందించాడు. కాని ఆ కుర్రాడు, 'నేను దీన్నిలా తినలేను' అన్నాడు. మరెలా తింటావు అని యజమాని అడిగాడు. 'నాకు ఆకలిగా ఉంది. కాని నేను ఊరికే ఇది తినలేను. ఏదైనా పని చేసే తింటాను' అని జవాబిచ్చిన హాఫర్‌ను చూసి యజమాని చాలా ప్రభావితుడయ్యాడు. శ్రమ పట్ల అతనికున్న నిష్ఠ, స్వాభిమానాన్ని గమనించిన యజమాని అంట్లు తోమే పని అప్పగించాడు. ఈ విధమైన పరిశ్రమ ఆధారంగానే హాఫర్ మెల్లి మెల్లిగా ముందుకు సాగుతూ ఒక లేఖకుని స్థాయికి చేరారు.

ఆ రోజుల్లో అతని శ్రమ, శ్రద్ధను చూసి యజమానికి అతను ఇద్దరు చేసే పని చేస్తున్నాడా అనిపించేది. సంతోషించి అతని జీతం పెంచాలనుకున్నాడు. మిగిలిన వారందరికీ పెంచి తేనే తాను ఎక్కువ జీతం తీసుకుంటానన్నాడు హాఫర్. 'నేను నా శ్రమకు తగ్గ పని చేస్తాను. పని ఎగ్గొట్టేవాడ్ని కాను' అన్నాడు.

ఆ జవాబుకి ఆశ్చర్యపోయిన యజమాని, 'నీ లాంటి కుర్రవాడ్ని ఎన్నడూ చూడలేదు. నా కొడుకు కన్నా ఎక్కువ బాధ్యతగా దుకాణాన్ని చూసుకుంటున్నావు. నువ్వేమైనా చదువుకున్నావా?' అని అడిగాడు. అతని విద్యార్హతలు విని పదోన్నతిని కలిగిస్తూ మరింత బాధ్యతను అప్పచెప్పాడు.

శ్రమకి తగ్గ విలువ కన్నా ఎక్కువ ఆశించకపోవడం కూడా నిజాయితీ మరియు శ్రద్ధలో భాగమే. ఇటువంటి నిష్ఠను వికసింపజేసుకుంటే మనిషి ప్రగతి సోపానాలు అధిరోహిస్తూంటాడు. అవినీతి, పని ఎగ్గొట్టడం, పక్కవారి బలహీనతను ఉపయోగించుకోవడం లాంటి వాటి గురించి ఆలోచించే వాళ్ళు మహా అయితే ఆర్థికంగా సంపన్నులవుతారే కాని అంతకు మించిన ప్రగతి సాధించలేరు.

*– అఖండజ్యోతి, ఏప్రిల్ 1981*

*అనువాదం: శ్రీ ఎం.వి.ప్రసాద్*

## స్థిత ప్రజ్ఞత్వము

*ఒక పత్తి వ్యాపారి ఉన్నాడు, వ్యాపారి అయి ఉండి కూడా ఒక మునిలా స్థిత ప్రజ్ఞత్వస్థితిలో ఉంటూ ఉండేవాడు! అతనికి చెందిన పత్తి అనేక గోదాములలో నిల్వ ఉంచాడు. ఒకరోజు అతని గుమస్తా అమిత ఆతృత జెందుచూ వ్యాపారిగదిలో ప్రవేశించి "సేఠ్‌జీ! చాలా దుర్వార్త టెలిగ్రాం వచ్చింది! మన గోదాములకు నిప్పంటుకున్నది! లక్షల రూపాయిలలో నష్టము వచ్చింది! ఇప్పుడు ఏమి చేయాలి? అన్నాడు! "ఎటువంటి తొట్రుపాటుకు లోనుకాకుండా సేఠ్‌జీ ఇలా జవాబిచ్చాడు – "భగవంతుని ఇచ్ఛ ఎలా ఉంటే అలా జరుగుతుంది" అంటూ తానుచేస్తున్న పనిలో తిరిగి లీనమైపోయాడు. సేఠ్‌జీ ప్రవర్తించిన తీరును చూచి గుమాస్తా మిగుల ఆశ్చర్యానికి లోనైనాడు.*

*ఒక గంట తదుపరి గుమాస్తా తిరిగి సేఠ్‌జీ గదిలోనికి పరుగెత్తుకుంటూ వచ్చి ఇలా అన్నాడు – "సేఠ్‌జీ! ఇప్పుడు సంతోషకరమైన వార్త ఇది! మన గోదాములన్నీ సురక్షితంగా ఉన్నాయి! మొదట వచ్చిన టెలిగ్రాము పొరపాటుగా మనకు వచ్చింది. అది మరొకరికి చెందినది!" దీనిని విన్న సేఠ్‌జీ తిరిగి మొదట ఇచ్చిన జవాబునే ఇస్తూ భగవంతుని ఇచ్ఛ ఎలా ఉంటే అలా జరిగి తీరుతుంది" అన్నాడు. ఇప్పుడు గుమస్తాకు సేఠ్‌జీ మాటల వెనుకనున్న అంతరార్థము తెలిసి వచ్చింది – "సర్వము ఈశ్వరుని ఇష్ట ప్రకారము జరుగుతుంది అనెడి భావంతో ఉంటూ, ఆయనపై భారము వేసి ఉండాలి. ఇట్టి మానసికస్థితిలో ఉన్నచో అన్ని పరిస్థితుల్లో సురక్షితంగా ఉండెదము. ఏలనన రక్షించేవాడు భగవంతుడైనచో, ఆయనకు ఎవరు కష్టము కలిగించగలరు?*

*– హిందీమూలం: అఖండజ్యోతి, జూన్ 2016*

*అనువాదం : ఎ. వేణుగోపాలరెడ్డి*

**సందర్భానుసారమైన నవ్వు అర్థానికి నిలయం - అసందర్భానుసారమైన నవ్వు అనర్థాలకు నెలవు**

# నీటి అలభ్యత నివారణకై సామూహిక సాధనా ప్రయోగం ఆరంభించండి

వేదాలు ప్రవచించినది వినండి. జలము జీవనాధారము బొట్టు బొట్టు బహువిలువైనది. అమృతంలా ప్రోది చేయండి. నేడు యావత్ దేశము కరవు కోరల్లో చిక్కుకున్నది. పది రాష్ట్రాల్లో రమారమి 258 జిల్లాల్లో కరువు ప్రభావానికి లోనై ఉన్నాయి. గత మూడు నాలుగు సంవత్సరాల నుండి హర్షా ధాధా మరియు బుందేల్‌ఖండ్ మున్నగు క్షేత్రాలలోని ప్రజలు తీవ్ర అనావృష్టి బారినపడి బొట్టు-బొట్టు నీటికి సైతం అల్లాడి పోవుచున్నారు.

పై అనావృష్టి బారినపడిన ప్రాంతాల ప్రజల సమస్యను పరిష్కరించుటకై ప్రభుత్వాలు మరియు ఇతర స్వయంసేవక సంస్థలు తమ తమ పద్ధతుల్లో ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇట్టి పరిస్థితులు ఉత్పన్నమైనప్పుడు గతంలో గాయత్రీ పరివార్ దీనిని నివారణకై సామూహిక సాధనను ప్రయోగించి, అనేక మార్లు ఆశించిన ఫలితాలను సాధించింది. నేడు కూడా మనము ఇదే ప్రయోగాన్ని ఆరంభించి సాధనను చేపట్టవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఈ సాధనను మనం స్వయంగా చేస్తూ అనేకానేక మంది చేత ఈ సాధనను చేయించాలి. ఏలనన ఈ ప్రయోగం సామూహిక శక్తితోనే అధిక ప్రభావాన్ని చూపి చక్కని ఫలితాలు అందించగలదు.

వేద వచనము "ఇంద్ర ఇచ్ఛరత్ రఖా" అనగా ఇంద్రుడు పురుషార్థము నెరవేర్చెడివారికే సహాయపడతాడు. భావ సంవేదన లతో నిండిన సామూహిక ప్రార్థన కూడా ఒక పురుషార్థమే. ప్రార్థనతో ఆకాశమును కదిలించవచ్చు. సామూహిక ప్రార్థనతో సామూహిక శక్తి తయారవుతుంది. సామూహిక లౌకిక పురుషార్థం కూడా సహజంగా రూపుదాల్చుతుంది.

సామూహిక సద్భావనలు పురుషార్థం పొంగిపొరలి తద్వారా ప్రకృతి ఇట్టి జాగృతమైన సామూహిక శక్తి ద్వారా మన క్షేత్రాల్లో వర్షజలాన్ని సంరక్షించుట, పచ్చదనాన్ని పెంపొందించుట మున్నగు పనుల చేపట్టాలి!

**జల సంరక్షణకై:**

- నిత్య జీవితంలో నీటి వాడకాన్ని క్రమబద్ధీకరించుకోవాలి.
- ఉపయోగించిన నీటిని శుద్ధిచేసి తిరిగి వాడకంలోనికి తేవాలి.
- వర్షపు నీటిని బావులలో, చెరువులలో నిల్వ చేస్తూ నేల ఎక్కువ శాతం ఇంకేలా ప్రయత్నించాలి
- ఎక్కువ శాతం నీటిని తనలో ఇంకేలా నేలను తయారు చేసెడి భాగంగా వృక్షాలను పెంచుతూ, తదితర పనులను చేపట్టాలి
- నీటి సంరక్షణపై ప్రజలను జాగృతం చెయ్యాలి

**సాధాన క్రమము:**

నీటి సంకట నివారణకై వరుణదేవుని ప్రార్థించుటతోపాటు ఈ క్రింది సాధనా క్రమాన్ని అనుసరించండి

- ప్రతిరోజు ఉదయం ఉపాసన చేసెడివేళ గాయత్రీ మంత్రం లేక మీ ఇష్టమంత్రాన్ని నామాన్ని కూడా తప్పక జపించండి
- శక్తిపీఠాలు, క్షేత్ర కార్యక్రమాలు మున్నగువానిలో ఎచ్చటైతే యజ్ఞ కార్యక్రమాలు జరుగుచున్నాయో, అచ్చట వరుణ గాయత్రీ మంత్రాన్ని జపిస్తూ ఆహుతులు సమర్పిస్తూ ఉండాలి.

**వరుణ గాయత్రీ మంత్రం:**

***"ఓం జలబింబాయ విద్మహే నీల పురుషాయధీమహి***
***తన్నో వరుణా ప్రచోదయాత్ స్వాహా"***
***ఇదం వరుణాయ ఇదం న మమ॥***

- ఈ ప్రార్థన అన్నింటిలో దేశమంతటా పునరుచ్చరించాలి. హే పరమాత్మా! దేశంలోనున్న నీటి సమస్యను త్వరితగతిన రూపుమాపు! దీనికై మాపై కృప చూపుడు దేశవాసుల మనోబలాన్ని పురుషార్థాన్ని మేల్కొల్పండి.
- తదుపరి 15 నిమిషాలపాటు అందరూ తమ తమ ఇష్ట మంత్రాన్ని లేక ఇష్టదేవత నామాన్ని జపించండి. చిట్టచివరన 'ఓం' కారాన్ని ఉచ్చరిస్తూ (సామూహికంగా) జపాన్ని సమాప్తం గావించాలి.
- ప్రతి ఆదివారం సాయంత్రము సామూహిక జప కార్యక్రమాన్ని చేపట్టండి. దేశమంతటా ఒకే సమయంలో సాయంత్రం 6-15 నుండి 6.45 వరకు చేపట్టాలి. పూర్తి కార్యక్రమాన్ని ఈ క్రింది విధంగా చెయ్యండి.
- సాధకులందరికీ పవిత్రీకరణ చేయించండి (జలాన్ని చల్లండి)
- దీపాన్ని లేక అగరుబత్తిని వెలిగించి ఉంచండి.
- "నమోస్తునంతాయ సహస్ర మూర్తయే ........." అనెడి మంత్రముతో పరమాత్మునికి నమస్కరించండి.
- సమయం పూర్తికాగానే చివరన దీపయజ్ఞం మాదిరిగా వరుణ గాయత్రీ మంత్రం 11 సార్లు ఉచ్చరిస్తూ ఆహుతులు సమర్పించండి.
- శాంతిపాఠము మరియు జయఘోషతో ముగించండి.
- ఉదయాన సూర్యోదయవేళ కనీసం 24 సార్లు గాయత్రీ మహామంత్ర జపాన్ని చేసి సూర్యార్ఘ్యమిచ్చే వేళ నీటి సంకటాన్ని నివారించమనెడి ప్రార్థనను కూడా జోడించి ప్రార్థించండి. విభిన్న క్షేత్రాల్లో ఒకే సమయంలో ఒకే లక్ష్యసాధనకై చేపట్టిన ప్రక్రియ సామూహిక సాధనా ఫలితాన్ని అందిస్తుంది.

*- హిందీమూలం: శాంతికుంజ్, హరిద్వార్*


## కోపానికి విరుగుడు నవ్వు

# ఆధ్యాత్మికతకు సంబంధించిన మూడు అంశములు

*అత్యంతనిగూఢమైన విషయములను తేలికగా విశ్లేషించి విశదపర్చి చెప్పగలగటం పరమపూజ్య గురుదేవుల ప్రవచనముల లోని ప్రత్యేకత. విదేశాలలో ఇవ్వబడిన ఈ ప్రత్యేక ప్రవచనంలో ఆధ్యాత్మికత యొక్క సరళమైన రూపాన్ని సామాన్య వ్యక్తికి సైతం అందుబాటులోకి తీసుకువస్తూ, దాని మూలరూపాన్ని కూడా అతని ముందుంచుతున్నారు. మిఠాయిలు తయారుచేసేందుకు పద్ధతులెన్నున్నా వాటిని తయారుచేసేందుకు ఉపయోగించే పదార్థములు మాత్రం మూడే! అలాగే ఆధ్యాత్మికమార్గమునకు దారులు ఎన్నో ఉండవచ్చు, కానీ దాని అసలు మార్గంలో మూడు సూత్రములు మాత్రమే ఇమిడి ఉంటాయి. వాటిని అమలు చేయగలిగిన నాడు నరుడు నారాయణుడు కాగలడు, అతనిలో దేవత్వం ఉదయించగలదు. "భగవంతుని పట్ల నమ్మకం" ఇది ఆధ్యాత్మికతలోని మొట్టమొదటి అంశం. ఐతే ఆధ్యాత్మికతకు సంబంధించిన కర్మకాండలలో ఎన్నో భేదములు ఉండవచ్చు. కషాయకల్మషముల నుండి విముక్తి పొందగలగటం రెండవ సూత్రం. మానవీయ వ్యక్తిత్వంలో ఔదార్యాన్ని కలిగియుండటం మూడవ సూత్రంగా వారు ప్రబోధిస్తున్నారు. రండి! వారి అమృతవాణిని మరింతగా హృదయంగమం చేసుకుందాం.*

## మా జీవితం యొక్క అనుభవసారం

మా జీవితంలోని 62 సం॥ల సుదీర్ఘకాలంలో మేము ముఖ్యంగా రెండు పనులను నిర్వహించాము భారతీయ ధర్మగ్రంథములన్నిటి యొక్క స్వాధ్యాయము, అధ్యయనము, పరిశోధనమును పూర్తిగావించాము. వేదాల నుండి పురాణాల వరకూ అన్నింటినీ అధ్యయనం చేసి, పరిశీలించి, ప్రచురించడమే కాక; వాటిని అనువదించే కార్యాన్ని కూడా నిర్వహించాము. స్వాధ్యాయము చేయగా మిగిలిన సమయంలో మహర్షి అరవిందులు మొదలుకొని రమణుల వరకూ మహానుభావు లందరినీ కలిసి వారినుండి జ్ఞానబిందువులను సేకరించగలిగే సదవకాశం మాకు లభించింది. మీ జీవితంలోని 62 సంవత్సరాల కాలంలో మీరు నేర్చుకున్నవీ, విన్నవీ, తెలిసినవీ మొదలైన విషయము లన్నింటి యొక్క సారాంశమును మాకు తెలియచేయమని ప్రజలు మమ్మల్ని అడుగుతూ ఉంటారు. ప్రస్తుత ప్రవచనంలో దానినే మీకు అందించబోతున్నాము.



మానవ జీవితం ముఖ్యంగా భోజనం, గాలి, నీరు – అనే మూడు అంశాల మీద ఆధారపడి మనుగడ సాగిస్తుంది. అలాగే ఆధ్యాత్మికత కూడా మూడు అంశాల పైనే ఆధాపడి ఉంటుంది. అనేక గ్రంథాలలో అనేక విషయాలు అనేక విధాలుగా వ్రాయబడు తుంటాయి. కానీ అన్నింటి యొక్క ముఖ్య ఉద్దేశ్యం మూడు అంశములే! నాలుగవ అంశమనేదే లేదు.

ఒకసారి మేము స్వీట్‌షాపు దగ్గర నిలబడి చూస్తూ ఉన్నాము. అందులో జిలేబి, రసగుల్లా, పాలకోవా వంటి ఎన్నోరకాల మిఠాయిలు తయారు చేయబడి ఉన్నాయి. గమనించి చూస్తే వాటన్నింటి లోనూ మూడే మూడు పదార్థములు వాడబడి ఉంటాయి. ఒకటి చెరుకు (పంచదార లేదా బెల్లం రూపంలో) రెండు పాలు (నెయ్యి, మీగడ, పెరుగురూపంలో) మూడవది ధాన్యం (పిండి, రవ్వరూపంలో). ఈ మూడు పదార్థములను ఉపయో గించి వంటవాడు తన పాకనైపుణ్యాన్ని మేళమించి గారడీ చేసినట్లుగా పలురకాలైన తీపిపదార్థాలను తయారు చేస్తుంటాడు.

## ఆధ్యాత్మికతకు సంబంధించిన మూడు సూచనలు

ఒకరు శివపురాణం రచిస్తే, వేరొకరు భాగవతం, మరియొకరు మహాభారతం, ఇంకొకరు స్కందపురాణం, ఉపనిషద్‌లు రచించారు. స్వీట్‌షాపులో తయారుచెయ్యబడిన

**పువ్వు వికసించినట్లు నవ్వు వికసించాలి**

తినుబండారాలలో (పాలు, పంచదార, పిండి) మూడు పదార్థములు తప్ప, నాల్గవ పదార్థమేదీ ఉపయోగించబడని విధంగా పైన చెప్పబడిన గ్రంథాలలో కూడా కేవలం మూడు అంశముల పైనే దృష్టి సారించబడింది తప్ప నాల్గవ అంశమేదీ ప్రాముఖ్యతను పొందలేదు.

ఆధ్యాత్మికతలో ముఖ్యంగా మూడే సూత్రాలు ఉంటాయి. అందులో మొదటిది భగవంతుని పట్ల నమ్మకం. భగవంతుడిని పూజించటం... ఈ రెండింటి మధ్య భూమ్యాకాశాలకున్నంత తేడా ఉంటుంది. ఒక బంది పోటు ఉన్నాడు, వాడు దేవికి మేకను బలి ఇస్తాడు. వాడికి భగవంతుని పట్ల నమ్మకం ఉండక పోవచ్చు. కానీ పూజ చేస్తాడు. భగవంతుని పట్ల నమ్మకం అంటే ఎలా ఉండాలీ అన్నది మన ధర్మగ్రంథాలు, వేద శాస్త్రాలలో క్షుణ్ణంగా వివరించ బడింది. భగవంతుని పట్ల నమ్మకం అన్నది ఒకసారి మన జీవితంలో ఏర్పడితే, ఇక మన జీవితమే మారిపోతుంది. మన వ్యక్తిత్వానికి సంపూర్ణ చికిత్స జరుగుతుంది. దేవుని పట్ల నమ్మకం మనలో కలిగిననాడు ప్రతి మనిషి శరీరంలోనూ మనం భగవంతుడిని దర్శించగలం.

### మీలోన దాగి ఉన్న భగవంతుడిని గుర్తించండి

మీ అంతరాత్మ మీద కప్పబడిన కషాయకల్మషములనే మలినముల పొరను తొలగించి వెయ్యండి, మన జీవాత్మ లోపల బ్రహ్మతేజస్సు నిప్పుకణిక వలె ధగధగమని ప్రకాశిస్తూ ఉంటుంది. మనం స్వయంగా పరబ్రహ్మ స్వరూపమే అనిపించే టట్లుగా ఉంటుంది ఆ కాంతి. మానవుడు భగంతునికి ప్రతి రూపమే. భగవంతుడు తనయొక్క రూపాన్నే నమూనగా తీసు కొని మానవుని తయారుచేసి ఈ భూమి మీదకు పంపించాడు,

మానవునిలోపల భగవంతుడు, నివసిస్తూంటాడు. దేవతల రూపంలో, ఋషుల రూపంలో, భగవంతుడే ఈ మానవ దేహంలో ప్రకటీకృతమవుతుంటాడు. మహాత్ములైన అవతార పురుషుల రూపంలో, రామకృష్ణుల రూపంలో భగవంతుడే స్వయంగా ఈ మానవ శరీరంలో వ్యక్తమైనాడు. మానవదేహం ప్రతి ఒక్కరికీ ఒకే రీతిలో స్వచ్ఛంగా, నిర్మలంగా తయారు చెయ్యబడింది, కానీ దౌర్భాగ్యులైన మానవులు నిప్పుకణిక వంటి ఈ ఆత్మపైన కషాయ కల్మషములనే దురాలోచనలతో కూడిన మలినాలను కప్పివేశారు. ఫలితంగా నిప్పురవ్వలాంటి మనలోని జ్యోతి అణగారిపోయి ఉన్నది.

మానవుడు తనలోని దోష దుర్గుణములను, పాపములను, అనాచారములను దృష్టికోణంలోని ఆలోచనా విధానంలోని తప్పులను, చేసే పనిలోని పొరపాట్లను మొదలైన వాటన్నింటినీ సంస్కరించుకోవాలి, ఈవిధంగా మనిషి తనను తాను చక్కదిద్దుకోగలిగితే, తానే స్వయంగా భగవంతుడు కాగలడు. ఇది ఆధ్యాత్మికతకు చెందిన రెండవ అంశం.

### గొప్పలక్ష్యం కొరకు ఇవ్వబడినదీ మానవజన్మ

ఆధ్యాత్మికగ్రంథాలలో, ధర్మగ్రంథాలలో సూచించబడిన ఈ మూడవ అంశం ఏమిటంటే మానవుడు ఔదార్యాన్ని కలిగి ఉండాలి. స్వార్థపరుడు, సంకీర్ణమనస్తత్వం కలవాడుగా ఉండ కూడదు. పొట్ట నింపుకొనటానికి, సంతానోత్పత్తి చెయ్యటానికి ఈ మానవ జన్మ ఇవ్వబడలేదు. గొప్ప లక్ష్యంతోనే భగవంతుడు మానవుని సృజించాడు. మనిషితనను తాను తెలుసుకున్నప్పుడు అది ఆత్మబోధ అవుతుంది.

ఆత్మబోధ అంటే జ్ఞానం యొక్క సారం. నిన్ను గురించి, నీ జీవితం గురించి, నీ లక్ష్యం గురించి తెలుసుకోవాలి. అలా తెలుసుకొనగల్గిననాడు జీవితం ఉదాత్తమూ, ఋషితుల్యమూ అవుతుంది. సమస్తశాస్త్రము, ధర్మగ్రంథముల సారాంశముగా ఈ మూడు అంశములనే మేము తెలుసుకున్నాము.

### రామాయణం యొక్క సారాంశం

రామాయణంలోని ఒక శ్లోకం చదివితే మా కన్నులు బాష్పపూరితములౌతాయి. శరీరం రోమాంచమౌతుంది. రామాయణంలోని అన్ని శ్లోకాలను మరచిపోయినా ఈ ఒక్క శ్లోకాన్ని గుర్తించుకుంటే చాలు రామాయణమంతా పారాయణ చేసినట్లే –

**"సీయ రామమయ సబ జగజానీ"**
**కరుఉఁ ప్రణమ జోరి జుగపానీ ॥** – అని

తులసీదాసు రామాయణంలో గానం చేశాడు. భగవంతుని పట్ల విశ్వాసం కలిగిన వ్యక్తి యొక్క దృష్టికోణమూ, ఆలోచనా విధానమూ ఎలా ఉంటాయో చూడండి. ఈ ప్రపంచమంతా సీతారామమయంగా చూడగలిగిన వ్యక్తి ఎక్కడ స్త్రీ పురుషుల జంట కనిపించినా వారిలో సీతారాములనే దర్శించి నమస్కరి స్తాడు అని భావం. అటువంటి దివ్యదృష్టి ఉన్న మానవుని శక్తికి హద్దులు ఉంటాయా? ఈ సందర్భంగా ఛత్రపతి

**రాజు ప్రజలనందరిని ధర్మముతో రక్షించాలి - కరవాలముతో కాదు**

శివాజీగారి దృష్టికోణాన్ని గురించి తెలుసుకుందాం. ఒకసారి శివాజీగారి సైనికుడు ఒక ముసల్మాన్ యువతిని బందీగా పట్టుకొనివచ్చి శివాజీ ముందు నిలిపారు. అప్పుడు శివాజీ అయ్యో! మా అమ్మ ఇంత అందంగా ఉండి ఉంటే నేను కూడా అందంగా పుట్టి ఉండేవాడిని కదా!" అని చెప్పుకుంటూ ఆ యువతిని సగౌరవంగా ఆమె ఇంటికి పంపించివేశారట. పరాయి స్త్రీలో మాతృమూర్తిని దర్శించగల ఔన్నత్యం ఉంది కాబట్టే శివాజీ అంతటి శక్తివంతుడయ్యాడు!

## గాంధారి యొక్క కన్నుల తేజస్సు

శివాజీకున్నటువంటి ఆలోచనా విధానాన్ని మీరు కూడా కలిగి ఉన్నట్లైతే మీ కన్నులు కూడా గాంధారి కళ్ళ వలె తేజోవంతం కాగలవని మేము మీకు హామీ ఇస్తున్నాము. ఒక అంధుడైన వ్యక్తితో తనకు వివాహం జరగనున్నదని తెలుసుకున్న గాంధారి, తన మనస్సు ఎటువంటి ఆకర్షణలకు లోను కాకూడదనీ, చలించకూడదనీ నిర్ణయించుకుని; తను వెంటనే కళ్ళకు గంతలు కట్టుకున్నది, అలా గంతలు కట్టుకునే జీవితాన్ని గడపటంవల్ల (అంటే అది కూడా ఒక విధమైన తపస్సేకదా!) ఆమెకళ్ళకు ఎంతో తేజస్సు వచ్చింది. ఆ తేజస్సు ఎంత శక్తి వంతమైనదంటే మహాభారత యుద్ధం జరుగుతున్న సమయంలో దుర్యోధనుడు ఓటమి దిశగా ఉన్నాడు. అప్పుడు దుర్యోధనుని అనుచరులు "మీ తల్లియైన గాంధారి ఒక్కసారి తన కళ్ళకు ఉన్న గంతలు విప్పి, నీ శరీరమంతటా దృష్టిసారించినట్లైతే నీ శరీరం ఉక్కు వలె దృఢమౌతుంది. ఆమె కళ్ళకు అంతటి తేజస్సు ఉన్నది అది సలహా ఇచ్చారు. వారి సూచనల మేరకు దుర్యోధనుడు తల్లి చెంతకు వచ్చి, ఆమెను అభ్యర్థించి, తన శరీరంమంతటా ఆమె దృష్టిసోకే విధంగా ఒక చిన్న లంగోటీ కట్టుకొని వచ్చి నిలబడ్డాడు. గాంధారి దృష్టిసారించినంత మేర అతని శరీరం లోహసదృశమైంది. ఆ విషయాన్ని తెలుసుకున్న శ్రీకృష్ణుడు దుర్యోధనుడు లంగోటీ ధరించిన ప్రాంతం మీద గద పెట్టి కొట్టమని భీమునికి చెప్తాడు. శ్రీకృష్ణుని సూచన ననుసరించి భీముడు దుర్యోధనుని ఊరువుల మీద గదతో మోదగా దుర్యోధనునికి తొడలు విరిగి అసహాయుడౌతాడు. భీమునికి విజయం లభిస్తుంది. గాంధారి తన కళ్ళకు గంతలు కట్టుకొని తనను తాను దుర్భావనల బారినుండి రక్షించుకున్నది.

కాబట్టి ఆమె కళ్ళకు అంత శక్తి కలిగింది. అలాగే మనం కూడా మన కన్నులను సదాచారమును తిలకించడానికే ఉపయోగిద్దాం. రామాయణంలోని ఆ శ్లోకాన్ని మననం చేసుకుందాం. భగవంతుని పట్ల విశ్వాసం మనలో ఉంటే ప్రతివ్యక్తిలోనూ భగవంతుడిని దర్శించగలం.

ఇక్కడ మనం దుర్యోధనుని గురించి కానీ, మహాభారత కథను గురించి కానీ ఆలోచించవలసిన పని లేదు. గాంధారి కన్నులలోని బ్రహ్మతేజస్సును గురించి అర్థం చేసుకొనవలసింది ఎంతో ఉన్నది.

ఆస్తికుడు ఎవరు? మనం కళ్ళకు ఉన్న స్వల్పమైన తేజస్సును కూడా పోగొట్టుకుంటున్నాము. అలా పోగొట్టుకొనకుండా ఉంటే మనం ఆస్తికులమని దేవుని పట్ల నమ్మకం కలిగినవారమనీ చెప్పబడే వాళ్ళం. భగవంతుని నమ్మినవాడు ఎదుటి వ్యక్తిలో భగవంతుడిని దర్శిస్తాడు. అటువంటి వ్యక్తి ఎదుటి వ్యక్తిని ఎలా మోసగించగలడు? కుట్రలు కుతంత్రాలు చెయ్యగలడా? విశ్వాసఘాతకునిగా మారగలడా? మన ప్రక్కనే ఒక పోలీసాఫీసరు, ఒక కలెక్టరు వంటివారు కూర్చుని ఉండగా మనం ప్రక్కవాడి జేబు కత్తిరించగలిగే సాహసం చెయ్యగలమా? ఆస్తికుడిగా మారిన మరుక్షణం నుంచీ పాపం చేసే ధైర్యం ఎవ్వరికీ ఉండదు.

భగవంతుని ఎడ నమ్మకం ఉన్న వ్యక్తి ఎలా ఉంటాడు? ఒక తండ్రి తన కొడుకుతో కలిసి ధాన్యం దొంగతనం చెయ్యటానికి ఒక రైతు పొలంలోనికి వెళ్ళాడు. ధాన్యాన్ని కోసి మూటలు కట్టి ఇంటికి వెళ్ళేందుకు సిద్ధమయ్యాడు. ఇంతలో కొడుకు "నాన్నా పారిపో! పొలం యజమాని వచ్చాడు. పారిపోకపోతే పట్టుకుంటాడు" అని కేకలు పెట్టాడు.

సరే తండ్రీ కొడుకులిద్దరూ పారిపోయారు. దూరంగా వెళ్ళాక ఊపిరి తీసుకొని తండ్రి "ఎక్కడరా యజమాని? ఇక్కడ కొంచెంసేపు దాక్కుని కూర్చుందాం. వాడు వెళ్ళిపోయాక మనం వెళ్ళి మూటలు తెచ్చుకుందాం!" అన్నాడు. అప్పుడు కొడుకు "నాన్నా! ఈ పొలం యజమాని కంటబడకుండా తప్పించు కోగలం, కానీ వెయ్యికన్నులున్న ఆ భగవానుని దృష్టినుండి తప్పించుకోగలమా? "సహస్రశీర్షా" అని పిలవబడే ఆ పరమాత్మునికి వెయ్యి – కళ్ళు, చెవులు, చేతులు ఉంటాయి. ఆయన నుండి ఎలా తప్పించుకోగలం?" అని ప్రశ్నించాడు.

**వృద్ధులను, బాలురను, పండితోత్తములను దానము, మంచిమనస్సు, వాక్కులతో వశం చేసికోవాలి**

తండ్రినోట మాటరాలేదు, అవాక్కయ్యాడు. ఆ కొడుకు ఈశ్వర విశ్వాసి, అతడు అసలైన ఆస్తికుడు.

## భగవంతుడిని నమ్మినవాడూ, భగవద్భక్తుడూ ఒక్కడు కాదు

ఆస్తికునికీ, భగవద్భక్తునికీ భూమ్యాకాశాల మధ్య ఉన్నంత దూరం ఉంటుంది. భక్తుడు ఎన్నోరకాలైన చెడు మాటలు మాట్లాడుతుంటాడు, చెడ్డ పనులు చేస్తుంటాడు. కానీ ఆస్తికుడైన వాని ప్రవర్తన ఆవిధంగా ఉండదు. అతని వ్యక్తిత్వం ఎంతో ఉన్నతంగా ఉంటుంది. అలాంటి వ్యక్తి యొక్క శక్తికి హద్దులే ఉండవు. **మీరు పూజ చెయ్యకపోయినా ఫర్వాలేదు, మంచి శీలం కలిగి ఉంటే చాలు, మీకు భగవంతునితో సమానమైన శక్తి కలుగుతుంది.**

## శుకదేవుడు - పరీక్షిత్తుల కథ

ఒకసారి పరీక్షిత్తుకు శాపం తగిలింది. నాటినుంచీ సరిగ్గా పదవరోజుకి అతడు పాముకాటుకు బలి కానున్నాడు. శాపాన్ని తప్పించుకునే మార్గమేదీ లేదు. భాగవతకథ వింటే మోక్షం కలుగుతుంది. కాబట్టి ఆ పురాణాన్ని వినమని పెద్దలు పరీక్షిత్తుకి సూచించారు. వ్యాసపీఠాన్ని ఏర్పరిచాడు. కథను చెప్పటానికి వ్యాసులవారిని కాకుండా శుకమహర్షిని ఆహ్వానించమని పరీక్షిత్తు కోరాడు. భాగవతం వ్రాసింది వ్యాసులవారే కదా! మరి శుకదేవుడిని పిలవడమెందుకు? అని ఋషులు ప్రశ్నించగా పరీక్షిత్తు ఈ క్రింది సంఘటనను వివరించాడు.

ఒకసారి నేను అడవిలో వేటకు వెళ్ళాను. వేటను ముగించి దాహం తీర్చుకోవడానికి ఒక చెఱువు వద్దకు వచ్చాను. అప్పడే వ్యాసభగవానులవారు స్నానానికై చెఱువు వద్దకు రాగా స్నాన మాడుతున్న కొంతమంది కన్యలు గబగబ వస్త్రాలు ధరించి ఒడ్డుకు చేరి చెట్టు చాటున కూర్చున్నారు. వ్యాసులవారు స్నానం ముగించి వెళ్ళిపోగానే తిరిగి వారంతా చెఱువులో దిగి స్నానం ప్రారంభించారు. కొంచెంసేపటి తర్వాత శుకదేవులు వచ్చారు. 24-25 సంవత్సరాల వయస్సులో ఉన్న శుకదేవులు నగ్నంగానే వచ్చారు. ఆయన కన్యలు స్నానం చేస్తున్న చెఱువులోనే తానూ దిగి స్నానమాచరించసాగారు. ఆయన ఉనికిని గురించి ఏమాత్రమూ పట్టించుకోకుండానే కన్యలు కూడా నవ్వుతూ తుళ్ళుతూ జలకాలాడసాగారు. కన్యలు స్నానం ముగించి వెలుపలికి వచ్చాక నేను వారిని సమీపించి "వృద్ధుడైన వ్యాసుల వారిని చూసి మీరు సిగ్గుపడుతూ చెట్టు చాటుకు వెళ్ళారు. యువకుడైన శుకుడు నగ్నంగా వచ్చి స్నానం చేస్తున్నా మీరు పట్టించుకోలేదెందుకు?" అని అడిగాడు "శుకదేవులవారికి అసలు వికారమంటే ఏమిటో తెలియదు. అందుకే ఆయనను చూసి మేము సిగ్గుపడలేదు" - అని వారు సమాధానమిచ్చారు.

శుకదేవులు భాగవత పురాణం చెప్తుంటే ఆయనను చూడటానికీ, కథను వినటానికీ దేవతలంతా భూమికి దిగి వచ్చారట. "శుకదేవులు చెప్తున్న ఈ భాగవత పురాణం వల్ల లభించే జ్ఞానమనే అమృతాన్ని మేము త్రాగుతాము. ఆ లాభాన్ని మేము పొందుతాము. నీకు మేము అమృతాన్ని త్రాగిస్తాము. తద్వారా వందరోజుల వరకూ పాము నిన్ను కరవదు. పాము కరవకపోతే నీకు మరణం ఉండదు. ఈ జ్ఞానామృతాన్ని మమ్మల్ని సేవించనీ" - అని దేవతలంతా కలసి పరీక్షిత్తును ప్రలోభపెట్టినా - ఆయన వాళ్ళ ప్రార్థనను నిరాకరించాడు. దేవతలు తనను మోసగించటానికి వచ్చినట్లు గ్రహించిన పరీక్షిత్తు వారు చూపిన ప్రలోభానికి లొంగక వారిని పంపించి వేశాడు. శుకదేవులవారి దివ్యవాణి నుండి భాగవతపురాణాన్ని విన్న పరీక్షిత్తు ధన్యుడైనాడు.

- అనువాదం: *శ్రీమతి కృష్ణకుమారి*

-సమాప్తం-


దైవీశక్తుల తోడ్పాటుకై
కష్ట నష్టముల నివారణకై
చేసిన కృషి సత్ఫలితములనిచ్చుటకై
జ్ఞానము, సంపదల ఆర్జన కొరకై
జీవితంలో స్థిరపడుటకై

యుగశక్తి  గాయత్రి

మాసపత్రిక చదవండి !
చదివించండి !!

ప్రతుల కొరకై సంప్రదించండి:
ఫోన్: 040-23700722, 9949111175


**అర్థము కొరకు ధర్మాన్ని, కామం కొరకు ధర్మార్థముల విడనాడరాదు**

నావారితో నా మాట

# మహాకాలుని అంచనాలకు నిలిచిన యువత



## యువక్రాంతి సంవత్సరం యొక్క దశలవారీ యోజన - 2

శతసూత్ర యుగనిర్మాణ యోజనలోని విషయాలన్నిటినీ ఒకసారి గమనిస్తే అందులో 60% యువకులను ఉద్దేశించి గురువుగారు ఏర్పర్చినవే కనిపిస్తాయి. 'యువత' అంటే ఉల్లాసంతో ఓలలాడేవారు. వారి ఆలోచనలు ఎప్పుడూ సకారాత్మకంగానే ఉంటాయి; నిరంతరం గురుకార్యాలలో నిమగ్నమవడానికే ఇష్టపడతారు. గత రెండు సంచికల నుండి యువక్రాంతి సంవత్సరం కోసం ఏర్పాటు చేసుకున్న ప్రణాళిక గురించి పాఠకులు విస్తారంగా చదువుతున్నారు.

## మన సామూహిక కార్యక్రమాలు : ఒక సింహావలోకనం

31 మే నాడు వ్యసన ముక్తి ఆందోళన – కురీతి ఉన్మూలన ఆందోళన జరుపబడింది. ఈ సంవత్సరం మనం పూనుకున్న ఐదు సామూహిక కార్యక్రమాలలో ఇది రెండవది. దేశ మంతటా ఉత్సాహంగా జరుపుకుంటున్నారు. మూడవ సామూహిక కార్యక్రమం అందరం కలిసి చేసుకోవాల్సింది. 21 జూన్ 2016కి యోగ దినోత్సవం. ఈ ఉత్సవం క్రితం సంవత్సరం దేశమంతటా, ప్రపంచమంతటా ఒకే సారి మొదలైంది. అత్యుత్తమ ఫలితాలు కనిపించాయి. ప్రపంచం లోని పలు దేశాలు యోగా యొక్క ప్రాముఖ్యతను తెలుసు కున్నాయి. ఈసారి వ్యూహం మార్చి దీన్ని వికేంద్రీకృతం చేయబడింది. ఒక్క ఢిల్లీలోనే దృష్టిపెట్టడం కాకుండా, దేశంలోని మిగిలిన రాజ్యాలలో, రాజధానులలో, మహానగరాల్లో, నగరాల్లో ఏర్పాట్లు జరుపబడుతున్నాయి. ఇందుకు గాను అన్ని యోగ సంస్థానాలను, మహావిద్యాలయాలను, విశ్వ విద్యాలయాలను కూడా మన యువ కార్యకర్తలు సంప్రదించి, ఆరోగ్య మంత్రిత్వశాఖ వారు నిర్దేశించిన విధంగా మరియు శాంతికుంజ్ నిర్ధారించిన వ్యూహం ప్రకారం ఏర్పాట్లు చేయడానికి పూర్తి ప్రణాళిక వేయడం జరిగింది. చండీగర్‌లో చాలాపెద్ద కార్యక్రమాన్ని ప్రతిపాదిం చారు, సుమారు 500 మహానగరాల్లో, విదేశాల లోని అన్ని రాజధానులలో జరుగుతుంది. ప్రతి ఒక్కరికీ యోగ గురించి తెలియాలి. సమగ్ర ఆరోగ్యానికి కేంద్ర బిందువు కావాలి అన్నదే ఉద్దేశం.

గత 70 ఏళ్ళగా యోగా క్షేత్రంలో గాయత్రి పరివార్ సక్రియంగా ఉంటోందని అందరికీ తెలుసు. అందరికీ యోగా గురించి తెలియాలన్న ఉద్దేశంతోనే పరమపూజ్య గురుదేవులు గారు 1950 నుండే అఖండజ్యోతి ద్వారా ప్రచురణలు మొదలు పెట్టారు. గాయత్రి తపోభూమి, మథుర లోనూ ఆ తరువాత శాంతికుంజ్, హరిద్వార్‌లోనూ ఎన్నో శిబిరాలు ఏర్పాటు చేయబడ్డాయి. మనదేశంలోని అణువణువులో యోగ నివసిస్తుంది. కానీ గాయత్రి పరివార్ యువశక్తి దాన్ని వైజ్ఞానిక విధానంతో అందరికీ అందించింది. ఇప్పుడు కూడా సుమారు లక్షచోట్లలో ఒకేసారి ప్రతిరోజు పొద్దున యోగా వ్యాయామాలతో మొదలుకుని జీవితంలో ప్రజ్ఞాయోగ సాధనను సమావేశపరిచే ప్రక్రియ కొనసాగుతోంది. ఈ విధంగా యోగా దినోత్సవం జరుపుకోబడాలి. ఇందుకు అవసరమైన సాహిత్యం ఇప్పటికే కూర్చబడింది. అందరికీ పంచబడుతోంది కూడా. భారతదేశం మీద జరిగిన పాశ్చాత్యీకరణ దాడి వల్ల, బహుళజాతీయత తుఫానువల్ల కూడా ప్రజల ఆరోగ్యం బాగా దెబ్బతిన్నది. మధుమేహం, ఊబకాయం, బి.పి, నిద్రలేమి వంటి రోగాలు బాగా పెరిగిపోతున్నాయి. ఇలాంటి పరిస్థితులలో చాలా చోట్ల యోగా శిక్షణతో పాటు జీవితవిధానం మార్చుకోవడం మరియు వేగంగా మారుతున్న పరిస్థితులలో తమను తాము ఇముడ్చు కోవడానికి ప్రశిక్షణ కూడా ఇవ్వబడుతోంది. జూన్ 2016 నుండి మొదలుకుని సంవత్సరమంతా కొనసాగుతుంది.

గత 14 సంవత్సరాలల్లో, అనేక యోగ ధారల్లో ప్రవీణులైన సుమారు 10,000మంది యువత దేవ సంస్కృతి విశ్వ విద్యాలయం (2002లో స్థాపించబడ్డది) నుండి దేశ విదేశాల

**ధర్మార్థ కామములను వాటికి తగిన కాలమును విభజించి సేవించాలి**

లోని పలుచోట్లకు చేరుకున్నారు. చాలామంది (సుమారు 125) పి.హెచ్.డి కూడా చేసారు. దేశ ప్రభుత్వశాఖల్లో, రాయబార కార్యాలయాల్లో మరియు విదేశాల్లో కూడా వారు నేర్చుకున్న యోగాను స్థాపించారు. కొందరు యోగక్లినిక్‌ను కూడా నడుపుతున్నారు. పరిణామాల దృష్ట్యా, ఆర్థిక దృష్ట్యా కూడా చాలా సఫలత సాధించారు. ఎంత దూరదృష్టితో గురువుగారు యోగాభ్యాసానికి అంత విలువనిచ్చారో తెలుస్తోంది. దాని ద్వారానే దేవసంస్కృతి మహావిద్యాలయం (2001-02)లో మొదలైంది. అదే విశ్వవిద్యాలయంగా మారింది. ఇప్పుడు అనేక చోట్ల దేవసంస్కృతి విశ్వవిద్యాలయ శాఖలు తెరుచుకునే అవకాశాలున్నాయి. కచ్చితంగా దీనివల్ల "యోగ" అనేదాన్ని యువకులు ఒక వృత్తిగా స్వీకరించడానికి ఉత్సాహపడతారు. యోగా ప్రమాణపత్రాన్ని ఇచ్చే ఆరు నెలల కోర్సుతో ఇంత సాధించవచ్చని ఎవరూ ఊహించి కూడా ఉండరు.

## మా నాలుగు అద్వితీయమైన ప్రకటనలు

వచ్చే సంచికకల్లా యోగ సంవత్సరం గురించిన విస్తారమైన సూచనలు వచ్చేస్తాయి. అప్పుడు విస్తృతంగా చర్చించవచ్చు. ఇప్పుడు మాత్రం యువ క్రాంతి సంవత్సరంలో యువత ఆందోళనలతో ముడిపడ్డ నాలుగు అద్వితీయమైన నినాదాల గురించి వివరంగా చెప్పే ప్రయత్నం చేస్తాం. అవి 1) ఆరోగ్య కరమైన యువత - సబల దేశం, 2) శిష్టాచారులైన యువత - శ్రేష్ఠ దేశం 3) స్వావలంబ యువత - సంపన్న దేశం, 4) సేవాభావ యువత - ఆనందమయ దేశం

నేటి యువతను ఈశ్వరోన్ముఖులను చేయడానికి, దేశం పట్ల వారి సమర్పణ పెరగడానికి కావలసిన సూత్రాలు ఇందులో దాగి ఉన్నాయి.

**1. ఆరోగ్యకరమైన యువత:** ఇప్పుడు యోగ గురించి మాట్లాడు కుంటున్నాం. "అథ యోగానుశాసనం" - యోగ సూత్రం. జీవితంలో అనుశాసనం ఉంటే, అన్ని పనులు సమయానికి అయిపోవాలి. అన్న పానీయాలను నియంత్రించుకుని, పడుకోవడం, లేవడం అన్నీ సమయానికి చేస్తే రోగాలు ఆక్రమించే అవకాశం ఉండదు. యుగ నిర్మాణానికి పరమపూజ్య గురువుగారు ఇచ్చిన ప్రాథమిక సూత్రాలలో మొదటిది ఆరోగ్య మైన శరీరం. 'స్వ'లో స్థిరమైనవారు స్వస్థులు, యోగంలో స్థిరంగా ఉన్నవారు 'యోగస్థులు'. ఈ మాటలను జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. ధర్మాన్ని ఆచరించడానికి ఆధారం శరీరమే అని భావిస్తారు. "శరీర మాధ్యమం ఖలు ధర్మసాధనం". యుగనిర్మాణ సూత్రాలలో శరీరాన్ని దైవమందిరంగా చెప్తారు. అలాంటప్పుడు ఈ గుడిని కాపాడాల్సిన బాధ్యత అందరికీ ఉంది. అందుకే 'ఆరోగ్యకరమైన యువత - బలమైన దేశం' అన్న నినాదం ఇవ్వబడింది. ఆరోగ్యవంతులైన యువత ఉన్న దేశాన్ని ఏ శక్తీ ఓడించలేదు. అశ్లీలత, మత్తుపదార్థాలు, విదేశీ ఆక్రమణలు, నకారాత్మకత ఏవీ ఓడించలేవు. కాబట్టి ముందు మనం శారీరిక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్యంపై ధ్యాసపెట్టాలి. ఇటువంటి యువశక్తి ఆధారం వల్ల పదేళ్ళల్లోనే మన దేశాన్ని ప్రపంచానికి జగద్గురువుగా ముందరే ప్రకటించేయవచ్చు. గీతలో యోగేశ్వరుడైన కృష్ణుడు

*యుక్తాహార విహారస్య యుక్త చేష్టస్య కర్మసు*
*యుక్తస్వప్నావబోధస్య యోగో భవతి దుఃఖహా. (6.17)*

**భావం:** మితాహారము, కర్మలయందు మితమైన ప్రవర్తన గలవాడును, మితమైన నిద్రగల మనుష్యునకు యోగము వల్ల దుఃఖములు తొలగిపోవును.

యోగ అంటే ఉత్త వ్యాయామమే కాదు. అదోక జీవిత విధానం. ఆహార, విహార, సంయమాది యమ నియమాలు, రోజంతా చేసే పనులు-వాటి సదుద్దేశం, అవసరానికి తగినట్టుగా మాత్రమే నిద్రపోవడం, సరైన సమయానికి లేవడం కూడా వీటిలో వస్తాయి. ఈ విధమైన సమగ్రభావంతో యోగాన్ని అర్థం చేసుకున్నవారు పూర్తి ఆరోగ్యవంతులుగా ఉంటారు. నేటి యువతకు సమగ్ర ఆరోగ్యం (హోలిస్టిక్ హెల్త్) గురించిన అవగాహన ఉండి తీరాలి. కేవలం ఆసనాలవరకు మాత్రమే పరిమితమైన యోగ వల్ల ఆరోగ్యంలో కొన్ని అంశాలే మెరుగుపడతాయి. ఆరోగ్యవంతమైన యువత ద్వారా బలమైన దేశం ఏర్పడాలి అంటే మాత్రం జీవించే పద్ధతిలో పరివర్తన వల్ల మాత్రమే జరుగుతుంది. అందుకే పరమపూజ్య గురువుగారు ఇచ్చిన ప్రజ్ఞాయోగం, ప్రజ్ఞా వ్యాయామం మరియు జీవనశైలికి సంబంధించిన మార్గదర్శనం సమగ్రమైనది.

**2. మర్యాదస్తులైన యువత:** "యువత" అనగానే ఏ అల్లరిమూక విశ్వవిద్యాలయానికో చెందిన రాజకీయ నాయకుల శిష్య గణాలు అనిపిస్తుంది. యువకుల్లో ఉత్సాహం ఉంటుంది. ఏదైనా చేసి చూపించాలనే పట్టుదలుంటుంది. వాళ్ళ ఉగ్రూత

**గురువులకు, వృద్ధులకు, మునులకు, దేవతలకు, అతిథులకు, దేవాలయాలకు, కృతార్థులైన బ్రాహ్మణులకు నమస్కరించు**

లూగించే ప్రదర్శనలు చూసి, నినాదాలు విని అలా అనిపించడం పరిపాటే. “మర్యాద ఏ ఖర్చు లేకుండానే లభిస్తుంది, దాంతో అన్నీ కొనవచ్చు” అన్నారు గురువుగారు. మర్యాదస్తులైన యువకులే గాయత్రి పరివార్‌కి గుర్తింపు. పెద్దలతో వినమ్రంగా చర్చించి వారి మార్గదర్శనంతో శ్రేష్ఠకార్యకర్తలుగా రూపొందుతారు. యువత తన శిష్టాచార జీవన విధానంతో, వినమ్ర వ్యవహారంతో అందర్నీ తనవారిగా చేసుకోగలరు.

యువక్రాంతి సంవత్సరానికి ఇంత ప్రాముఖ్యతను ఇస్తున్నప్పుడు వారికి వినమ్రతకు కూడా శిక్షణ ఇవ్వాలి కదా. అన్నిటికన్నా గొప్ప సద్గుణమైన వినమ్రతతో అందరి మనసులను గెలవవచ్చు. సాఫల్యానికి ఇది మొదటి మెట్టు. దృఢమైన కాయంతో ఆరోగ్యంగా, బలంగా ఉన్నా కూడా వినమ్రత మాత్రమే అతని వ్యక్తిత్వానికి మెరుగులు దిద్దుతుంది. ఈ విధమైన వినమ్ర యువకుల్ని వెతికి మనతో కలుపుకోవాలి. దాంతో పాటు వినమ్రతను నేర్పే కార్యశాలలు కూడా నిర్వహించాలి. నేడు విజయ కెరటాలు ఎగరవేసే వారు ఎలా గొప్పవారయ్యారో తెలిపి, ప్రేరణనిచ్చే వారి ఉదాహరణలతో చాలామందిని మార్చవచ్చు.

కాలేజీలు, విశ్వవిద్యాలయాలలోని విద్యార్థి సంఘాల్లోకి రాజకీయ నాయకులు జొరబడడం అనేది దౌర్భాగ్యం. ఒక మహత్వకాంక్షను పుట్టిస్తారు. ఎంత విచ్చలవిడిగా మారితే అంత పెద్ద నాయకులవుతారు అని నేర్పిస్తారు. నాయకుల ఉదాహరణ కూడా ఇస్తారు. దేశ ఆత్మగౌరవంతో ఆడుకునే వివాదాస్పద వ్యాఖ్యానాలు చేయడం కూడా నేర్పుతారు. ఇక్కడి నుంచే మూలలు విషమయం అవుతాయి. ఆ తరువాత కులపతి కార్యాలయం వద్ద ధర్నాలు, విశ్వవిద్యాలయం ఆస్తులను నాశనం చేయడం, నగరంలో అశాంతి రేకెత్తే కార్యకలాపాలు చేయడం మొదలవుతాయి. నేటి మీడియా అటువంటి వారిని హీరోగా చిత్రీకరిస్తుంది. త్వరలో అతను నాయకుడైపోతాడు. రాజకీయ కాలుష్యానికి ఇది మొదటి మెట్టు. ఆ తరువాత అవినీతి, అశాంతి, వివాదాలలో కూరుకుపోయిన దేశంగా చిత్రీకరించబడుతుంది.

మన యువ సంఘటనలకు వినమ్రత నేర్పాలి. అప్పుడే దేశభక్తి, ప్రజాసేవకుల నిష్పత్తి పెరుగుతుంది. ఇప్పుడు యువత గురించి చిత్రించినట్టు అప్పుడు ఉండదు. సమాజంలో కొనసాగే నిర్మాణాత్మక కార్యక్రమాలలో యువత పాల్గొనడం మొదలు పెడతారు. అప్పుడు శ్రేష్ఠమైన దేశమవుతుంది. వినమ్రులైన యువత – శ్రేష్ఠ యువత అన్నదే మన నినాదం.

**3. స్వావలంబ యువత:** పరిశ్రమశీలురైన యువతను బట్టే ఆ దేశ సంపన్నతను గుర్తిస్తారు. ఇటువంటి వారు ఎంత ఎక్కువ మంది ఉంటే, వీరివల్ల దేశానికి ఎంత ఎక్కువ ఆదాయం లభిస్తే ఆ దేశం ప్రపంచపటంలో అంత ముందున్నట్టు లెక్కగడతారు. మహాత్మా గాంధీగారు కూడా ప్రాథమిక శిక్షణకు చాలా ప్రాముఖ్యతనిచ్చారు. చిన్నప్పట్నుంచే పిల్లలల్లో ఈ సంస్కారం నాటాలన్నారు. తమ పనులన్నీ తామే స్వయంగా చేసుకునే ప్రవృత్తితో మొదలుపెట్టి, ఎంత చిన్నపని చేయడంలోనైనా చిన్నతనం భావించకూడదని నేర్పాలి. అప్పుడు స్వావలంబన స్వతహాగా వారిలో వికసిస్తుంది. భోజనం, బట్టలు, ఇల్లు ఈ మూడు మనిషికి కావలసిన మౌలిక అవసరాలు. మన దగ్గర విద్యకు ప్రాముఖ్యతనిస్తారు కాని డిగ్రీ పూర్తి చేసుకున్నాక నిరుద్యోగుల సంఖ్య మాత్రమే పెరిగితే లాభం లేదు. చదువుకున్న యువత సంఖ్య మన దగ్గర పెరుగుతూనే ఉంది. విద్యాసంస్థలు పెరిగినంతగా ఉద్యోగ అవకాశాలు మాత్రం పెరగలేదు. యువత స్వయంగా ఆ అవకాశాలు కల్పించుకోవాలి. పరస్పర సహకారంతో చిన్నచిన్న గృహోద్యోగాలను ఏర్పాటు చేసి విద్యావంతులైన యువత మరెందరికో ఉద్యోగ అవకాశాలను కల్పించవచ్చు. నిజానికి ఆత్మావలంబన – స్వావలంబన అనేవి ఆధ్యాత్మిక గుణాలు. ఇది ఎంత వికసిస్తే యువతగా అంత సార్థకత పొందినట్టు.

క్రితం సంచికల్లో 'స్వలోకం' గురించి చర్చించాం – స్వావలంబ ప్రజాసేవ మండలాలు. ఆంగ్లంలో దీన్నే సెల్ఫ్ రిలయంట్ వాలంటరీ ఎస్టాబ్లిష్మెంట్ (సెర్వ్) అని కూడా అనవచ్చు. దేశంలో పలుచోట్ల ఇది ప్రారంభమైంది. లాభాలు సంపాదించడం మీద దృష్టి పెట్టకుండా, పెట్టుబడి విషయంలో నిజాయితీ, పారదర్శకతలు ప్రదర్శిస్తే పని జరుగుతుంది. ఐ.ఐ.ఎమ్ పాస్ అయిన చాలా మంది విద్యార్థులు ఇప్పుడిదే చేస్తున్నారు. లక్షలు, కోట్లల్లో జీతాలు కూడా వదులుకుని ఇలాంటి మండలాలను ఏర్పాటు చేయడంలోనే వాళ్ళకి తృప్తి కలుగుతోంది. దేశాన్ని సంపన్నంగా చేయాలంటే, చైనా, అమెరికా, యూరప్‌లను సవాలు చేయాలంటే ఇదే పద్ధతి.

**సార్వజనీనమూ, సార్వకాలికమూ అయిన మహాకావ్యరచన ఋషితుల్యులకు మాత్రమే సాధ్యం**

**4. సేవాభావ యువత:** సేవ చేయని యువత జీవితమే వ్యర్థం. మనల్ని మహామానవులను చేయగల భావమిది. నేడు సంవేదన మొద్దుబారిపోయింది. యువత సేవానిరతిని ప్రదర్శించి ఉంటే బావుండును అనే సంఘటనలు ఎన్నో మన ముందు జరుగు తూంటాయి. అవి జాతీయ విపత్తులేకానీ, రోడ్డు మీద జరిగే దుర్ఘటనలే కానీ,(వాటిని చూసీ చూడనట్టు యువత ముందుకు సాగిపోతూంటారు). వృద్ధుల పట్ల ప్రవర్తనే కానీ (వారి సొంత పిల్లలే పట్టించుకోరు). సేవాభావంలోని ఆధ్యాత్మిక ప్రక్రియను తెలియజేయాలి. నేడు శక్తివంతమైన, సబలమైన శరీరం ఉన్న యువత అసహాయులకు, వికలాంగులకు, అబలలకు చేసే సహాయం ఎంత పుణ్యప్రదమైనదో తెలియచెప్పాలి. నేడు గ్రామీణక్షేత్రాల్లోనూ, నగరాల్లోనూ ఇటువంటి సేవా కార్యక్రమాలు చేపట్టడానికి చాలా ప్రాజెక్టులు మొదలుపెట్టే అవకాశాలు ఉన్నాయి.

మన పరివార్‌లోని యువత ధైర్యంతోనే తటశుద్ధి, జల శుద్ధి, నదీ శుద్ధి, నిర్మల అవిరళ గంగ మొదలుకుని దేశంలో అన్ని నదుల ప్రక్షాళన అభియానం మొదలుపెట్టాం. రాబోయే పది సంవత్సరాలల్లో మన యువత ఇది చేసి తీరుతుంది, అందులో సందేహమే లేదు. సేవాభావం వికసిస్తేనే ఆనంద మయ, సమృద్ధ, సంపన్న దేశం జన్మిస్తుంది. యువత శ్రమ విలువను తెలుసుకుని, కలిసికట్టుగా ఉండి, ఎదుటివారి పీడను తమ బాధగా భావించి సహాయం చేసినప్పుడే 'సుఖం' వ్యాపిస్తుంది. అన్ని చోట్లా, అన్ని క్షేత్రాలలో, అన్ని వేళలా సేవ అవసరమైన కోణాలు చాలా ఉన్నాయి. మన భాగస్వామ్యమే తరువాయి. లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్, భారత్ వికాస్ పరిషద్ మొదలైన సంగఠనలు సేవాభావంతోనే పైకొచ్చాయి. అఖిల విశ్వ గాయత్రి పరివార్ కూడా చేయవలసిందిదే. మన నాలుగు సూత్రాలు ఆరోగ్యకరమైన యువత, వినమ్ర యువత, స్వావలంబ యువత, సేవాభావ యువత – మనం ఇలా ఉన్నామా అని మనల్ని ప్రశ్నిస్తున్నాయి.

*– అఖండజ్యోతి, జూన్ 2016*

అనువాదం: *ఎం.వి. ప్రసాద్*

## "భగవంతుడు భావనల వెనుకనున్న మూలాన్ని చూస్తాడు"

*గుజరాత్ దేశ రాజమాత మాలినీదేవి, భగవాన్ సోమనాథుని భక్తిప్రపత్తులతో పూజించి బంగారం దానం ఇచ్చింది. అప్పుడు ఆమె మదిలో కించిత్తు అహంకార భావం పొడచూపగా, తనలా అంత బంగారాన్ని భగవంతునికి వేరెవ్వరు ఇవ్వలేరు అని భావించింది. భగవాన్ సోమనాథుడు రాత్రి ఆమెకు కలలో కన్పించి, నా మందిరానికి ఒక పేద మహిళ వచ్చింది. ఈరోజు నీవు స్వర్ణదానం ద్వారా సంపాదించిన పుణ్యం కన్నా ఆమె పుణ్యం అనేకరెట్లు హెచ్చుగా ఉంది అన్నాడు. రాజమాత, ఆ మహిళను రాజమహలుకు పిలిపించి ఇలా అంది "నాకు నీవు సంపాదించిన పుణ్యాన్ని ఇవ్వు! దీనికి ప్రతిఫలంగా నీకు ధనరాశిని కోరినంత ఇవ్వగలను!" దీనిని విన్న పేదరాలు "రాజమాతాజీ! నేను నిరుపేదరాలను నేనేమి పుణ్యకార్యం చేయగలను? నేను ఎట్టి పుణ్యకార్యం చేశానో నాకు ఇప్పటికి తెలియరాకున్నది. ఇట్టి స్థితిలో నేను మీకు ఏమి అర్పించగలను" అన్నది. దీనిని విన్న రాజమాత ఇలా అడిగింది– "అమ్మా! నిన్నటి రోజున నీవు చేసిన క్రియాకలాపాల గురించి తెలియజెయ్యి. అప్పుడు నీవు ఎట్టిపుణ్య కార్యాలవలన ఇంతటి పుణ్యాన్ని సంపాదించింది నేను తెలుసుకుంటాను!". జవాబుగా ఆ పేదరాలు ఇలా చెప్పింది – "రాజమాతాజీ! నేను ఒక నిరుపేదను! నాకు నిన్న ఒకదానశీలుడు ఒక గుప్పెడు బూందీని దానం చేశాడు! దీనిలో నుండి సగభాగాన్ని నేను భగవాన్ సోమనాథునికి నైవేద్యరూపంలో నివేదించాను. శేషబూందీని నేను తినాలనుకొన్నాను. అదే సమయంలో ఒక భిక్షువు దానం ఇమ్మని కోరగా, దానిని నేను అతనికి దానం చేశాను." దీనిని విన్న రాజమాతకు పేదరాలి దానం యొక్క విశిష్టత తెలిసింది. దానమనేది నిష్కామంతో కూడి ఉండాలి. అందువలననే పేదరాలి దానం రాజమాత స్వర్ణదానం కన్నా ఉన్నతమైనదిగా భాసించింది. భగవంతుడు, భావనల వెనుకనున్న మూలాన్ని చూస్తాడు.*

*– హిందీమూలం: అఖండజ్యోతి, జూన్ 2016*

*అనువాదం : ఎ. వేణుగోపాలరెడ్డి*

**మనస్సు-శరీరం ఒకదానిపై మరొకటి ఆధారపడి ఉంటాయి**

ఆయుర్వేద వైద్యం-15

# కరక్కాయలు-హరీతకి & వాము-యవాని

## కరక్కాయలు-హరితకీ

ఎల్లప్పుడు ఇంట్లో ఉంచుకోదగిన కరక్కాయలు. 'అమృతా' యని సంస్కృతంలో పిలువబడే ఈ కరక్కాయలను ఆయుర్వేద ఔషధాలలోను, నిత్యజీవితంలోను ఎక్కువగా ఉపయోగిస్తారు.

**కరక్కాయల ఔషధ ఉపయోగాలు:**

**1. అజీర్ణం, మలబద్ధకం:** కరక్కాయ, తానికాయ, ఉసిరి కాయల సమానం చూర్ణం తీసుకొని 1,2 స్పూన్లు సేవిస్తే, జీర్ణశక్తి పెరగడమే కాక, మలబద్ధకం తొలగుతుంది. దీనినే త్రిఫలా చూర్ణమంటారు.

**2. దగ్గు:** కరక్కాయ చూర్ణం, పిప్పళ్ల చూర్ణం తేనెతో కలిపి సేవించాలి. కరక్కాయను దవడకుపెట్టుకొని రసం మ్రింగు తుండినా దగ్గు ఉపశమిస్తుంది.

**3. విరేచనములు:** కరక్కాయను కషాయంగా కాచి $^1/_2$ ఔన్సు 2 స్పూన్ల నేయితో కలిపి సేవించాలి.

**4. కండ్ల కలక:** కరక్కాయతొక్కను రాత్రి నీళ్ళలో నానవేసి, ఉదయం వడియగట్టి కంట్లో చుక్కలుగా వేసుకోవాలి.

**5. శ్వాస:** కరక్కాయను దంచి హుక్కాలో వేసి ముట్టించి పొగపీల్చిన దమ్ము వ్యాధి ఉపశమిస్తుంది.

**6. అగ్ని దగ్ధ వ్రణము:** కరక్కాయను నీటితో అరగదీసి ఆ గంధములో అవిసె నూనె కలిపి అంటించిన కాలిన పుండ్లు తగ్గుతాయి.

**7. చిగుళ్ళ వ్యాధులు:** కరక్కాయ చూర్ణములో పళ్ళు తోముకున్న చిగుళ్ళ వ్యాధులు తగ్గి, పళ్ళు గట్టిపడతాయి.

**8. నేత్ర వ్యాధులు:** కరక్కాయను మెత్తని పొడరుగా చేసి అంజనం లాగా ఉపయోగించినా, కరక్కాయలను రాత్రంతా నీళ్ళలో నానబెట్టి మరుసటి రోజు ఆ నీళ్ళతో కళ్ళు కడుగుకున్నా కళ్ళలో నుండి నీరు కారడం ఆగిపోతుంది.

**9. ముఖవ్యాధులు:** కరక్కాయ చూర్ణాన్ని తేనెతో నాకిన స్వర, నోటికి సంబంధించిన వ్యాధులు శమిస్తాయి.

**10. అర్శమొలలు:** కరక్కాయ చూర్ణం 2 భాగాలు, పసుపు $^1/_2$ భాగం, బెల్లం 3 భాగాలు కలిపి మర్ధించి కుంకుడుకాయ ప్రమాణం, మజ్జిగతో సేవించాలి.

## వాము-యవాని

వాము (ఓమ) నెరుగని తెలుగు గృహిణులుండరు. సర్వ సాధారణంగా వాము ఇంట్లో గృహోపయోగాలకై దాచి పెట్టడం చాలామందికి అలవాటు.

**వాము ఔషధ ఉపయోగాలు:**

**1. కడుపు నొప్పి:** వాము, సైంధవ లవణం కలిపి మెత్తగా నూరి, 1. స్పూను మోతాదు నిమ్మరసంతో సేవించాలి.

**2. అజీర్ణం:** పసిపిల్లల్లో అజీర్ణానికి చనుబాలతో వాము చూర్ణాన్ని ఉగ్గు చేసిపెట్టాలి. పెద్దలు భోజనాంతరం వామును భుజించాలి.

**3. అజీర్ణ విరేచనాలు:** వాము, శొంఠి, సైంధవ లవణం, మిరియాలు చేర్చి దంచి చూర్ణము చేసి 1 స్పూను మోతాదు ఉదయం, సాయంత్రం సేవించాలి.

**4. నోటి దుర్గంధం, చిగుళ్ళ వ్యాధులు:** వామును కొద్దికొద్దిగా పలుమార్లు నమలి మ్రింగుతుండాలి.

**5. దంత వ్యాధులు:** వామును, సైంధవ లవణముతో కలిపి చూర్ణించి, దానితో పళ్ళు తోముకోవాలి.

**6. చెవిపోటు:** వాము రసం వడియగట్టి చెవిలో చుక్కలుగా వేయాలి.

**7. జలుబు, తొంప:** వామును పెనంపై వేసి వేయించి బట్టలో వేసి వాసన చూస్తుండాలి.

**8. దద్దులు:** వాము, బెల్లం సమపాళ్ళలో దంచి, కుంకుడు కాయ ప్రమాణంలో సేవించాలి.

**9. తేలుకాటు:** వాము చూర్ణం, కోడిగ్రుడ్డు పచ్చసొన, తేనె, నిమ్మరసం మర్దించి తేలు కరచినచోట అంటించాలి.

**10. మూత్రపుమంట:** వాము చూర్ణాన్ని బియ్యము కడుగుడు నీళ్ళతో సేవించాలి.

**11.** దెబ్బలు తగిలి వాచిన స్థలంలో వాము పిండిని, నిమ్మరసం కలిపి లేపనం చేయాలి.

**12.** చర్మవ్యాధులలో నిమ్మరసంలో వామును కలిపి నూరి లేపనం చేయాలి.

ప్రతి మనస్సు ఒక కురుక్షేత్రమే

# స్ఫూర్తిదాయక గాయత్రీపరివార్ సభ్యులు - 26

## శ్రీ దేవేంద్రరౌలో, శ్రీకాకుళం జిల్లా




శ్రీ కాశీవిశ్వనాథ్‌రౌలో–శ్రీమతి అప్పిలి రౌలో దంపతులకు 15 జులై 1962లో దేవేంద్రరౌలో వింధ్యగిరిలో గ్రామం, కవిటి మండలం, శ్రీకాకుళం జిల్లాలో జన్మించారు. ప్రాథమిక విద్యను వింధ్యగిరిలోను, ఉన్నత పాఠశాల విద్యను రాజా గ్రామంలో, ఇచ్ఛాపురంలో ఇంటర్ డిగ్రీ కోర్సులను ఆంధ్రా యూనివర్సిటీలో అభ్యసించారు. బరంపురం యూనివర్సిటీలో ఎమ్.ఎ. పట్టాపుచ్చుకొని, 1989లో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా, మండల ప్రాథమిక పాఠశాల కొక్కిలి పుతుగలో తన ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. అటుపిమ్మట జిల్లా పరిషత్ హైస్కూల్ రాజాపురంలో ఒరియా భాష అధ్యాపకునిగా చేరి తన ఉపాధ్యాయ వృత్తిని కొనసాగిస్తున్నారు.

1987 నుండి 1989 వరకు ఫుల్‌బాణి, ఒరిస్సా రాష్ట్రంలో పనిచేస్తూ ఉండగా గాయత్రీ పరివార్‌తోను, గాయత్రీ యజ్ఞాలతో పరిచయమైంది. 1988లో అచ్చట 108 కుండముల గాయత్రీ యజ్ఞము జరుగగా దానిలో గురుమంత్ర దీక్షను తీసికొన్నారు. అనాటి నుండి నిర్విఘ్నంగా గాయత్రీ జపాన్ని చేస్తూ వచ్చారు. 1991లో బరంపురంలో జరిగిన అశ్వమేధ యజ్ఞంలో చురుకుగా పాల్గొన్నారు. వందనీయ మాతాజీ దర్శనం లభించింది. మరింత చురుకుగా గాయత్రీ జపాలు చేస్తూ వచ్చారు.

కన్ను పుట్టుక గ్రామంలో గాయత్రీ ప్రజ్ఞామండలిని 2005లో ప్రారంభించి చుట్టుప్రక్కల గ్రామాలలో యజ్ఞాలను, సత్సంగాలను చేస్తూ అచ్చటివారిలో చైతన్యాన్ని నింపి గాయత్రీ మంత్ర జపమహిమను తెలుపుతూ వారిని జాగృతపరచసాగారు. ఆ ప్రాంతమంతా వ్యవసాయ కుటుంబాలతో నిండి ఉన్నది. ఆనాటి నుండి బీరుపోకుండా వార్షికోత్సవాన్ని జరుపుతూ గాయత్రీ యజ్ఞాన్ని క్రమం తప్పకుండా చేస్తూ వస్తున్నారు. మారుమూల గ్రామాల్లో భావచైతన్యాన్ని ....... నింపుతూ వస్తున్న దేవేంద్ర రౌలో దంపతులు ధన్యజీవులు.

## శ్రీ బొర్రా ప్రకాశరావు, శ్రీకాకుళం జిల్లా



శ్రీ బొర్రా శీమయ్య–శ్రీమతి సావిత్రి దంపతులకు 8 సెప్టెంబరు, 1969లో ప్రకాశరావు చండిపుట్టుక గ్రామం, కవిటి మండలం శ్రీకాకుళం జిల్లాలో జన్మించారు. ప్రాథమిక విద్య నుండి ఉన్నత విద్య వరకు చండిపుట్టుక ప్రాంతంలో పూర్తిచేసి, ఇంటర్ కవిటిలో పూర్తిగావించి, బి.ఎస్.సి. డిగ్రీని ఆంధ్రా యూనివర్సిటీ విశాఖపట్నంలో చేశారు. పెద్ద చదువులు చదివినా, కులవృత్తి అయిన వ్యవసా యాన్ని అంది పుచ్చుకొని తన జీవిత పథాన్ని తీర్చిదిద్దుకున్నారు. దేవేంద్ర రౌలాతో కలిగిన పరిచయం ద్వారా గాయత్రీ యజ్ఞాల పట్ల ఆకర్షితులై గాయత్రీ పరివార్‌లో సభ్యునిగా చేరి, గాయత్రీ పరివార్ కార్యకలాపాల నిర్వహించు టలో దేవేంద్రరౌలో గారికి కుడిభుజంలా నిలిచి పనిచేస్తున్నారు. 2005 లో బరంపురంలో జరిగిన అశ్వమేధ యజ్ఞంలో పాల్గొని వందనీయ మాతాజీ దర్శనభాగ్యాన్ని అందిపుచ్చుకొన్న ధన్యజీవి.

తదుపరి శ్రీకాకుళంలో, స్వామి నాయుడుగారి ద్వారా నిర్వహింపబడిన 108 కుండముల గాయత్రీ యజ్ఞములో పాల్గొని తన సేవలనందించుట జరిగింది.

2016 మేలో జరిగిన 9 రోజుల సంజీవిని సాధనా శిబిరంలో పాల్గొని గాయత్రీ పరివార్ పట్ల తనకు గల అవగాహనను మరింతగా పెంచుకున్నారు.

తమ గ్రామంలో స్థాపించిన ప్రజ్ఞామండలిలో సభ్యునిగా క్రియాశీలక పాత్రను పోషిస్తూ ప్రగతి పథంలో పయనించు చున్న ప్రకాశరావు అభినందనీయుడు.

### వ్యర్థమైన పనులు

*సముద్రంలో కురిసిన వర్షము వ్యర్థము*
*ఆకలి తీరినవారికి అన్నం పెట్టుట వ్యర్థము*
*ధనికునికి దానము చేయుట వ్యర్థము*
*గొప్ప వీరునికి రక్షణనిచ్చుట వ్యర్థము*

**తైలమర్దనంతో శరీరంలోని జడత్వం, సత్సంగ మర్దనంతో మనస్సులోని జడత్వం తొలగుతుంది**

# తొమ్మిది రోజుల సంజీవిని సాధనా శిబిరంపై నివేదిక-2

**డా॥ చిన్మయ్ పండ్యా - ప్రో ఛాన్సలర్,**
**దేవ సంస్కృతి విశ్వవిద్యాలయం, హరిద్వార్**

డా॥ చిన్మయ్ పండ్యాగారు, సాధకులనుద్దేశించి సందేశాన్ని అందించారు. పరమపూజ్య పండిత శ్రీరామశర్మ ఆచార్య గురుదేవులు వందనీయ మాతాజీల సూక్ష్మసంరక్షణలో గాయత్రీ మంత్రాన్ని సుస్వరంతో ఆలపిద్దాం. "ఓం భూర్భువః స్వః తత్స వితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియో యోనః ప్రచోదయాత్". గాయత్రీ మంత్రం సూర్యుని మంత్రం. మనస్సుకు దారిచూపి మలినాల నిర్మూలించి, మార్గదర్శనం చేసెడి మంత్రం. సూర్యుడు వేడి మరియు ప్రకాశంతో నిండి ఉంటాడు. తన వేడిమితో మలినాలను దగ్ధం చేస్తూ, ప్రకాశం ద్వారా మార్గదర్శనం చేస్తూ ఉంటాడు.

జీవితంలో జరిగెడి ప్రతి సంఘటన మన మంచికే జరుగుతుంది అనెడి దృక్పథాన్ని అలవాటు చేసుకోండి. ముమ్ముందు దానిపై విశ్వాసము కలుగుతుంది. దీనికి ఉదాహరణగా ఒక రాజ్యంలోని మంత్రి పుంగవునికి గాయత్రి, గాయత్రీ మంత్రంపై విశేష నమ్మకం కలిగి ఉన్నాడు. నిత్యము గాయత్రిని ఉపాసిస్తూ ఉండేవాడు. నిత్యం జీవితంలో ఏది జరిగినా (మంచి కాని లేక చెడు కాని) అంతా మన మంచికే జరిగింది అనెడి భావనలో ఉండేవాడు. ఒక పర్యాయము ఆ దేశపు రాజు వేటకు వెళ్ళగా, ప్రమాదవశాత్తు ఆయన చేతి వ్రేలు తెగిపోయింది. దీనికి రాజు చింతిస్తుండగా అంతా మన మంచికే జరిగింది అని మంత్రి సముదాయించాడు. దీనితో రాజుకు కోపము వచ్చి మంత్రిని దేశబహిష్కారం గావించాడు. అప్పుడు కూడా మంత్రి, అంతా మన మంచికే అంటూ రాజును, సమూహాన్ని వీడి తక్షణమే వెళ్ళిపోయాడు. జంతువుల వేటాడుటలో రాజు దారి తప్పి ఒంటరిగా మిగిలాడు. ఇంతలో అడవిలోని ఆటవికులు ఒంటరిగానున్న రాజును బంధించి వారి కులదేవతకు బలి ఇచ్చుటకు సిద్ధమై రాజు శరీరాన్ని, అవయవాలను ఆసాంతము పరిశీలిస్తుండగా రాజు చేతి వ్రేలు ఒకటి లేదని గుర్తించారు. దీనితో రాజును బలి ఇచ్చుటకు పనికిరాదని తేల్చి విడిచిపెట్టారు. ఈ రీతిగా రాజు ఆటవికుల బారి నుండి రక్షింపబడ్డాడు. వెంటనే రాజుకు, దేశ బహిష్కారానికి గురియైన తన మంత్రి మాటలు "అంతా మన మంచికే జరిగింది" గుర్తుకు వచ్చి, మంత్రిని వెతికి తెమ్మని తన భటులను ఆజ్ఞాపించాడు. భటులు వెతికి మంత్రిని రాజు వద్దకు తోడ్కొని వచ్చారు. రాజు తన తప్పిదాన్ని తెలిసికొని మంత్రిని క్షమాపణ కోరుతూ ఇలా ప్రశ్నించాడు "మంత్రి వర్యా! అంతా మన మంచికే జరుగుతుంది అనెడిది మీ పట్ల ఎలా నిజము అని ప్రశ్నించగా" ప్రభూ మీరు నన్ను దేశ బహిష్కారం గావించి నా ప్రాణాలు కాపాడారు. లేనిచో మీ వెంట నేను వచ్చి ఉండే వాడిని. మీతోపాటు నేను కూడా ఆటవికులకు బందీగా చిక్కే వాడిని. అన్ని అవయవములు సరిగా ఉన్న నన్ను వారు తప్పక దేవికి బలి ఇచ్చి ఉండేవారు. ఈ రీతిగా నాకు మంచి జరిగిందన్నాడు. ఇది గాయత్రి కృప. నా మంత్ర జపం నన్ను కాపాడింది" అన్నాడు.

మహాపురుషులు మానవ రూపంలో జన్మ తీసికొనే ముందు వారు నిర్వర్తించవలసిన, సంస్కరించవలసిన, పనులను గుర్తించి సమయానుకూలంగా జన్మ తీసికొని తమ పనుల పూర్తిగావించి తిరిగి తమ స్థానాలకు వెళ్ళిపోతారు. మన ప్రాచీన గ్రంథాలను, ధర్మాన్ని, సంస్కృతిని పరిశీలించిన ఇదే మనకు అవగతమవు తుంది. ఉదాహరణకు మహాభారత గాథను తీసికోండి. 14 ఏళ్ళ వనవాసనంతరము పాండవులు తిరిగి వచ్చి ఒడంబడిక ప్రకారం తమ రాజ్యభాగాన్ని తమకిమ్మని కోరగా, దుర్యోధనుడు తిరస్కరిస్తాడు. కనీసము 5 గ్రామాలిమ్మని ప్రాధేయపడగా దీనిని నిర్దయగా తిరస్కరిస్తాడు. అప్పుడు మహాపురుషుడు జగద్గురువుగా వచ్చిన శ్రీకృష్ణుడు రాయబారిగా వెళ్ళి పాండవుల కోర్కెను, కౌరవ రాజైన దుర్యోధనుని ముందుంచుతాడు. దుర్యోధనుడు వినకపోగా, పైపెచ్చు రాయబారిగా వచ్చిన కృష్ణుని బంధించుటకై యత్నించబోగా, తన విశ్వరూపాన్ని సభలో ప్రదర్శించి వారిని హెచ్చరిస్తాడు, కృష్ణుని విరాట్ స్వరూపాన్ని ఎదురు పక్షములోనున్న భీష్ముడు, ధృతరాష్ట్రుడు, విదురుడు చూడగలిగారు. తదుపరి తన మార్గదర్శనంలో మహా భారత యుద్ధంలో ధనంజయుని ద్వారా పాండవులకు విజయాన్ని చేకూర్చి దుష్టశిక్షణ, శిక్షరక్షణ ద్వారా తిరిగి భూమిపై ధర్మాన్ని ప్రతిష్ఠించాడు.

ఇదేవిధంగా పరమపూజ్య గురుదేవుల జీవితాన్ని గురించి చెప్పాలన్నా ఇదే స్థితి. అనేక వేల సంవత్సరాలు పట్టే పనిని వీరు వారి జీవితకాలంలో పూర్తిచేయవలసి ఉంది. రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానందుడు, ఆదిగురువు శంకరా చార్యులు, అరబిందో మహర్షి మున్నగు వారి జీవితాలను పరిశీలిస్తే ఇదే మనకు అవగతమవుతుంది.

స్వామి వివేకానంద 39వ సంవత్సరంలో అనారోగ్యంతో జీవితాన్ని చాలించాడు. అరవింద మహర్షి, రమణ మహర్షి ఏకాంతంలో మౌనంగా గడుపుచూ వారి వారి క్షేత్రాలకు పరిమితమైన పనిచేశారు. పరమపూజ్య గురుదేవులు 48

**'నేను-నా కుటుంబం' అని బ్రతికేవాడు నూతిలోని కప్పతో సమానం**

సంవత్సరాలు ఏకాంతంలో ఉన్నారు. 35 సంవత్సరాల్లో 3200 పుస్తకాలు వ్రాసి – 700 చోట్ల పీఠాలు, 3 వేల వరకు ప్రజ్ఞాపీఠాలు నెలకొల్పారు. పరమపూజ్య గురుదేవులు భవిష్యద్రష్ట ఆయన నోటి నుండి వెలువడిన మాట అక్షరాలా జరిగి తీరుతుంది. నా విషయంలో ఇదే జరిగింది.

నాకు చిన్ననాటి నుండి ఇంజనీయర్ కావాలని ఉండేది. దీనికి అనుగుణంగా నేను ఎమ్.పి.సి. గ్రూపు తీసుకుని సి.బి.ఎస్.ఇ. చదివాను. ఒకరోజు గురుదేవుల చేతికి మందు రాస్తూ ఉన్నాను. మాటల సందర్భంలో కుమారా నీవు డాక్టరు అవుతావు" అన్నారు. లేదు నేను ఇంజనీయర్ అవుతాను అన్నాను. బేటా! (కుమారా!) నా మాట వృథా కాదు, జరిగి తీరుతుంది అన్నారు. కాని నేను పట్టుదలతో ఇంజనీయర్ కావాలని నా ప్రయత్నాలు తీవ్రంగా చేయసాగాను. నాకు ఎప్పుడు గణితంలో అత్యధికంగా నూటికి నూరు మార్కులు వస్తూ ఉండేవి. కాని ఆ సంవత్సరము గణితంలో తగ్గి, బయాలజీలో ఎక్కువ మార్లు వచ్చాయి. నేను ఆశ్చర్యానికి లోనైనాను. పంత్ యూనివర్సిటీలో ఆనాడు ఉన్న చట్టమే మనగా, ఏ పాఠ్యాంశంలో మార్కులు ఎక్కువగా వస్తే ఆ పాఠ్యాంశానికి చెందిన కోర్సునే ఎన్నుకోవాల్సి ఉంటుంది. తత్ఫలితంగా నాకు మెడిసిన్‌లో సీటు ఇచ్చుట జరిగింది. ఇంజి నీరింగ్‌లో సీటు దక్కలేదు. ఈ రీతిగా అనేకసార్లు ఇంజినీరింగ్ చదవాలనెడి నా కోర్కెకు అంతరాయాలు కలుగుతూ వచ్చాయి. మార్గాంతరము లేక లండన్‌లో మెడిసిన్ చదివి డాక్టరు నయ్యాను. మరో సన్నివేశాన్ని గురుదేవులతో జరిగినది చెప్తాను. మహాపురుషులు విధిననుసరించి, కర్మ సిద్ధాంతాన్ని గౌరవిస్తారు. విధిని అతిక్రమించి చరించుటకు పూనుకోరు.

ఒక పర్యాయం గురుదేవులు జంషెడ్‌పూర్ వెళ్ళుట తటస్థించింది. అచ్చట ఒక శిష్యుడు గురుదేవులను ఇలా ప్రార్థించాడు. తన ప్రియమైన తమ్ముడు పరీక్షలో తప్పాడు. అతనిని పాస్ చెయ్యమని అర్థించాడు. గురుదేవులు వీలుకాదని నచ్చచెప్పయత్నించాడు. తిరుగు ప్రయాణమై గురుదేవులు రైలులో కూర్చున్నాడు. అయినప్ప టికి ఆ శిష్యుడు తన పట్టును వీడకుండా తన తమ్ముని పాస్ చెయ్యమని అర్థిస్తూ బయలుదేరిన రైలు వెంట పడ్డాడు. దీనిని గమనించిన గురుదేవులు కనికరించి అతనిని పాస్ చెయ్యుటకు అంగీకరించాడు. తత్ఫలితంగా అతనితోపాటు మరో 164 మంది పాసయ్యారు. అనగా ఇతని కన్నా 164 గురు ఎక్కువ మార్కులు సంపాదించి తప్పి ఉన్నారు. ఇదే గురుదేవుల చమత్కారము మరియు ఆయన అధిక తపశ్శక్తికి తిరుగులేని సాక్ష్యం.

మహా పురుషులు ప్రతివాని కష్టాన్ని తీర్చి, వారిని సంతుష్టుల చేయాలని తపిస్తూ తమ తపశ్శక్తిని ఖర్చు చేస్తుంటారు. లోకకళ్యాణానికై "సర్వేజనా సుఖినోభవన్తు – సమస్త లోకా సుఖినోభవన్తు" అనే దానిని నిజం చేయాలని అహర్నిశలు శ్రమిస్తుంటారు. పరమపూజ్య గురుదేవుల విషయంలో ఇది అక్షరాల నిజం.

ఒక పర్యాయం జీవన్ కిశోర్ బిర్లాగారు పదకొండు కోట్ల రూపాయలు గురుదేవునికి మందిర నిర్మాణార్థమై కానుకగా అందజేయబోయారు. శాంతికుంజ్‌లో గురుదేవులు ఈ కానుకను సున్నితంగా తిరస్కరిస్తూ, బిర్లాను వెంటనిడుకొని గంగానది తీరం వెంట నడువసాగారు. దారివెంట అర్ధనగ్నంగా ఉన్న యాచకులను, ఆకలితో అలమటించెడి వారిని చూపుతూ, వీరిని ఈ స్థితిలో ఉంచి, నేను మందిర నిర్మాణం ఈ ధనంతో చేసిన భగవంతుడు హర్షించడు అంటూ, ఆ ధనాన్ని పేదల ఉద్ధరణకై వినియోగించ వలసిందిగా బిర్లాను కోరారు. నడిచే దేవాలయాలుగా మనుష్యుల మార్చాలనెడి తన కోర్కెను, లక్ష్యాన్ని వెలిబుచ్చారు. ఈ దేశ ప్రజలంతా తన బిడ్డలే వీరందరి బాగోగులు చూచే బాధ్యత తనది అన్నారు.

అదేవిధంగా తన వాహనాన్ని నడిపే భాస్కర్ అనే వ్యక్తి మనస్సులోని కోర్కెను ఇలా తీర్చాడు.

భాస్కర్‌కు మసాలా దోసె తినాలనెడి కోర్కె బలీయంగా మనస్సులో నాటుకొంది. చేతిలో డబ్బులేదు తినాలంటే గురుదేవులకు నోరు విప్పి తన కోర్కెను వెల్లడించలేకపోతున్నాడు. మనస్సును చదువగల్గిన గురుదేవులు, భాస్కర్ మనస్సులోని ఆలోచనను పసిగట్టి మాతాజీని వెంట బెట్టుకొని బండిపై ఋషికేశ్ వెళ్ళాడు. మసాలా దోసెలు లభించే హోటల్ రాగానే బండిని నిలుపు చేయించి మూడు మసాలా దోసెలు ఆర్డరిచ్చి తెప్పించాడు. భాస్కర్ ఈ దోసెలలో ఉల్లిపాయ ఉన్నది. నేను మాతాజీ తినం, నీవే తిను అని నెమ్మదిగా భాస్కర్‌కు నచ్చచెప్పి అతని చేత మూడు దోసెలు తినిపించారు. దీనితో భాస్కర్‌ను, ఎన్నో రోజుల నుండి తపింపజేయుచున్న దోసెల కోర్కె ఒక్కసారిగా పూజ్యగురుదేవుల దయతో తీరింది. ఆనాటి నుండి భాస్కర్‌లో మరల దోసెల తినాలనెడి కోర్కె జనించలేదు. ఈ రీతిగా మహాపురుషులు తమను పూర్తిగా నమ్మి సమర్పణా భావంతో సేవ చేస్తూ తమ కర్తవ్యాలను నిర్వర్తించే వారి కోర్కెలను తీర్చుతూ వారిని సంస్కరిస్తూ ఉంటారు. ఈ రీతిలో పరమ పూజ్యగురుదేవులు, పరమవందనీయ మాతాజీలు తమ సంపర్కములోనికి వచ్చి, సంపూర్ణ సమర్పణతో సేవలందించిన కోట్లాది మందిని సంస్కరిస్తూ వారిని మానవులుగా, మహామానవులుగా తీర్చిదిద్దారు.

"మానవత్వం పరిమళించిన మహాఋషికి వందనం"
"బ్రతుకు అర్థం తెలియజెప్పిన పుణ్యమూర్తికి వందనం"

**ఆత్మీయతను పంచుకో - అనుబంధాల్ని పెంచుకో**

# ఉభయ తెలుగు రాష్ట్రాలలో జరిగిన వివిధ కార్యక్రమాలు

## అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా శిక్షణ కార్యక్రమాలు

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని దేవసంస్కృతి విశ్వవిద్యాలయం, శాంతికుంజ్, హరిద్వార్ ఇద్దరు యోగా శిక్షకులను హైద్రాబాద్, గాయత్రీ చేతనా కేంద్రానికి 12 జూన్ 2016న పంపించారు. వీరు 13వతేది సోమవారము డివైన్ ఇండియా యూత్ అసోసియేషన్ సభ్యులకు యోగా పురశ్చరణ తరగతుల నిర్వహించి తగిన శిక్షణను అందించారు.

15 జూన్ 2016న గాయత్రీ జ్ఞానమందిరం, స్వర్ణధామ నగర్, పాతబోయినపల్లికి వెళ్ళి అచ్చట 5 ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు యోగాశిక్షణతో పాటు యోగా విశిష్టత, దానిని ఆచరించుట, ఆసనాల ప్రాధాన్యతలను వివరించారు. దీనిలో దాదాపుగా 800 మంది బాలబాలికలు పాల్గొన్నారు. ఆ పాఠశాలలు వరుసగా (1) నాగార్జున హైస్కూలు, వినయ్‌నగర్, మేడ్చల్ (2) జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాల, సాయిబాబా నగర్, మేడ్చల్ (3) జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, ఎయిర్ పోర్సు కాలని, మేడ్చల్ (4) సంస్కార్ హైస్కూల్, మేడ్చల్ (5) పి.వి.కె. జిల్లా పరిషత్తు హైస్కూల్, మేడ్చల్. ఈ పాఠశాలలలోని విద్యార్థినీ, విద్యార్థులు అమిత శ్రద్ధాసక్తులతో శాంతికుంజ్ ప్రతినిధులు నేర్పిన యోగాను అభ్యసించారు. పై పాఠశాలల యాజమాన్యాలను ప్రేరేపించి, విద్యార్థులు ఈ శిక్షణలో పాల్గోనేలా ప్రాంతీయ మండలి విద్యాశాఖాధికారి అయిన శ్రీ రాజారెడ్డిగారి కృషి మిగుల అభినందనీయం. శారీరక ఆరోగ్యంతోపాటు యోగ మానసిక ఆరోగ్యాన్ని అందిస్తుందని ఉద్బోదించుట జరిగింది. గాయత్రి పరివార్ కృషిని అభినందించుట జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా మరియు వ్యసన విముక్తి ప్రదర్శన ద్వారా గాయత్రీ పరివార్ సమాజ అభ్యున్నతికి అందించుచున్న వివిధ కార్యక్రమాలు ప్రజలకు అవగతమైనాయి. ఇట్టి కార్యక్రమాలను తరచుగా ఏర్పాటు చేసి సమాజాన్ని జాగృతపరుస్తూ సమాజాన్ని ప్రగతిపథం వైపు నడచేలా చేస్తుండవలసిందిగా ప్రజలు తమ అభిప్రాయాలను వ్యక్తపరచారు.

గాయత్రీ జ్ఞానమందిరము తెలంగాణా రాష్ట్ర ప్రగతికై ప్రారంభించిన గాయత్రీ యజ్ఞ శృంఖలను కొనసాగిస్తూ కరీంనగర్ పట్టణములో మరియు కామారెడ్డి పట్టణము చుట్టుప్రక్కలనున్న గ్రామాలైన వదల్‌పర్తి, నార్లపూర్, క్యాసంపల్లి, చింతమాన్‌పల్లి, మరియు కంచర్ల గ్రామాలలో యజ్ఞాలను 6 జూన్ నుండి 10 జూన్ 2016 వరకు నిర్వహించారు. గాయత్రీ యజ్ఞము పట్ల, పూజ్యగురుదేవుల సాహిత్యము పట్ల అవగాహన పెరిగి మంత్రలేఖనము, గాయత్రీ చాలీసా, గాయత్రి ఉపాసన, గృహస్థ జీవనం ఒక తపోవనం, ధైర్యం విడువకండి మున్నగు పుస్తకాలు విరివిగా అమ్ముడుపోయాయి. ప్రజలలో గాయత్రీపట్ల, గాయత్రీ యజ్ఞము పట్ల చైతన్యం పెరిగింది.

పై కార్యక్రమాల విజయానికై గాయత్రీ పరివార్ దృఢ సంకల్పం గైకొని నిర్విరామంగా కృషి చేసింది. శ్రీ హీర్‌సింగ్‌రాజ్ పురోహిత్, శ్రీ తోషన్ సాహు, శ్రీ చంద్రశేఖర్, శ్రీమతి పార్వతి దంపతులు యజ్ఞాలు నిర్వహిస్తూ కార్యక్రమ విజయాలకు తమ తోడ్పాటునందించారు. ప్రాణాంతక వ్యసనవిముక్తి ప్రచారం వ్యసనములైన మద్యపానము, ధూమపానము, భంగుసేవనము, తంబాకు సేవనము మున్నగునవి ఎన్నో కుటుంబాలను ఆర్థిక పతనము వైపు మళ్ళించి, కటిక దారిద్ర్యాన్ని అనుభవింపజేస్తున్నవి. ఈ దుర్భాగ్య జీవులను తిరిగి చైతన్యవంతులగావించి, వారికి గల ప్రాణాంతక వ్యసనాలను మాన్పించి, సన్మార్గంలో నడిపించాలనెడి సంకల్పంతో గాయత్రీ పరివార్ నడుం బిగించింది.

గాయత్రీ మంత్రంలోని 19వ అక్షరమైన "యో" అనునది. హానికారకములైన దుర్వ్యసనాలకు దూరంగా ఉండమని మనలను ప్రబోధించుచున్నది. వ్యసనములు తొలుత మిత్రులవలె మన శరీరములో ప్రవేశించి చివరకు శత్రువుల్లా మనల నాశనము చేస్తాయి! ఈ దుర్వ్యసనాలు మనుష్యులనే కాక, సామ్రాజ్యాలను సమూలంగా నాశనం చేశాయి. మొగల్ సామ్రాజ్య పతనం దీనివలనే జరిగింది. రోమన్, గ్రీకు ఈజిప్టు సామ్రాజ్యాలు ఇట్లే పతనమయ్యాయి.

**చిన్న గిన్నెలో నీళ్ళు పోసి పక్షుల దాహం తీర్చు - సంకల్ప స్థాయి ముఖ్యం కాదు**

పై వ్యసనాలు ఏ రీతిగా మనుష్యులను, సమాజాన్ని, జాతుల చివరకు దేశాలను నాశనం చేసింది తెలియజెప్పెడి నినాదాలను వ్రాసిన అట్టలను చేబూని, నినాదాలు చేస్తూ కార్మికులు అధికంగా ఉండెడి కాలనీలలో ప్రచారం చేస్తూ ప్రజలను చైతన్యపరుస్తూ 12 జూన్ 2016న గాయత్రీ పరివార్ యువత, గాయత్రీ జ్ఞానమందిరం స్వర్ణధామ్‌నగర్‌ను కేంద్రముగా చేసి ఊరేగింపుని నిర్వహించింది. జంటనగరాల లోని వివిధ ప్రాంతాలలో ఉన్న గాయత్రీ పరివార్ యువత దీనిలో అధిక సంఖ్యలో పాల్గొని పౌరులను జాగృత పరచుట జరిగింది. వీరినందరిని యుగశక్తి గాయత్రి అభినందించుచున్నది.

## కడప జిల్లాలో

కడప జిల్లా ముద్దనూరు మండలములోని గంగాదేవిపల్లె గ్రామములో 31 మే, 2016న పంచకుండీ గాయత్రీ హవన యజ్ఞము హనుమజ్జయంతి సందర్భముగా నిర్వహించుట జరిగింది. యజ్ఞసమయంలో గాయత్రీ పరివార్ లక్ష్యాల గురించి, పూజ్య గురుదేవుల గురించి, వారి ఆశయాల గురించి యజ్ఞములో పాల్గొన్న రమారమి 200 మందికి వివరించి చెప్పుట జరిగింది. ఈ యజ్ఞము గ్రామపెద్దలైన శ్రీ భాస్కరరెడ్డి, సుబ్బారెడ్డి, వకీలు గార్ల సహాయ సహకారములతో శ్రీయుతులు రామకేశవులు, సత్యనారాయణరెడ్డి, బ్రహ్మానందరెడ్డి శ్రీరామకృష్ణ గాయత్రీ పరివార్ సభ్యుల సారథ్యంలో నిర్వహింపబడింది.

## మంగళగిరిలో

15 జూన్ 2016 గాయత్రీ జయంతిని పురస్కరించుకొని మంగళగిరి శాఖ గాయత్రి పరివార్ ఆధ్వర్యంలో నవకుండీ గాయత్రీ యజ్ఞమును మహావీర్ గోశాలలో నిర్వహించారు. శ్రీ అశోక్‌గౌడ్ డి.ఎస్.పి లక్ష్మీరాజేశ్వరి దంపతులు కలశ పూజన నిర్వహించారు. తదుపరి సంస్కారముల ప్రక్రియలో భాగంగా కుమారి మానసశర్మ (తండ్రి సీతారామశర్మ) కు జన్మదిన సంస్కారం నిర్వహించారు. గోపూజను కూడా చేశారు.

భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో యజ్ఞాన్ని నిర్వహించి తీర్థప్రసాదలందుకొన్నారు. పై కార్యక్రమాన్ని పరివార్ ప్రముఖులైన శ్రీ పేర్ల తాతారావు, భోజనపల్లి ప్రసాద్, పేర్ల వెంకటేశ్వరరావు, యం.శేషిరెడ్డి మరియు శ్రీమతి వల్లభనేనివాణి, రమాదేవి, హారికలు పర్యవేక్షించారు.

## నెల్లూరు జిల్లాలో

గాయత్రీ పరివార్ నెల్లూరు శాఖ కార్యాలయంలో మే నెల 2016లో నిర్వహించిన కార్యక్రమ వివరాలు. మే 1వ తేది పంచకుండీ గాయత్రీ యజ్ఞము 8,15,22,29వ తేదీలలో ఏక కుండీ గాయత్రీ యజ్ఞాలు నిర్వహించారు. ఈ యజ్ఞాలను శ్రీ తిరునారాయణ, శ్రీమతి భావన, శ్రీ రమణమూర్తి, శ్రీమతి సురేఖగార్లు నిర్వహించారు.

## అనంతపురం జిల్లాలో

అనంతపురం జిల్లా, కనకల్లు (మం) కొండవెనుకపల్లి మరియు మించెలవారి కోట గ్రామాల్లో జూన్ 4,5 తేదిలలో నవకుండీయ గాయత్రీ హవన యజ్ఞము, దీపయజ్ఞము గ్రామ పెద్దలైన ఎ.వి.రఘురామిరెడ్డి, రమణారెడ్డి, గంగిరెడ్డి వెంకట స్వామిగార్ల సహాయ సహకారములతో (కడప జిల్లాలో యజ్ఞం చేసి) గాయత్రీ పరివార్ సభ్యుల సారథ్యంలో నిర్వహించుట జరిగింది. తదుపరి ప్రసాద వితరణ జరిగింది. 20 యుగశక్తి గాయత్రీ మాసపత్రికలకు చందాదారులను చేర్పించుట జరిగింది.


## అందరికీ ఆహ్వానము

గాయత్రీ జ్ఞానమందిరము, స్వర్ణధామనగర్ (మిలిటరీ డైరీఫామ్ ఎదురుగా) పాతబోయినపల్లిలో ***"వందనీయ మాతా భగవతీదేవిశర్మ భోజనశాలను"*** గాయత్రీ పరివార్ సౌకర్యార్థమై నూతనంగా నిర్మించారు.

**భవన ప్రారంభకులు**

(1) ఆదరణీయ ***డా॥ బ్రిజ్‌మోహన్‌గౌడ్***
శాంతికుంజ్, హరిద్వార్

(2) ఆదరణీయ ***శ్రీ అశ్విని సుబ్బారావు***
గాయత్రీ పరివార్ దక్షిణ భారత ప్రధాన సంచాలకులు

**ప్రారంభ తేదీ :** సోమవారము 08.08.2016
**సమయం:** ఉదయం 10 గం॥లకు

**అందరూ ఆహ్వానితులే**

**- గాయత్రీ జ్ఞానమందిరము**


**వర్తమానంలో జీవించు, వర్తమానాన్ని ఆస్వాదించు, వర్తమానాన్ని సద్వినియోగం చేసుకో - ఇదే విజయానికి మూలం**